# క్రాంతి


లోపలి పేజీల్లో...

కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లు.................7
లిబియాపై సామ్రాజ్యవాద.................12
ముప్పై ఏళ్ల దండకారణ్య.........మధ్యపేజీ
దంతెవాడ జిల్లాలో .................23
అమరవీరులకు జోహార్లు.................26
పోరాటాలు-ప్రతిఘటన-సభలు.........29



సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., ఎస్.టి., ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక

సంపుటి: 35 సంచిక: 2 మార్చి - ఏప్రిల్ 2011 వెల: పది రూపాయలు


# సహాయ నిరాకరణ, మిలియన్ మార్చ్‌ల బాటలో ప్రజా వెల్లువలను సృష్టించండి!

# ప్రజలందరి ఐక్యతతో ప్రత్యేక తెలంగాణ సాధనకై పోరాడండి!!

ప్రత్యేక తెలంగాణ సమస్యపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వహించి, తెలంగాణ ఏర్పాటును ఎలాగైనా అటకెక్కించాలని ప్రయత్నిస్తున్నది. తెలంగాణ సమస్యకు పరిష్కారాల కోసం ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ కమిటి, దాని నివేదిక అంతా బూటకమని తేటతెల్లమైంది. దేశంలో ఒక రాష్ట్రం ఏర్పాటు కోసం తీవ్ర స్థాయిలో ఉద్యమం జరుగుతూ, నాలుగుకోట్ల తెలంగాణ ప్రజానీకం ముక్తకంఠంతో ప్రత్యేక తెలంగాణ ఏర్పాటును డిమాండ్ చేస్తున్నప్పటికీ, తెలంగాణ సమస్య సున్నితం, జటిలమైనది, ఏకాభిప్రాయ సాధన అవసరం అంటూ ప్రధానమంత్రి మన్మోహన్ రాగాలు తీస్తున్నాడు. దీనర్థం తెలంగాణ సమస్యను ఇంకా నాన్చి, ఉద్యమాన్ని నీరుగార్చాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదనేది స్పష్టం. కాంగ్రెస్ నాయకత్వంలోని యు.పి.ఎ ప్రభుత్వ మోసపూరిత కుట్రలను అర్థం చేసుకున్న తెలంగాణ ప్రజలు తెలంగాణ సాధనకు పోరాటమే ఏకైక మార్గంగా ఎంచుకున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యమం నానాటికీ తీవ్రరూపం దాల్చుతున్నది.

ఈ క్రమంలో 'రచ్చబండ' కార్యక్రమంలో గ్రామగ్రామాన తెలంగాణ ప్రజలు ప్రభుత్వ నిర్లక్ష్య, మోసపూరిత వైఖరిని తమ ఆగ్రహావేశాలతో రచ్చకీడ్చారు. చీపుర్లు, కారంపొడి, కోడిగుడ్లు, చెప్పులతో అడుగడుగునా ప్రజలు అధికారులకు స్వాగతం పలికారు. తెలంగాణ వ్యాప్తంగా ఏ గ్రామంలో కూడా రచ్చబండ కార్యక్రమం జరగకుండా తీవ్రంగా ప్రతిఘటించారు. అనేక చోట్ల అధికారులను రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించనీయకుండా తిప్పి పంపించారు. కాంగ్రెస్ నాయకులు, మంత్రులు, ఎంఎల్యేలు తాము తమ ప్రాంతాల్లో తిరగలేకపోతున్నామనీ, తెలంగాణ పై ఏదో ఒకటి తేల్చకపోతే తమకు పుట్టగతులు వుండవనీ అధిష్టానం దగ్గర మొరపెట్టుకున్నారు. ముఖ్యమంత్రి పాల్గొన్న ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం మజ్జుగూడెంలో మహిళలు అధికారులను, మంత్రులను నిలదీశారు. తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు.

వరంగల్ జిల్లా మారుమూల గ్రామం రాయినిగూడెంలో మార్చి 10న రచ్చబండ కార్యక్రమం ఈ నిరసనలకు పరాకాష్టగా మారింది. ముఖ్యమంత్రి స్వయంగా పాల్గొనే ఇక్కడి రచ్చబండ సభను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టింది. అప్పటికే తెలంగాణ వ్యాప్తంగా రచ్చబండకు వ్యతిరేకంగా నిరసనలు వెల్లువెత్తుతుండటంతో వేలాది పోలీసు బలగాలను మొహరించారు. కొద్ది రోజులు ముందుగానే ఆ ప్రాంతాన్నంత తమ చేతుల్లోకి తీసుకుని డేగకళ్ళతో నిఘావేశారు. రక్షణ ఏర్పాట్లు పర్యవేక్షించడానికి రెండు రోజుల ముందుగానే వచ్చిన మంత్రి పొన్నాల లక్ష్మయ్యకు మహిళలు తెలంగాణ నినాదాలతో హోరెత్తించి దడ పుట్టించారు. ఆ గ్రామం మన ఆర్గనైజేషన్ ప్రాంతంలోనిది కావటం అంతకుముందే రచ్చబండను బహిష్కరించమని మావోయిస్టుల పోస్టర్లు పడడంతో ఇక్కడ బహిష్కరణ వెనక మావోయిస్టులున్నారనీ ప్రచారం జరిగింది. ఎట్టి పరిస్థితుల్లో కూడా రచ్చబండ కార్యక్రమాన్ని విజయవంతం చేశామనిపించుకోవాలని ప్రభుత్వం పంతానికి పోయింది. ఎంత పకడ్బంది ఏర్పాట్లు చేసినా తెలంగాణ కోసం కంకణబద్ధులైన

మహిళలు పద్మవ్యూహాన్ని ఛేదించినట్లు పోలీసు రక్షణ వలయాన్ని ఛేదించుకుని ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్న వేదిక వద్దకు దూసుకుపోయి తెలంగాణ నినాదాలతో కదంతొక్కారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను బలంగా చాటారు. ఇందులో విద్యార్థినులు ఎంతో చైతన్యంతో సాహసంతో ముందు నిలిచారు. మొత్తం మీద తెలంగాణలో మసకబారిన తమ ప్రతిష్టను తిరిగి నిలబెట్టుకోజూసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజల నిరసనలతో అది పెద్ద గుదిబండగా మారింది. తెలంగాణలో రచ్చబండను ప్రజలు పోరాట వేదికగా మార్చివేశారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పార్లమెంటులో బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ 'ఆంధ్రప్రదేశ్' అవతరణ వల్ల తెలంగాణ ఉద్యోగవర్గం కోల్పోయిన ముల్కీ రూల్స్, 610 జి.ఓ, గిర్‌గ్లాని కమిషన్ అమలు, రాష్ట్రపతి ఉత్తర్వుల ఉల్లంఘన, ఫేర్‌షేర్' మేరకు సెక్రటేరియట్‌తో పాటు అన్ని డిపార్ట్‌మెంట్లలో తెలంగాణ ప్రజల వాటా కోసం ఫిబ్రవరి 17 నుండి మార్చి 4 వరకు జరిపిన తెలంగాణ ఉద్యోగ, కార్మికుల సహాయనిరాకరణ పోరాటం చారిత్రాత్మకంగా నిలిచి పోనుంది.

తమజీతభత్యాలు, ఇంక్రిమెంట్లు, సర్వీసురూల్స్ కోసం పోరాడే ఉద్యోగ సంఘాలన్ని అనూహ్యంగా ఏకమయ్యాయి. యాభైనాలుగేండ్లుగా రాజకీయ పార్టీల, నాయకుల విద్రోహాలకు తెలంగాణ ప్రజలు కోల్పోయిన కొలువులు, నిధులు, నీళ్ళు, విద్య, వైద్యం, విద్యుత్ తదితరాల కోసం డిమాండ్ చేస్తూ ఆయా రంగాల ఉద్యోగులు, కార్మికులు, పోరాటంలో కదంతొక్కారు. వీటితోపాటు విద్యార్థుల అసెంబ్లీ ముట్టడులు, లాయర్ల రాజ్‌భవన్ ఆందోళనలు మొత్తం తెలంగాణ కోట్లాది ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షను ఆకాశానికెత్తాయి.

ఏనాడు తమ సమస్యలు తప్ప ప్రజల సమస్యల గూర్చి తమ ఎజెండాలో పెట్టుకోని సంఘాలు, క్యాడర్లు, హోదాలు పక్కనపెట్టి ఏకైక డిమాండ్ తెలంగాణ కోసం గొంతెత్తి నినదించారు. కార్యాలయాలను దిగ్బంధించడం, ఆటపాటలు, వంటా వార్పులు, సభలు, సమావేశాలు, ధూంధాంలతో తెలంగాణ వ్యతిరేక, సీమాంధ్ర నాయకుల మోసపూరిత విధానాలను తెలంగాణ పది జిల్లాలాతోపాటు ప్రపంచానికి చాటడంలో విజయం సాధించారు. అటెండర్ నుండి గెజిటెడ్ అధికారి వరకు, గ్రామ సచివాలయం నుండి రాష్ట్ర సచివాలయం వరకు పాలన స్థంభించిపోవటం మున్నెన్నడూ చూడనిది. ఏళ్ళతరబడిగా కార్యాలయాల్లో వున్న అధికారి, సబార్డినేట్ లాంటి అంతరాలనీ పక్కకుపోయి వివిధ కార్యాలయాల్లో యాజమాన్యాల్లో పని చేస్తున్న వివిధ క్యాడర్లకు, కులాలకు మతాలకు చెందిన ఉద్యోగులంతా ఒక్కటై పదహారు రోజులపాటు ప్రజల్ని, పార్టీలను, పార్లమెంట్ అసెంబ్లీలను, అవకావవాద పార్టీలను స్పందింప జేశారు. నిజమైన ప్రజాందోళన ప్రజాస్వామిక పద్ధతుల్లో ఎట్లా సాగాలో తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చడం కోసం ఉద్యోగుల పోరాటం స్ఫూర్తి నిచ్చింది.

నిజానికి ప్రజలను సహాయ నిరాకరణలో భాగం చేస్తూ, ప్రభుత్వాన్ని ఆర్థిక దిగ్బంధనం చేయడానికి బస్‌లో టికెట్ తీసుకోకపోవటం విద్యుత్, నీటిబిల్లులు, పన్నులు చెల్లించొద్దన్న పిలుపు రాజకీయ పార్టీలు చిత్తశుద్ధితో ప్రచారం చేయడంలో, ప్రజలను సమాయత్తం చేయడంలో వైఫల్యంవల్ల సాగాల్సినంత ఉధృతంగా సాగలేదు. ఉద్యోగుల సహాయనిరాకరణ సఫలీకృతం అయింది.

అంత ఉవ్వెత్తున తెలంగాణ ప్రజల ఆకాంక్షను ఎలుగెత్తి చాటిన పోరాటం అనూహ్యంగా ఉద్యోగుల్ని, ప్రజల్ని, ఉద్యమకారుల్ని నీరుగార్చే పద్ధతుల్లో నిలిపివేయటం ఆవేదనను, ఆందోళనను కలిగించింది. అయితే అన్ని జిల్లాలలోని వివిధ సంఘాల నాయకులు మాకు నెలజీతం రాకపోయినా ఫర్వాలేదు, నెల రోజులు తెలంగాణ పోరాటానికి విరాళమిచ్చినం అనుకుంటాంగానీ ఆందోళన విరమించొద్దని చెప్పటం తెలంగాణ పోరాటానికి ఉద్యోగుల, ప్రజలు ఆకాంక్షకు పతాక స్థాయిలో నిలిచింది.

సంఘనాయకులు చెపుతున్న కారణాలేవైనప్పటికీ తెలంగాణ కోసం గొంతెత్తి తెలంగాణ ఉద్యోగుల పోరాటానికి సంఘీభావంగా పార్లమెంట్‌లో అసెంబ్లీలో, ప్రజల్లో బలమైన పోరాటాన్ని పెంచలేదు. కేంద్రం అనుసరించిన సాచివేత వైఖరితో, మే వరకు ఎలాంటి నిర్ణయం రాదన్న ఉద్దేశ్యంతో రాజకీయ పార్టీలు, నాయకులు ఉద్యోగ వర్గాన్ని పోరాటాన్ని వెనుకకునెట్టి పార్లమెంట్‌లో ఒత్తిడిని పెంచకుండ లాబీలతోనే పబ్బం గడపాలని చుశారు. మరొకవైపు ఎన్నో ప్రయోగాలతో, జీతాలు నిలుపుదల పేరుతో ప్రభుత్వం బెదిరించ పూనుకోవడాన్ని కూడా ఉద్యోగ వర్గం ఖాతరు చేయలేదు. కానీ నాయకత్వం తొందరపాటు నిర్ణయంతో పాటు నాలుగు లక్షల ఉద్యోగుల ఆకాంక్షలకు భిన్నంగా విరమించటంతో సహజంగానే అనేకచోట్ల నాయకుల దిష్టిబొమ్మల దగ్ధం, నిరసన స్వరాలు పెల్లుబికాయి.

ఉద్యోగుల పోరాటానికి తాత్కాలిక విరమణ ప్రకటించగానే అసెంబ్లీలో తెలంగాణ ఎమ్మెల్యేలు హాజరై, కొందరు హజరు కాకుండా తమ వైఖరులు ప్రదర్శించారు. విద్యార్థులు తమ ఆకాంక్షల్ని నీరుగార్చే నాయకుల్ని ఎట్లా ఎదిరిస్తారో వాటికనుగుణంగా నడిచి వారిని ఎలా ఆదరిస్తారో ఆయా సందర్భాల్లో స్పష్టం చేశారు.

నైరాశ్యంతో ఆత్మహత్యలకు పాల్పడే విద్యార్థుల బలిదానాలు ఒకవైపు రాజకీయ పార్టీల అవకాశవాద హత్యలుగా మారిపోతుంటే మరొకవైపు పోరాటాల ద్వారానే తెలంగాణ సాధిస్తామని

విద్యార్థినులు, విద్యార్థులు ఫిబ్రవరి 21న దిగ్బంధనాలను ఛేదించుకుని అసెంబ్లీని ముట్టడించి వారి సాహసాన్ని నిరూపించారు. ఫిబ్రవరి 21, 22, 23 తేదీల్లో తెలంగాణలో జరిగిన పరిణామాలను గమనిస్తే మొత్తం రాష్ట్ర పాలనా వ్యవస్థే స్థంభించి పోయింది. ప్రభుత్వ ఉద్యోగుల సహాయనిరాకరణలు కొనసాగుతూనే వున్నాయి. ఉద్యమాన్ని అణిచివేయడానికి భద్రతాదళాలు బస్తీలపై (మణికేశ్వరినగర్), ముఖ్యంగా ఉస్మానియ యూనివర్సిటీలో ఆ మూడు రోజులు రాత్రి 12గంటల వరకు రబ్బరు బుల్లెట్ల శబ్దాలతో ఒక భయానక వాతావరణాన్ని సృష్టించారు. కాల్చిన రబ్బరు బుల్లెట్లు యూనివర్సిటిలో కుప్పలుగా వున్నాయి. ఎంతోమంది విద్యార్థులు పోలీసు కాల్పుల్లో గాయపడ్డారు. మరెంతోమందిని అక్రమ కేసులు పెట్టి ప్రభుత్వం జైళ్ళలో నిర్బంధించింది. తెలంగాణ ప్రాంతం మొత్తాన్ని పోలీసుక్యాంపుగా మార్చి అణచివేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కుట్ర ప్రజలకు స్పష్టంగా అర్థమైంది. మంద అశోక్ అమరత్వం పోరాట రూపాన్ని మార్చింది. లక్షలాది ప్రజల రైలురోకోలతో 'పల్లె పల్లె పట్టాలపైకి కదిలి రాష్ట్రాన్ని స్థంభింప జేశాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక వర్గాలన్నీ పోరాట దీక్షలు కొనసాగించాయి.

విరమణకు కారణాలేవైనా పదహారు రోజుల ఉద్యోగుల పోరాటం ఒక అడుగు వెనకకు రెండు అడుగులు ముందుకు దూకే పోరాట స్ఫూర్తిని లక్షలాది ఉద్యోగుల్లో రగిలించింది. సహాయ నిరాకరణ ఉద్యోగుల పోరాటంగానే పరిమితం కాకుండా పోరాటాన్ని నీరుగార్చాలని చూసే నాయకులను ఎండగట్టి విస్తృతంగా ప్రజలను భాగస్వాములను చేయడం ద్వారా తెలంగాణ నుండి వనరులు, నిధులు తరలిపోకుండా మరింత బలంగా సంపూర్ణ సహాయనిరాకరణకు సన్నద్ధం కావల్సివున్నది.

స్వప్రయోజనలకోసం ఉద్యమాలను నీరుగార్చాలని బూర్జువా స్వార్థ నాయకులు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ప్రజా పోరాటాలు ప్రపంచంలో ఎక్కడ జరిగినా అవి పోరాట ప్రజానీకానికీ స్ఫూర్తినిస్తూనే వుంటాయి. రాజకీయ పార్టీల నాయకులు సహాయనిరాకరణను విరమింప జేసినా తెలంగాణ ప్రజల పోరాట దీక్ష ఈజిప్టు ప్రజల పోరాట స్ఫూర్తితో "మిలియన్ మార్చ్" రూపం తీసుకుంది.

మార్చి 10న లక్షలాది ప్రజలు శాంతియుతంగా నిర్వహించ తలపెట్టిన మిలియన్ మార్చ్‌ను విఫలం చేసి తద్వారా తెలంగాణ వాదాన్ని, ఉద్యమాన్ని బలహీనపరిచే ఏకైక లక్ష్యంతో చివరిదాకా విఫల ప్రయత్నాలు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చివరికి ఘోరంగా భంగపడ్డాయి. మిలియన్ మార్చ్‌కు అనుమతి ఇవ్వకుండా, మార్చ్‌కు పిట్టను కూడా రానివ్వబోమంటూ ప్రభుత్వం తన పోలీసు బలగాలతో యావత్తు తెలంగాణపై వేయికళ్ళతో నిఘావేసింది. మిలియన్ మార్చ్‌కు జిల్లాల నుండి తరలి వస్తున్న వాహనాలను అడ్డుకొని, లాఠీఛార్జీలు జరిపి, లక్షకుపైగా ప్రజలను అరెస్టుచేసి నిర్బంధించి మార్చ్‌ను భగ్నం చేయాలని చూసింది. మిలియన్ మార్చ్‌కు వేదికైన ట్యాంక్‌బండ్‌ను ప్రభుత్వం ఆనాడు పూర్తిగా తమ అధీనంలోకి తీసుకుంది. అటువైపు వెళ్ళే దారులన్నింటినీ మూసేసి రాజధాని నగర వాప్తంగా 144 సెక్షన్ విధించింది. ట్యాంక్‌బండ్‌కు తరలి వస్తున్న ఉద్యమకారులను అడ్డుకొని, అదుపులోకి తీసుకుని నిర్బంధించే క్రమంలో తల్లితో పాటు వచ్చిన ఆరేళ్ళ బాలుడిని కూడా పోలీసులు వదల్లేదు. తల్లి నుండి వేరుచేసి అదుపులోకి తీసుకుని వాహనంలో పడేశారు. ప్రభుత్వాలు తెలంగాణ ఉద్యమంపై అవలంభిస్తున్న నియంతృత్వ ధోరణికి ఇది నిదర్శనం.

ఎన్ని అడ్డంకులు కల్పించినా, ఎంతనిర్బంధం ప్రయోగించినా దశాబ్దాలుగా న్యాయపోరాటం సాగిస్తున్న తెలంగాణ ప్రజలను ఇవేవీ అడ్డుకోలేక పోయాయి.

కత్తుల కంచెలు చిత్తయ్యాయి. బారికేడ్లు బద్దలయ్యాయి. ఉవ్వెత్తున పొంగిన ఉద్యమ ఆకాంక్షల ముందు ప్రభుత్వ ఆంక్షలు తలవంచాయి. ట్యాంక్‌బండ్ పైకి ఉదయం 11.30కు విద్యార్థులు మొదటగా ఎక్కారు. ఆ తర్వాత సికింద్రాబాద్ వైపు నుంచి న్యాయవాదులు వచ్చారు. ట్యాంక్‌బండ్ చుటుపక్కల అదను కోసం ఎదురు చూస్తున్న తెలంగాణ పోరాటవాదులు వ్యూహాత్మకంగా అన్ని వైపుల నుంచి పోలీసులను తోసుకొని ట్యాంక్‌బండ్‌ను ఒక్కసారిగా కమ్ముకున్నారు. మద్యాహ్నం 3 గంటలకల్లా అడ్డంకులన్నిటినీ ఛేదించుకొని తెలంగాణ ఉద్యమ ఊరేగింపు జనసాగరమై టాంక్‌బండ్‌ను ముంచెత్తింది. ప్రత్యేక తెలంగాణ సాధించుకు తీరుతామనీ ప్రతినబూనింది. అంతేకాదు ప్రభుత్వాలు ఒక్క వేదికకు అడ్డుపడితే అది ఫలించకపోగా మిలియన్ మార్చ్‌కు తెలంగాణ వ్యాప్తంగా లక్ష వేదికలు తయారయ్యాయి. వీటిలో ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లు కూడా భాగమయ్యాయి. ట్యాంక్ బండ్‌కు తరలివస్తున్న ప్రజలను ఎక్కడ అడ్డుకుంటే, ఎక్కడ నిర్బంధిస్తే అక్కడే మిలియన్ మార్చ్‌కు వేదికగా చేసుకొని వారంతా తెలంగాణ సాధన కోసం హృదయపూర్వకంగా ప్రతిజ్ఞ చేశారు. నిర్బంధాలతో, అణచివేతలతో ఏ శక్తీ తెలంగాణ గొంతును నొక్కలేదని ప్రజలు నిరూపించారు. మార్చ్ 10న హైదరాబాద్‌లో 'మిలియన్‌మార్చ్'ను విజయవంతం చేశారు.

టాంక్‌బండ్‌పై జరిగిన మిలియన్ మార్చ్ సందర్భంగా అక్కడ వున్న కొన్ని విగ్రహాలపై, మీడియాపై దాడి జరిగింది. కోట్లాది ప్రజల మద్దతును ప్రోది చేసుకుంటూ ముందుకు సాగుతున్న తెలంగాణ ఉద్యమంలో ఇలాంటి అపశృతులు దొర్లటం బాధాకరం. ఇందుకు ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత. శాంతియుతంగా జరిగే ఊరేగింపుకు అనుమతినిచ్చివుంటే ఈ దురదృష్టకర పరిణామం జరిగివుండేదికాదు. నిర్బంధాలతో తెలంగాణ ఉద్యమాన్ని

అడ్డుకోలేరనేది చరిత్రలో ఇప్పటికే ఎన్నోసార్లు రుజువైంది. అయినా సీమాంధ్ర పెట్టుబడిదారుల, దోపిడి దారుల కొమ్ముగానే ప్రభుత్వం తన శుష్క ప్రయత్నాలు మానుకోవటంలేదు. శాంతియుతంగా మిలియన్‌మార్చ్ నిర్వహిస్తామని హామీ యిచ్చినప్పటికీ, అనుమతినివ్వక ప్రభుత్వం నిర్బంధంతో విఫలం చేయటానికే చూసింది.

తెలంగాణ పట్ల సీమాంధ్ర పాలకుల వివక్ష ఎల్లెడలా స్పష్టమవుతూనే వుంది. ట్యాంక్‌బండ్‌పై విగ్రహాల స్థాపనలో కూడా వివక్ష వున్నదనే భావన తెలంగాణ ప్రజల్లో చాలా కాలంగానే వుంది. పోరాటాల, రక్తతర్పణల చరిత్రతో ప్రపంచంలోనే పేరెన్నికగన్న తెలంగాణ గడ్డన ట్యాంక్ బండ్‌పై స్థానం పొందగల గొప్పవ్యక్తులే లేరా? దశాబ్దాల తరబడి వివక్ష, దోపిడి, అణచివేతలకు గురవుతున్న ప్రజల భావోద్వేగాలు ఇటువంటి పరిణామాలకు దారితీయటంలో ఆశ్చర్య పోవసిందేమీ లేదు. ప్రభుత్వ దుర్మార్గపు విధానాలే ఉద్యమాన్ని విధ్వసంవైపు పురిగొల్పుతున్నాయి.

రాజ్యమే ప్రజా ఉద్యమాల్లోకి విచ్ఛిన్నకర శక్తులను చొప్పించే అవకాశాలు కూడా లేకపోలేదు. నిర్బంధ విధానాలతో ప్రజలను ఉద్యమకారులను రెచ్చగొట్టి ప్రజల ఆగ్రహావేశాలు తీవ్రమైనప్పుడు ఆశక్తులతో విధ్వంసం సృష్టించి, ఉద్యమాలను బద్‌నాం చేసి, విభేదాలు రెచ్చగొట్టే కుట్రలకు పాల్పడే అవకాశాలను కాదనలేం. ఆ తరువాత జరిగిన ఘటనలను సాకుగా చూపి రాజ్యం తన అణచివేతకు సాధికారిత కల్పించుకోవడానికి ప్రయత్నించిన ఉదంతాలు ప్రజా ఉద్యమాల చరిత్రలో ఎన్నో వున్నాయి. ఇటువంటి కుట్రల్లో, వీటిని అమలు చేసే యంత్రాంగాన్ని తయారు చేయటంలో కాంగ్రెస్ ఆరితేరినదే. ఇప్పుడు తెలంగాణ ఉద్యమ అణిచివేతకు ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, గవర్నర్ నరసింహన్, పోలీస్‌బాస్ అరవిందరావుల ఫాసిస్టు త్రయానికి నాయకత్వం అప్పగించబడింది. ప్రజా ఉద్యమ జ్వాలల్లో ఇలాంటి ఫాసిస్టులు నల్లుల్లా మాడిపోక తప్పదని చరిత్రలో రుజువైంది.

ఇటువంటి కుట్రలు కుతంత్రాలపట్ల ప్రజలు, ఉద్యమకారులు సదా అప్రమత్తంగా వుండాలి. జరిగిన పరిణామాలను పరిశీలిస్తే, ట్యాంక్‌బండ్‌పై విగ్రహాల కూల్చివేత వెనుక పాలకవర్గ పార్టీల ప్రయోజనాలున్నాయనేది అర్థమవుతున్నది. తమ చేయిదాటి పోయిన తెలంగాణ ఉద్యమాన్ని ఎలాగైనా తమ చేతుల్లోకి తీసుకోవాలనేది వాటి ఉద్దేశ్యం. మార్చి 2న సోనియాగాంధీతో సమావేశమైన తర్వాత కె.సి.ఆర్ మిలియన్ మార్చ్‌ను వాయిదా వేయాలని ప్రయత్నించాడు. కాని ఆపలేకపోయాడు. మిలియన్ మార్చ్‌లో జరగబోయే పరిణామాలను ప్రభుత్వం ప్రోత్సహించి, మద్దతునిచ్చింది. టి.ఆర్.ఎస్ విధ్వంసాన్ని ప్రారంభించింది. జగన్ వర్గం కూడ పథకం ప్రకారం పాల్గొంది. బి.జె.పి కూడ విధ్వంసంలో శ్రీశ్రీ వంటి వారి విగ్రహాలను కూల్చివేసింది. ఏమైనప్పటికీ నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే ఉద్యమంలో ఇటువంటి అపశృతులు దొర్లటం ఉద్యమానికి మంచిదికాదు. ప్రాంతాలకతీతంగా ప్రజల అభిమానాన్ని చూరగొన్న గొప్పవ్యక్తుల విగ్రహాలపై దాడి విభేదాలు, విద్వేషాలు రెచ్చగొట్టే శక్తులకు అవకాశాన్నిస్తుంది. ప్రజల విశ్వాసాలను దెబ్బ తీస్తుంది. ప్రసారమాధ్యమాలు ఎవరికి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ ప్రజల భావాలను ఎంతోకొంత ప్రపంచానికి చాటిచెప్పే మీడియాపై దాడికూడా సరైంది కాదు. భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడవలసిన బాధ్యత ప్రజాఉద్యమాలపై వుంటుంది.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పట్ల సుముఖతతో వున్న ఇతర ప్రాంతాల ప్రజలతో ఐక్యతను దెబ్బతీసే ఎటువంటి పొరపాట్లు కూడా ముందు ముందు జరగకుండ ఉద్యమ నాయకత్వం, తెలంగాణ ప్రజలు జాగ్రత్త వహించాలి. విచ్ఛిన్నకర శక్తులకు అవకాశమివ్వకూడదు.

ఆరాధింపబడే మహనీయుల విగ్రహాలకు ఈ దుర్గతి పట్టిందా.....! అంటూ ట్యాంక్‌బండ్ ఘటనపై ఆవేదన చెందినవారు, మనస్థాపానికి గురయిన నిజాయితీ పరులు ప్రాంతాలకతీతంగా వున్నారు. వారిని మినహాయిస్తే, తెలంగాణ ఉద్యమంపై కక్షగట్టి అవకాశం కొరకు ఎదురుచూస్తున్న కొన్ని శక్తులు ఈ ఘటనను సాకుగా తీసుకుని తమ శక్తిమేరకు గగ్గోలు పెడుతున్నాయి. ప్రసార మాధ్యమాలను, చట్టసభలను వేదికగా చేసుకుని గుండెలు బాదుకుంటున్నాయి. మొసలికన్నీరు కారుస్తున్నాయి. శాంతియుతంగా సాగుతున్న తెలంగాణ ఉద్యమానికి పరీక్ష పెడుతున్నాయి. ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆదుష్ట శక్తులు మరెవరో కాదు సాక్షాత్తు తమ మూల చరిత్రనే భూస్థాపితం చేసిన ఘనులు. సమైక్యతా భావనకు తూట్లు పొడిచి తెలంగాణ వనరులను కొల్లగొట్టుకు పోతున్న దోపిడి దొంగలు. వారి గత చరిత్రను తరచిచూస్తే ఈ గగ్గోలంతా విగ్రహాల మీద అభిమానంతోనా? లేక తెలంగాణ గడ్డమీద తమ ఆధిపత్యం అదుపుతప్పుతోందని ఆక్రోశమా? అనేది అర్థమవుతుంది.

మిలియన్‌మార్చ్ ఘటనకు బాధ్యులంటూ ప్రభుత్వం ప్రజా సంఘాల, విద్యార్థిసంఘాల నాయకులను అరెస్టు చేస్తున్నది. ఉద్యోగులను సహాయనిరాకరణలో పాల్గొనకుండా అడ్డుకోవడానికి, వారి పోరాటాలను అణచివేయడానికి ప్రభుత్వం 177 జి.ఓను తీసుకొచ్చింది. కానీ సర్వత్రా నిరసనలు వ్యక్తం కావటంతో జి.ఓను తాత్కాలికంగా ఉపసంహరించుకుని, ఉద్యమం బలహీనపడినప్పుడు మళ్ళీ ప్రయోగించే అవకాశం కోసం ఎదురు చూస్తున్నది. అసలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని మొదటి నుండి పరిశీలిస్తే సామ, దాన భేద, దండోపాయాలతో ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని అణచివేయాలనేది స్పష్టమవుతూనే వున్నది. అదిప్పుడు శ్రీకృష్ణ

కమిటీ నివేదికలోని 8వ (రహస్య) అధ్యాయం ద్వారా తేటతెల్లమైంది.

శ్రీకృష్ణ కమిటీ నివేదికలోని కొంతభాగాన్ని ప్రజలనుంచి దాచిపెట్టటంపై అభ్యంతరాలు అప్పీలుగా న్యాయస్థానందాకా వెళ్ళింది. విచారణలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎల్. నరసింహరెడ్డి తుది తీర్పుతో విషయాలు బహిర్గతమయ్యాయి. వాటిలో కొన్ని :

రాష్ట్రాన్ని విభజిస్తే తక్షణ శాంతి భద్రతల సమస్యలు, దీర్ఘకాలిక అంతర్గత భద్రతా సమస్యలు తలెత్తుతాయని, మావోయిస్టు నక్సలైట్లు బలపడే అవకాశాలున్నాయని నివేదికలో వ్యాఖ్యానించింది. ఇవే భయాందోళనలు వివిధ పార్టీలు, గ్రూపులు, ప్రభుత్వ, పోలీస్ ఉన్నతాధికారులు వ్యక్తపరచగానే వీటిని దృష్టిలో పెట్టుకొని 8వ అధ్యాయం, దానికి ప్రత్యామ్నాయ మార్గాలను 9వ అధ్యాయంలో రూపొందించారట.

రాష్ట్రాన్ని విభజిస్తే తెలంగాణలో ముఖ్యంగా హైదారాబాద్‌లో, దాని చుట్టు పక్కల వున్న సీమాంధ్రుల వ్యాపారాలు, పరిశ్రమలు, విద్యాసంస్థలు నష్టపోతాయని తద్వారా ప్రాంతీయ ఘర్షణలు తలెత్తుతాయని కమిటీ ఆందోళన వెలిబుచ్చింది. అంతేతప్ప దశాబ్దాలుగా తెలంగాణ వనరులు కొల్లగొట్టబడుతూ తెలంగాణ ప్రజలు అనుభవిస్తున్న బాధలు, అవమానాలు, వివక్ష, బలిదానాల గురించి దానికేమీ ఆందోళన లేదు. నివేదికలో వాటి ప్రస్తావన గురించి కూడా దానికవసరం లేదు.

విభజనవల్ల ఆర్థిక అసమతుల్యత పెరిగి హైదరాబాద్‌కు తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల ప్రజల వలస పెరుగుతుంది. తద్వారా హైదరాబాద్‌లో రెండు ప్రాంతాల ప్రజల మధ్య ప్రాంతీయ విభేదాలు, అభద్రత పెరుగుతుంది. నిరుద్యోగం, అశాంతి పెరిగి మతఘర్షణలకు దారితీస్తుంది. ఇది మిలిటెంట్లు, జిహాదీ శక్తులకు బలం చేకూర్చుతుందట.

కాంగ్రెస్ నాయకుల మధ్య ఐక్యత చెడకుండ తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు, ఎం.ఎల్యేలు ఉద్యమంలో పాలుపంచుకోకుండా చూసుకోవాలి. సి.ఎం, డిప్యూటీ సి.ఎం పదవులతో టి.ఆర్.ఎస్‌ను కొనేసి ఉద్యమాన్ని చల్లబరచాలి. తెలంగాణపై ప్రజలకు నమ్మకం కలిగించే ప్రకటనలతో, కమిటీలతో మభ్య పెడుతూ రాజకీయంగా మేనేజ్ చేసుకోవాలి.

ప్రజాభిప్రాయాన్ని మలచడం కోసం ప్రసారమాధ్యమాలను కొనేసి, మీడియాను ప్రభుత్వం చెప్పినట్లు వినేలా మేనేజ్ చేసుకోవాలి.

కమిటీ సూచించిన సలహాలను అమలు చేయడంలో ఆందోళనలు తలెత్తితే అణచివేయడానికి తగినంత పోలీసు(కేంద్ర, రాష్ట్ర) బలగాలను మోహరించాలి. ఎప్పటికప్పుడు ఇంటెలిజెన్స్ నివేదికలపై ఆధారపడి సమస్యాత్మక ప్రదేశాల్లో సుదీర్ఘకాలంపాటు అదనపు బలగాల మోహరింపుకు సిద్ధంగావుండాలి. ముఖ్యంగా ఉస్మానియా, కాకతీయ, కృష్ణదేవరాయ తదితర యూనివర్సిటీల్లో, మూడు ప్రాంతాల్లోని ముఖ్యమైన కేంద్రాల్లో ఆందోళనలకు ఉసిగొల్పే వారిని ముందుగా అదుపులోకి తీసుకోవాలి. అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోతే ఆయుధాలు ప్రయోగించాలి. శ్రీకృష్ణ కమిటీ గడువు ముగింపు దశలో చివరగా సీ.ఎస్, డి.జి.పిలతో సమావేశమైంది ఇది చర్చించడానికేనట.

ఇది సీమాంధ్ర దోపిడి దారుల ఆధిపత్యాన్ని నిలబెట్టడానికి తయారైన పచ్చి తెలంగాణ వ్యతిరేక నివేదికగాక మరేమిటి? శ్రీకృష్ణ కమిటీ తెలంగాణ ప్రజల, ప్రజాసంఘాల, ప్రజానాయకుల, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలకు ఇసుమంత విలువనీయక, పోలీసు, ప్రభుత్వాధికారుల నోటి మాటను రహస్య అధ్యాయంగా రూపొందించిన కమిటీ.

రహస్య అధ్యాయంలోని అంశాలు ఇప్పటికే అమలవుతున్నాయి. జరుగుతున్న పరిణామాలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. సీమాంధ్ర పెట్టుబడిదార్లకు అమ్ముడుబోయిన కేంద్ర ప్రభుత్వం వారికనుకూలంగానే పథకాల్ని రూపొందించి, శ్రీకృష్ణ కమిటీ అనే దాన్నొకటి ఏర్పాటు చేసి తను అమలు చేయదల్చుకున్న దాన్నే నివేదికగా తయారు చేయించి తెలంగాణ ప్రజలను పచ్చి మోసం చేసింది. ప్రత్యేక తెలంగాణను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయదని దాని మొత్తం చర్యలు, ఆచరణ ద్వారా రుజువవుతున్నది. ఈ నేపథ్యంలో యావత్తు తెలంగాణ ప్రజలు పోరాటం ద్వారానే దాని మెడలు వంచి ప్రత్యేక తెలంగాణను సాధించు కోవడానికి సిద్ధం కావాలి.

అంతేకాదు, తెలంగాణ పేరు చెప్పుకుని పబ్బం గడుపుకుంటున్న ప్రాంతీయ ద్రోహులను పాతర పెట్టాలి. తెలంగాణలోని వివిధ రాజకీయ పార్టీలు, నాయకులు పదవులు పట్టుకొని వేలాడుతూ అధికారం కోసం పాకులాడుతున్నాయి తప్ప, రాజీనామాలు చేసి ఉధృతమవుతున్న ఉద్యమాలతో కలిసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి పోరాడాలనే ఆలోచనే చేయటం లేదు. అధికారం కోసం ఎంతకైనా దిగజారే పరిస్థితుల్లో వున్నారు. తెలంగాణ పట్టాదారునని చేప్పుకునే టి.ఆర్.ఎస్ మోసకారిగా అనేక సార్లు ప్రజలముందు బహిర్గతమై మళ్ళీ ఉద్యమం తీవ్రమైనప్పుడు ప్రజల వెనకజేరి తనే నిజమైన తెలంగాణ పోరాటవాదిగా నాటకమాడ తున్నది. ఉద్యమం కీలకదశకు చేరుకున్న సమయంలో కూడా లాబీయింగ్ రాజకీయలకు పాల్పడుతున్నది. ఒక పక్క తెలంగాణ నిత్య పోరాటాలతో అట్టుడుకుతూ ప్రభుత్వమే స్థంభించిపోయే స్థితిలో వుండగా ఉద్యమాన్ని చల్లార్చడానికి కె.సి.ఆర్ మార్చి 2న సోనియాగాంధీతో ఒప్పందాలు చేసుకొని వచ్చాడు. మేలో ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యే వరకు కేంద్రం నిర్ణయం తీసుకోదంటూ ఉధృతంగా ముందుకుపోతున్న ఉద్యమాన్ని వెనక్కునెట్టడానికి ప్రయత్నించాడు.

లక్షలాది ఉద్యోగుల ఆకాంక్షలకు విరుద్ధంగా అర్థాంతరంగా సహాయ నిరాకరణను విరమింప జేశాడు.

మిలియన్‌మార్చ్‌ను వాయిదా వేయడానికి శతవిధాలా ప్రయత్నించి, చివరికి సాధ్యంకాక, ప్రజల నుంచి వేరయిపోకుండటానికి తప్పని స్థితిలో ట్యాంక్‌బండ్ పైకి వచ్చి ప్రతిజ్ఞ చేశాడు. అప్పటి నుండి ఎటువంటి పోరాటం చేయకుండా చేతులు ముడుచుకు కూర్చున్నాడు. ఒకవైపు జె.ఎ.సిని, విద్యార్థులను, ఉద్యోగులను, టి.ఆర్.ఎస్ వెనుకనున్న ప్రజలను తెగించి ముందుకు పోకుండా అడ్డుకొంటున్నాడు. మరొకవైపు ఉద్యమం ఆగదు, భూమ్యాకాశాలను ఏకంచేసైనా తెలంగాణ సాధించుకుంటామంటూ ప్రగల్భాలు పలుకుతూ, పోరాటం విడిచి, యాగాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నాడు.

ఇక తెలంగాణ కాంగ్రెస్ ఎం.పీలు, ఎం.ఎల్యేలు రాజీనామాలు చేస్తామని, కుంటివాడి సామెతగా బెదిరింపులు చేస్తూ, మరొక వక్క అదిష్టానం మాటకు జవదాటకుండా వుండటానికే నిశ్చయించుకున్నారు. ఒకవేళ రాజీనామాలు చేసినా తమ స్వార్థ ప్రయోజనాల కోసం, ఉద్యమాన్ని తమకు అనుకూలంగా మలచుకోవడానికీ చేయవచ్చునేమో గాని, తెలంగాణ సాధించడానికి ప్రజలతో కలిసి పోరాడాలనే నిజాయితీ లేదు. తెలంగాణను అడ్డుకొంటున్న అసలైన ప్రాంతీయ దళారులు వీళు ్ళ. వీళ్ళను ప్రాంతంలోనే పాతరపెట్టాలి.

టి.డి.పి ఒకపక్క తెలంగాణపై మావైఖరి స్పష్టమేనంటూ, మరొకపక్క రెండు నాల్కల ధోరణి అవలంభిస్తున్నది. తెలంగాణలో తెలంగాణ పాట పాడుతూ సీమాంధ్రలో తెలంగాణ వ్యతిరేక ప్రదర్శనలు చేయిస్తూ, సీమాంధ్ర దోపిడిదారుల ప్రయోజనాలకోసం నమ్మకంగా పని చేస్తూ, నాటకాలాడుతున్న దళారి, టి.డి.పి నేత చంద్రబాబు నాయుడు టి.డి.పిలోని తెలంగాణ ఎం.పీలు, ఎం.ఎల్యేలను తెగించి ముందుకు పోనీయకుండా, పోయిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ తెలంగాణను అడ్డుకోవటంలో తనవంతు పాత్ర పోషిస్తున్నాడు. వందలాది తెలంగాణ యువకుల ఆత్మత్యాగాలపై, ప్రభుత్వ నిర్బంధంపై నోరువిప్పని చంద్రబాబు, మిలియన్ మార్చ్‌లో జరిగిన విధ్వంసంపై గుండెలు బాదుకున్నాడు. ఇక బి.జె.పి తెలంగాణ ఉద్యమాన్ని అడ్డుపెట్టుకుని తెలంగాణలో తన బలాన్ని పెంచుకోజూస్తున్నదేగానీ పోరాటంలో క్రియాశీలంగా ముందుకు రావడంలేదు. పరిస్థితి తనకు అనుకూలంగా లేదనుకుంటే ఐక్య పోరాట వేదిక కార్యక్రమాల నుంచి పక్కకు తప్పుకుంటున్నది.

ఈ దళారి రాజకీయ పార్టీలన్నీ తెలంగాణ పేరుతో ఏదో రకంగా సాధ్యమైనన్ని ప్రయోజనాలు పొందడానికే ప్రయత్నించేవి తప్ప తెలంగాణ కోసం నిజాయితీగా పోరాడేవి కావు. గతంలో ఆందోళనల సందర్భంగా విద్యార్థులపై పెట్టిన కేసుల ఎత్తివేత కోసం అవకాశవాద రాజకీయ పార్టీలన్నీ గొంతెత్తాయి. కానీ, మిలియన్ మార్చ్ సందర్భంగా అక్రమంగా బనాయించిన కేసుల ఎత్తివేతకోసం ఏ పార్టీ కూడా గట్టిగా నోరు విప్పిందిలేదు. మిలియన్ మార్చ్ తరువాత పరిస్థితిని ఆసరా చేసుకుని ప్రజల చేతుల్లోకి వెళ్ళిన ఉద్యమాన్ని ఎలాగైనా తాము కబ్జాచేయాలని ఈ దగాకోరు రాజకీయ పార్టీలన్నీ ప్రయత్నిస్తున్నాయి. కీలక దశకు చేరుకున్న ఈ తరుణంలో ఉద్యమాన్ని ఎట్టి పరిస్థితుల్లో కూడా ప్రజల చేజారనీయకూడదు.

నేడు తెలంగాణ గత అనుభవాల నుండి గుణపాఠాలు నేర్చుకుంది. ఉద్యమం ఆవేశమే కాదు ఆలోచననూ, అవగాహననూ, విశాల మనస్తత్వాన్ని అలవర్చుకుంటున్నది. మాటల వెనుక మర్మాలను పసిగట్టాలి. ప్రాంతేతర దోపిడి దారులను, ప్రాంతంలోని దొంగలను కనిపెట్టి దెబ్బకొట్టాలి. సీమాంధ్ర దోపిడి దారులతో, పాలక వర్గాలతోనే పోరాటంగానీ అక్కడి సామాన్య ప్రజానీకంతో ఐక్యత ముఖ్యం. ప్రాంతాలుగా విడిపోయి మానవత్వంతో కలిసి వుండాలి. ఈ ఐక్యతకు భంగం కలిగించే కుట్రలు, కుహకాలను తెలివిగా తెగటార్చాలి. తమ ఆధిపత్యం, దోపిడీలకు ఎదురు దెబ్బలు తగులుతున్నప్పుడు పాలక వర్గాలు, పెట్టుబడి దారులు ఎలా ఒకరి నొకరు హత్తుకుంటూ, ఒక్కటవుతున్నారో గమనించాలి. మరి బతుకు పోరులో పీడితులంతా ఒక్కటై పిడికిళ్ళు బిగించాలి. గోసిగాళ్ళు, గొంగడిగాళ్ళు, ఫుట్‌పాత్‌గాళ్ళు అందరొక్కటై ప్రజల సొమ్ము తిని తెగబలిసిన వారిని తన్ని తరమాలి. నిజమైన ఐక్యత పీడిత ప్రజానీకం మధ్యనుండాలి. ఈ ఐక్యత చెదరకుండా ఉద్యమాలు, నాయకత్వం, ప్రజలు జాగ్రత్త వహించాలి.

తెలంగాణ ప్రజల న్యాయమైన డిమాండ్‌కు మద్దతునిస్తూ ప్రాంతాల కతీతంగా, దోపిడి ఆధిపత్యాలకు వ్యతిరేకంగా మేధావులు, ప్రజాస్వామిక వాదులు ముందుకు రావాలి. సిరులు కురిపించే తెలంగాణను సీమాంధ్ర దోపిడిదారులు అంత తెలివిగా వదలరు.

ఇక ఏ కమిటీలు, నివేదికలు, ప్రభుత్వాలు తెలంగాణను తెచ్చివ్వవు అనేది స్పష్టం. పటిష్టమైన ప్రజాఉద్యమమే తెలంగాణ సాధనకు ఏకైక మార్గం. ఇది చరిత్ర నిరూపించిన సత్యం ఒక వేళ ఇవ్వక తప్పనిస్థితే వస్తే తెలంగాణపై ఆధిపత్యం తమ చేజారనివ్వకూడదనేది పాలకుల పన్నాగం. అందుకే ప్రజలందరికీ సమన్యాయం లభించే ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణ సాధనకోసం కార్మిక, కర్షక, విద్యార్థి, ఉద్యోగ, మేధావి, కళాకారులు, సంఘాలు, ప్రజాస్వామిక శక్తులు, వ్యక్తులతో సహా సమస్త తెలంగాణ ప్రజానీకం గ్రామస్థాయి నుంచి నిర్మాణాత్మకమైన విశాల ఐక్య సంఘటనగా ఏర్పడాలి. విద్యార్థి, న్యాయవాద, ఉద్యోగుల, సహాయనిరాకరణ, మిలియన్ మార్చ్ వంటి సమరశీల పోరాటాలతో దృఢంగా ముందుకు పోవాలి.

# ప్రజా సంక్షేమానికి చేదు మందు, కార్పోరేట్లకు విందు
# కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లు

కేంద్ర ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ పార్లమెంటుకు సమర్పించిన 2011 – 12 సాధారణ బడ్జెట్ అంచనాకు 12,57,729 కోట్లు. ప్రణాళికేతర వ్యయం రూ॥ 8,16,182 కోట్లు. ప్రణాళిక వ్యయం రూ॥ 4,41,547 కోట్లు. ఇది ముమ్మాటికీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన బడ్జెట్‌గానే కన్పిస్తున్నది. కొత్తగా పన్నులు వేసినట్లు కన్పించకున్నా, బడ్జెట్‌లో లోటు మూడు లక్షల కోట్ల పైగానే వుంది. ఈ లోటు భర్తీకి దొడ్డిదారిన పన్నులు విధించే అవకాశం వుంది. తాను ఆమ్ ఆద్మీ బడ్జెట్ సమర్పించినట్లు ఆర్థికమంత్రి ప్రకటించుకుంటే, ప్రధానమంత్రి అభినందించాడు. ఆదాయ పన్నుల రాయితీలు చూపించి ఇది ఆమ్ ఆద్మీ బడ్జెట్ అంటున్నారు. వాస్తవానికి ఈ రాయితీలు పై మెరుగులే. ప్రత్యక్ష పన్నుల్లో ఇచ్చిన రాయితీలను పరోక్ష పన్నుల ద్వారా వసూలు చేసేందుకు ప్రణబ్‌ముఖర్జీ ఈ బడ్జెట్‌లో ప్రతిపాదనలు సిద్ధం చేసే వుంచాడు. ఈ చేత్తో ఇచ్చి ఆ చేత్తో తీసుకోవటం అంటే ఇదే.

ద్రవ్యోల్బణాన్ని అదుపులోకి తీసుకొని రావడానికి చర్యలు తీసుకోబోతున్నామని ఆర్థికమంత్రి తెలియజేశాడు కానీ, ఏ విధంగా అదుపులోకి వస్తుందనేది చెప్పలేదు. మన దేశం వంట నూనెల దిగుమతులపై ఆధారపడిన దేశం కాగా, వాటి ధరలు పెరుగుతున్నవి. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో అనేక రకాల ఛార్జీలు, ధరలు పెరగటం నిత్యం చూస్తూనేవున్నాం. పన్నులు పెంచాల్సి వస్తుందని , ద్రవ్యలోటు ప్రస్తుతం కాస్తంత తగ్గినప్పటికీ రోబోయే కాలంలో తీవ్రసమస్యలు ఎదుర్కోవల్సి వస్తుందని ప్రధానమంత్రికి ఆర్థిక సలహాలు ఇచ్చే రంగరాజన్ కమిటీ హెచ్చరించింది. ప్రపంచంలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఆర్థికంగా ఎంత ఎక్కువ పెరుగుదల వుంటే ద్రవ్యోల్బణం అంత పెరగవచ్చునని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేదలకు అందజేసిన ఆర్థిక సహాయం కూడా ద్రవ్యోల్బణానికి దారితీయవచ్చునని ఆర్థిక మంత్రే అన్నాడు. వీటన్నింటిని పరిశీలిస్తే ద్రవ్యోల్బణం అదుపులోకి రావడం అంకెల్లో గారడీలతోనేగాని, వాస్తవంలో కాదని అర్థమవుతున్నది.

బడ్జెట్ ప్రసంగం మొత్తం చూస్తే ఇప్పట్లో ధరల పెరుగుదల నుంచి విముక్తి కనిపించటం లేదు. సామన్యునికి కావాల్సింది ధరల నియంత్రణ. ఆహార ద్రవ్యోల్బణం రెండంకెల్లో కొనసాగుతుందనేది స్పష్టం. ఆహారధాన్యాల నిల్వలు గోదాముల్లో, బయటా మురిగిపోతుంటాయి. అదే సమయంలో పేదలకు తిండి గింజలు దొరకవు. దీనికి కారణం టోకు వ్యాపారుల చేతి వాటం అనేది అర్థమవుతున్నా, దీన్ని అరికట్టడానికి ప్రణబ్ ముఖర్జీ నోటివెంట ఒక్క మాటకూడా రాలేదు.

## ఆదాయం - వ్యయం

ఆదాయ – వ్యయాల గురించిన బడ్జెట్‌లోని గణంకాలు అంచనాలు మాత్రమే. అంచనాలకు, వాస్తవానికి మధ్య తేడా పది శాతం మించకూడదనేది ఆర్థికశాస్త్ర సూత్రం. ఇలా బడ్జెట్ రూపొందిందా లేదా అనేది రెండు సంవత్సరాల తర్వాత తెలుస్తుంది. ఈ రకంగా చూసినపుడు లోటు బడ్జెట్లు సర్వసాధారణమైపోయాయి. నూటికి 70 మంది నివసించే గ్రామీణ ప్రజల కోసం (వీరిలో అత్యధికులు పేదలే) ఎంతఖర్చు చేస్తున్నారు. పట్టణ, నగర ప్రజలకోసం ఎంత ఖర్చు చేస్తున్నారనేది చూడాల్సివుంది. బడ్జెట్‌ను గణాంకాల ఆధారంగా కాక, సామాజిక ఆర్థిక కోణం నుంచి చూసినపుడు గ్రామీణ ప్రజల జీవితాల బాగోగుల కోసం బడ్జెట్‌లో ఏమీ వుండదు. కొన్ని ప్రజాపథకాలు వారినుద్దేశించి ప్రకటిస్తారు గానీ, వాటి కోసం చేసే ఖర్చులో 15 శాతం మాత్రమే వారికి చేరుతున్నాయనేది వాస్తవం. నూటికి 78 శాతం శ్రామికులు రోజుకు 20 రూపాయాల వేతనంతో జీవితం వెళ్ళదీస్తునారని ప్రభుత్వమే ప్రకటించింది. అటువంటప్పుడు ఈ పథకాలు ఎవరిని బాగు చేస్తున్నట్లు? ఇవి పాలక పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఉద్దేశించిన పథకాలనేది ఎవరికైనా అర్థమవుతుంది. దీనికి గణాంకాలు ఉదహరించనక్కర లేదు.

ఈ పథకాల ఫలితంగా శాశ్వతంగా వుండే ఆస్తులు సృష్టించబడటం లేదు. ఈ ఖర్చు అంతా ఓటు బ్యాంకు సృష్టికి, కొనసాగింపుకు మాత్రమే వినియోగపడతాయి. మధ్యతరగతి వృద్ధులపై ఆదాయపు పన్ను మినహాయింపును పెంచామంటున్నారు. మధ్యతరగతి ప్రజలకు మినహాయింపు 1.5 లక్షల నుంచి 1.8 లక్షల వరకు, 80 సంవత్సరాల పై బడిన వృద్ధులకు 5 లక్షల వరకు మినహాయింపు వుంటుందని ప్రకటించి ఎంతో మేలు చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారు. కానీ, 80 ఏళ్ళుదాటిన వారిలో సంవత్సరానికి 5 లక్షల రూపాయాల ఆదాయం వచ్చేవారు ఎవరుంటారు! ఎంతమంది వుంటారనేది పరిశీలిస్తే చాలా తక్కువ మందికి మాత్రమే ఇది వర్తిస్తుంది.

వ్యవసాయాభివృద్ధి కోసం చేస్తున్న ఖర్చు మొత్తం బడ్జెట్‌తో పోలిస్తే చాలా స్వల్పం. వ్యవసాయ రుణ లక్ష్యం రూ॥ లక్షకోట్లు

పెంచామంటున్నారు. కానీ బ్యాంకులు ప్రాధాన్యరంగాలకు ఇవ్వాలని నిర్దేశించిన 40 శాతం రుణాల నుంచి 18 శాతం వ్యవసాయానికి అందజేయాల్సి వుండగా 10 నుంచి 14 శాతానికి మించి ఇవ్వలేదు. రుణాలపై వడ్డీరేటు తగ్గించామని, సకాలంలో రుణాలు చెల్లించే రైతులకు 3 శాతం వడ్డీ రాయితీ కల్పించామంటున్నారు. కానీ ఇది 70 శాతంగా వున్న చిన్న, సన్న కారు రైతాంగానికి ప్రయోజనం కలుగుతుందన్న హామీలేదు. ఎందుకంటే 27 – 28 శాతంగా వున్న బడా భూస్వాములు, ధనిక రైతులే అన్ని రుణాలను దక్కించుకోవడం దేశంలో ఒక అనవాయితీగా మారిపోయింది. మే నెలలో ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన తర్వాత ఎరువుల ధరలు పెరిగే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పప్పుల ధరలు ఆకాశాన్నంటుతున్నప్పుడు వాటి ధరలు తగ్గటానికి పప్పుధాన్యాల ఉత్పత్తి పెంపుదల కోసమని బడ్జెట్‌లో రూ॥ 300 కోట్లు కేటాయిస్తున్నట్టు ఆర్థిక మంత్రి ప్రకటించాడు. ఈ విశాల భారతదేశంలో ఆరు లక్షల గ్రామాల్లో పప్పుధాన్యాల పంటలకు రూ॥ 300 కోట్ల చొప్పున కేటాయింపు ఒక పంటి కిందకు కూడా రాదు.

రెండు దశాబ్దాలుగా వ్యవసాయరంగం ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై సరైన పెరుగదల జరగలేదు. దీని వల్ల వ్యవసాయంలో ఉ పాధి తగ్గింది. ఉత్పత్తి పెరగకపోవడం వల్ల ధరలు పెరుగుతున్నాయి. కానీ దీని కంటే ఎక్కువగా ఖర్చులు పెరగడం వల్ల రైతులు నానాటికి కుంగిపోతున్నారు. రుణభారం పెరిగిపోయి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఒక్క 2009 సంవత్సరంలోనే దేశవ్యాప్తంగా 17, 638 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అంటే ప్రతి అరగంటకు ఒకరు ఆత్మహత్యలకు బలయ్యారు. రైతుల ఆత్మహత్యల విషయంలో కేంద్ర వ్యవసాయ మంత్రి శరద్‌పవార్ స్వరాష్ట్రం మహరాష్ట్రనే ముందంజలో వుంది. 1997కు ముందు రైతుల ఆత్మహత్యలను రాష్ట్ర ప్రభుత్వాలు రికార్డు చేయలేదు. అప్పటినుండి 2009 వరకు ఈ రికార్డు చూస్తే 2.5 లక్షలకు పైగా రైతులు బలవన్మరణాల పాలయ్యారు. 2010, 11లలో ఈ సంఖ్య నిస్సందేహంగా ఇంకా పెరిగి వుంటుంది. రైతుల ఆత్మహత్యల సంఖ్యను రాష్ట్ర ప్రభుత్వాలు వీలైనంతగా తగ్గించి చూపుతున్నాయి. కనుక వాస్తవ సంఖ్యలు కన్పించే వాటి కంటే చాలా చాలా ఎక్కువగా వుంటాయి. రైతుల రుణభారంలో ఇప్పుడు మహరాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల ముందున్నాయి. రాష్ట్రాలు ముందున్నాయి. రైతుల ఆత్మహత్యల విషయంలో కూడా సహజంగానే అవే రాష్ట్రాలు ముందు ఆత్మహత్యల్ని ఆపటానికి సంబంధించిన పరిష్కారాలేమి లేవు.

దేశంలో మూడింట రెండు వంతుల జనాభా బ్రతుకు దెరువు కోసం ఆధారపడే కీలకమైన వ్యవసాయరంగం ఎంతగా ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురవుతున్నదో ఆ రంగానికి చేస్తున్న కేటాయింపులు చూస్తే అర్థమవుతుంది. భారతరైతు నిత్యం దరిద్రాన్ని అనుభవిస్తుంటే, ప్రభుత్వాలు వ్యవసాయ రంగంపై పెట్టుబడులను నానాటికీ తగ్గిస్తూపోతున్నారు. వ్యవసాయ రంగంలో స్థూలపెట్టుబడి ఏర్పాటు (జీసీఎఫ్) ప్రపంచబ్యాంకు ఆదేశిత నూతన ఆర్థిక విధానాలు ప్రారంభమైనప్పటి నుండి ఈ రెండు దశాబ్దాల్లో 18 శాతం నుంచి ఇప్పుడు 5.8 శాతానికి పడిపోయింది. యు.పి.ఎ అధికారంలోకి వచ్చేముందు వ్యవసాయరంగానికి పెద్దపీట వేస్తామని, బడ్జెట్ ప్రసంగాల్లో ఆర్థికమంత్రులు కేటాయింపులు పెంచుతామనీ ఎన్నెన్నో ప్రకటనలు గుప్పించారు. నిజానికి 11వ పంచవర్ష ప్రణాళికలో (2007–12) వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ॥ 50,924 కోట్లు కేటాయించారు. 10వ ప్రణాళికలోని కేటాయింపుతో (రూ॥ 21,068 కోట్లు) పోలిస్తే ఇది చాలా ఎక్కువ. కానీ, మధ్యంతర సమీక్షల్లో ఇది తీవ్రమైన కోతలకు గురైంది. ఓట్లకోసం రైతులను ఉ ద్ధరిస్తామనే ప్రకటనలు వాస్తవంలో ఎంత బూటకమో, దీన్నిబట్టే అర్థం చేసుకోవచ్చు. సాగునీటి ప్రాజెక్టుల పేర లక్షల కోట్ల రూపాయాలు కేటాయింపులు చేసి, అవి పూర్తి చేయకుండానే భారీ కుంభకుణాల్లో వేలకోట్ల డబ్బు కాజేస్తున్నారు. దీనిలో సాగునీటి కోసం భారీ మొత్తాలు వెచ్చిస్తున్నప్పటికీ కాల్వల ద్వారా సాగు అయ్యే భూవిస్తీర్ణం పడిపోయింది. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయం, సంబంధిత కార్యకలాపాలు, సాగునీటికి 2010 – 11 కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిన (12, 836 కోట్ల రూపాయాలు) దాని కంటే 2011 – 12లో కేటాయింపు (19, 257 కోట్లు) కొద్దిగా మాత్రమే ఎక్కువ. ఇక గ్రామీణాభివృద్ధిపై కేటాయింపులు మొత్తం నిధుల్లో 15 శాతం కంటే కూడ తక్కువ. రైతుల గురించి మొసలి కన్నీరు కార్చే యు.పి.ఏ ప్రభుత్వ ఘనకార్యం ఇది.

ఆహారధాన్యాల ఉత్పత్తి పెంచడానికి ప్రభుత్వం పెద్ద యెత్తున పెట్టుబడి పెట్టి, మౌలిక సదుపాయాలతో పాటు మార్కెట్ మద్దతు పెంచి ఈ రంగానికి చేయూత నివ్వాలి. కానీ ప్రభుత్వం తన పాత్రను వెనక్కి తీసుకుంది. పైగా వ్యవసాయరంగంలోకి పెద్ద యెత్తున కార్పోరేట్ల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నది. కార్పోరేట్ల ఉనికి పొలం గట్ల వరకు చేరింది. ఇక పొలాల్లోకి ప్రవేశించటమే మిగిలి వుంది. అప్పుడు వ్యవసాయం సర్వనాశనమై, రైతాంగం బానిస బ్రతుకులకు గురికాక తప్పదు.

విద్య, వైద్యం లాంటి సామాజిక సంక్షేమ పథకాలకు కేటాయింపులు పెంచినట్లు ఆర్థికమంత్రి చెప్పాడు. పెరిగిన ధరలు, ఖర్చులతో పోల్చితే ఇది చాలా స్వల్పం. అది కూడా ధనికవర్గానికి ఉపయోగపడేదిగానే వుంది. విద్యారంగంలో ప్రాథమిక విద్య

ప్రాముఖ్యతను పక్కనబెట్టి, ఉన్నత విద్యపై కేంద్రీకరణ పెరుగుతున్నది. విదేశీ విశ్వవిద్యాలయాలను ఆహ్వానిస్తున్నారు. వీటిలో చదివిన వాళ్ళు విదేశాలకు వెళ్ళి స్థిరపడడానికే ఎక్కువగా మొగ్గు చూపుతారు. వీరంతా ఎక్కువలో ఎక్కువ సంపన్న వర్గాల వారే. ఈ దేశ ప్రజలు చెల్లించే పన్నుతో ఉన్నత విద్య నభ్యసించి విదేశాలకు సేవచేసే వారి కోసం బడ్జెట్‌లో కేటాయింపులు పెంచటం జరుగుతున్నది. దీనితో పోల్చితే అక్షరాస్యత పెంచటానికి, మధ్యలోనే చదువు మానేసిన వారి సంఖ్య తగ్గించటానికి ప్రాథమిక, సెకండరీ విద్యలపై కేటాయించేది చాలా స్వల్పం.

వైద్యరంగం నానాటికి తీసికట్టుగా మారుతున్నది. ప్రజారోగ్య వ్యవస్థను క్రమంగా నాశనం చేసి, కార్పోరేటు వైద్యాన్ని రంగం మీదికి తీసుకురావటం ప్రభుత్వ లక్ష్యంగా కన్పిస్తున్నది. దాని చర్యలు బడ్జెట్ కేటాయింపులు కూడా ఇందుకు అనుకూలంగానే వున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్యసర్వే (ఎన్.ఎఫ్.ఎల్.ఎస్) ప్రకారం 50 శాతం పిల్లలు ఉండాల్సిన బరువు కంటే తక్కువ వున్నారు. 70 శాతం స్త్రీలు రక్తహీనతతో బాధపడుతున్నారు. ఇందుకు కారణం దేశంలో కింది స్థాయిలోని 40 శాతం ప్రజలకు పోషకాహారం లభించటంలేదు. ఆహార భద్రత కరువైందని నిరూపించటానికి ఇంతకంటే ఆధారాలు అవసరం లేదు. ఆహారభద్రత కోసం ఒక చట్టాన్ని తయారుచేసి పేదలకిచ్చే ఆహారధాన్యాలు 25 కిలోల నుంచి 35 కిలోలకు పెంచినంత మాత్రాన ప్రజలకు పోషకాహారం, కడుపునిండా తిండి దొరకదు. అందుకు తగిన చర్యలు చేపట్టాలి. కానీ బడ్జెట్‌లో అటువంటి ప్రయత్నాలేమి కన్పించవు.

విద్య, ఆరోగ్యం తర్వాత గృహవసతి అతి ముఖ్యమైనది. రాజీవ్‌గాంధీ పేరుతో, ఇతర పేర్లతో ప్రభుత్వ గృహవసతి పథకాలు కాంట్రాక్టర్లకు, రియల్ ఎస్టేట్ దారులకు డబ్బులు కురిపించే పథకాలయ్యాయి. ప్రభుత్వ గృహాలు వస్తే గిస్తే అధికార పార్టీ మద్దతు దారులకే గాని, ఇళ్ళులేని అసలైన పేదలకు గృహవసతి అందని ద్రాక్షగానే తయారైంది. నూరురోజులు – నూరు రూపాయల పథకం కింద ఇచ్చే కూలి ధరల సూచీ పెరుగుదలతో పాటు పెంచుతామనటం పైకి చూస్తే బాగానే వుంటుంది. కానీ కేటాయింపులు పెరగకపోతే ఎంతమందికి ఉపాధి లభిస్తుంది?

## సబ్సీడీలకు మంగళం

పేద ప్రజలకిచ్చే సబ్సిడీ బదులు నగదు బదిలీ పథకం అమలు పరుస్తామని ప్రకటించారు. దీనర్థం ఇంతవరకు సబ్సిడీ ఆహార ధాన్యాలు, నిత్యావసర సరుకులు అందించే ప్రజాపంపిణీ వ్యవస్థ వైఫల్యం చెందిందని ప్రభుత్వం అంగీకరించడమే. ఈ నూతన విధానం వల్ల మధ్య దళారీల బెడద వదులుతుందని నగదు బదిలీని బ్యాంకులద్వారా, బ్యాంకులు లేనిచోట కరస్పాండెంట్ల ద్వారా జరుపుతామని అంటున్నది. డబ్బు చేతులు మారే అవకాశం వుంటే దళారులు పుట్టటానికి సవాలక్ష మార్గాలు. ఇది మరో రూపంలో డబ్బు మళ్ళింపు, దళారులు తయారు కావటానికి దారితీస్తుంది. పేదలకు ఉద్దేశించిన పథకాలు ఎన్నెన్ని ఏ విధంగా దారి మళ్ళి, దళారుల చేతికి పోతున్నాయో నిత్యం ప్రజల స్వానుభవంలో చూస్తున్నదే. ప్రభుత్వ ఆలోచనకు ఆచరణకు ఆమడ దూరమనేది జగమెరిగిన సత్యం. రైతులకిచ్చే సబ్సిడీలు గ్రామంలో భూస్వాములకు, ధనిక రైతులకు చేరతాయి. ఆహారధాన్యాల కిచ్చే సబ్సిడీ సారాయి దుకాణాలకు చేరుతుంది. దేశంలో త్రాగునీటి సౌకర్యం లేని గ్రామాలున్నాయి కానీ, సారా దుకాణాలు లేని గ్రామలు లేవుగదా! ఇక పేదలు బాగుపడేదెక్కడ? ప్రభుత్వ నాయకులకు కావలసింది అదే. అపుడే వాళ్ళ ఓట్లు నమ్మకంగా అధికార పార్టీకి వేయించుకోవచ్చు. ఈ చేత్తో ఇచ్చి, ఆ చేత్తో గుంజటం, ఏ లాభం లేకుండా ప్రజలకు ఉపయోగపడే పనులేవి చేయకపోవటం ఇప్పుడు ప్రభుత్వాల పాలకవర్గాల విధానంగా కొనసాగుతున్న కాలం గదా!

## బడాబాబులకు విందు

బడ్జెట్‌లో కేంద్రప్రభుత్వం కొన్ని ప్రజావ్యతిరేకమైన కార్పోరేట్ సంస్థల అనుకూల నిర్ణయాలు తీసుకుంది. వీటిలో విదేశీ పెట్టుబడులను మరింతగా ఆకర్షించేందుకు కొత్తగా మరిన్ని ప్రోత్సాహకాలు ఇవ్వ చూపడం ముఖ్యమైనది. ఇంతకు ముందు స్టాక్‌మార్కెట్ వరకే వున్న విదేశీ పెట్టుబడులను ఇప్పుడు ' మ్యూచ్‌వల్ ఫండ్స్' లోకి కూడా అనుమతిస్తున్నది. దీని వల్ల మ్యూచ్‌వల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టే మధ్య తరగతి తిరిగి కోలుకోలేని విధంగా నష్టపోతుంది. ఇక మైక్రోఫైనాన్స్ సంస్థలకు, డిపాజిట్లు తీసుకునేందుకు వీలుగా బ్యాంకింగ్ లైసెన్స్ ఇవ్వాలన్న ప్రతిపాదన మరింత ప్రమాదకరమైనది. ఇప్పటికే పేదప్రజల ఉసురు తీస్తున్న ఈ సంస్థలకు డిపాజిట్లు తీసుకునే లైసెన్స్ ఇస్తే ఇక పట్టపగ్గాలుండవు.

ప్రైవేట్ (కార్పోరేట్) సంస్థలకు బ్యాంకింగ్ లైసెన్స్ ఇవ్వాలనే ప్రతిపాదన ఆర్థిక సర్వేలో వుంది. ఈ నిర్ణయం ఈ సంవత్సరానికి ఆగినా, వచ్చే ఏడాది ప్రజలపై రుద్దే ప్రమాదం వుంది. రిటైల్ రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను పెద్ద యెత్తున అనుమతించే ప్రతిపాదన కూడ అర్థిక సర్వేలో వుంది. ఇది కూడా వచ్చే బడ్జెట్‌లో వాస్తవ రూపం దాల్చే ప్రమాదం వుంది. చిన్న స్థాయి రిటైల్ వర్తకుల పొట్టకొట్టే ఈ ప్రతిపాదన ఉనికిలోకి వస్తే సుమారు 4 కోట్ల మంది బతుకులు బజారునపడతాయి. వీటికి వ్యతిరేకంగా ప్రజలు, ప్రజాసంఘాలు పోరాడకుండ ఈ దుర్మార్గపు విధానాలను ఆపటం సాధ్యంకాదు.

పబ్లిక్ రంగ స్థలం నుంచి 40 వేల కోట్ల రూపాయల వరకు ప్రభుత్వ పెట్టుబడులను ఉపసంహరించే ప్రజావ్యతిరేక విధానం ఈ బడ్జెట్‌లోనూ చోటుచేసుకుంది. హెూమియోపతి, ఆయుర్వేదం వంటి ప్రత్యామ్నాయ వైద్య విధానాలకు ప్రజల్లో ఇప్పుడు ఆదరణ పెరుగుతున్నది. కానీ విదేశీ శక్తుల ఎత్తుగడలకు తలవంచి ఆ ఔషధాల అమ్మకాలపై పన్నులు, సుంకాలు పెంచే దుర్మార్గానికి ప్రభుత్వం పూనుకున్నది.

బడ్జెట్ ప్రవేశ పెట్టిన రోజు స్టాక్ మార్కెట్ సెన్సెక్స్ పైకి ఎగబాకింది. పారిశ్రామిక వేత్తల సంఘం అఖిలభారత సంస్థలు శభాష్ అన్నాయి. 2008 లో ప్రపంచ ఆర్థిక సంక్షోభంలో పెట్టుబడిదారులను ఆదుకోవడానికి ఉద్దీపన పథకాల పేరుతో ప్రభుత్వం మూడు లక్షల కోట్ల రూపాయాలు సహాయం చేసింది. దీనివల్ల పరిశ్రమలు బాగా పుంజుకొని, రెండు చేతులా లాభాలు పిండుకున్నాయని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. తర్వాత కూడ ఉద్దీపన పథకాలు కొనసాగుతున్నాయి. కార్పోరేట్ల జేబులు నిండుతున్నాయి. 2005 – 06 నుంచి గడచిన ఆరు సంవత్సరాల్లో కార్పోరేట్లకు ఎక్సయిజ్, కస్టమ్స్, సుంకాల్లో ప్రోత్సాహకాలు, మినహాయింపులు, మాఫీలు పేర ప్రభుత్వం కోల్పోయిన ఆదాయం 21 లక్షల కోట్ల రూపాయలని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి.

ఇలా కార్పోరేటు సంస్థలకు దోచిపెట్టటం కోసం గురించి 'రెవెన్యూ నష్టం జరుగుతున్నది' అంటూ బడ్జెట్ ప్రసంగాల్లో ఏకరువు పెడుతూనే వీటిని కొనసాగిస్తున్నది. ఇంత పెద్ద ఎత్తున ప్రజల సొమ్మును కార్పోరేట్లకు దోచిపెడుతున్న ప్రభుత్వం అందులో నూరవ వంతు సైతం ప్రజలకు రాయితీలుగానో, సబ్సిడీలుగానో ఇవ్వాల్సి వచ్చేసరికి గొంతుకు అడ్డం పడ్డట్లు గిలగిల కొట్టుకుంటున్నది. కొన్ని లక్షల కోట్ల రాయితీలతో కార్పోరేట్లు పోగేసుకున్న సంపదను విదేశాల్లో పరిశ్రమలను, ఖనిజ సంపదతో, భూములు కొనేసి తమ సంస్థాలను విస్తరించుకొంటున్నారు. ఇది కాక విదేశీ బ్యాంకులకు తరలించిన నల్లధనం వుండనేవుంది. ఈ నల్లధనం గుట్టలను పెకలించడానికి ప్రభుత్వానికి ఎటువంటి కార్యక్రమం లేదు. కనుక ఇదంతా ప్రభుత్వ ప్రోత్సాహంతో, అనుమతితోనే జరుగుతోందనేది స్పష్టం. దీనిపై ప్రజల్లో పెరుగుతున్న నిరసనలను, ప్రజా తిరుగుబాట్లను అణచడానికి, పాలకవర్గాల రక్షణకు ప్రతి సంవత్సరం బడ్జెట్ కేటాయింపులు పెంచుతూనే వున్నారు. ఈ సంవత్సరం రక్షణ రంగానికి, 12 శాతం నిధులు అదనంగా మొత్తం రూ॥ 1,64,415 కోట్లు కేటాయించడం దారుణం. నిధుల కొరతతో నిత్యం కునారిల్లే మన దేశ ఆర్థిక వ్యవస్థలో ఇది అనవసర వ్యయం. మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలకు రూ॥ 1800 కోట్లు, మావోయిస్టులతో ఘర్షణల్లో గాయపడిన జవాన్లకు రూ॥ 9లక్షల పరిహారం ప్రకటించారు.

ఈ బడ్జెట్ దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందనటం, బడ్జెట్ రూపకల్పనలో సమతుల్యత పాటించామనటం పచ్చి బూటకం. పేద వర్గాలకు ఈ బడ్జెట్‌తో ఒరిగేదిమి లేదన్నది దాచినా దాగని సత్యం. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది ఆమ్ ఆద్మీ బడ్జెట్ కాదు. కార్పోరేట్ల, విదేశీ పెట్టుబడుల అనుకూల బడ్జెట్.

## రాష్ట్ర బడ్జెట్

రాష్ట్ర ఆర్థికమంత్రి ఆనం రామ నారాయణరెడ్డి 2011 – 12సంవత్సరానికి గాను 1,28,542 కోట్లతో రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్భాటంగా శాసనసభలో ప్రవేశపెట్టాడు. బడ్జెట్‌లో ప్రణాళికేతర వ్యయం 80,984 కోట్లు కాగా, ప్రణాళికావ్యయం 47,558కోట్లు. ద్రవ్యలోటు రూ॥17,601.94 కోట్లు. బడ్జెట్‌ను వాస్తవిక పరిస్థితులతో పోలిస్తే ఏ మాత్రం చిత్తుశుద్ధి నిజాయితీ లేని తిరోగమన బడ్జెట్ అని చెప్పవచ్చు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని గురించి గొప్పగా చెప్పడానికి గత బడ్జెట్ కంటే 15 వేల కోట్లు పెంచి చూపించారు. ఈ బడ్జెట్‌లో రాబడులు, ఖర్చులు, చెల్లించే వడ్డీరుణభారం పరిశీలించినట్లయితే ప్రజల వీపుల మీద బండరాయి మోపే బడ్జెట్ అనేది అర్థమవుతుంది.

రాష్ట్ర ఖజానాకు చేరే ప్రతిరూపాయి లోను 55 పైసలు పన్నుల ద్వారా గుంజేవే. గత సంవత్సరం 47 వేల కోట్లుగా వున్న రాష్ట్ర పన్నుల ఆదాయం అంచనాలు ఈ సంవత్సరం 57 వేల కోట్లకు పైబడి విస్తరించింది. జనం జేబులనుండి పిండడంలో కాంగ్రెస్ ఆరితేరినదని గత ఏడు సంవత్సరాలుగా వస్తున్న సుంకాలు, రాబడి చెపుతున్నాయి. లిక్కరు రక్కసితో అసంఖ్యాక నిర్భాగ్యుల కాపురాలు కూలుతున్నాయనీ గగ్గోలు పెడుతున్నా ఎక్సైజ్ సుంకాల రాబడి 4 రెట్లకు పెరిగింది. 2004 – 05 నాటి ఎక్సైజ్ ఆదాయం రెండు వేల కోట్ల రూపాయలు కాగా, 2011 – 12 బడ్జెట్‌లో రూ॥ 9000 కోట్లకు పైగా రాబట్టాలని నిర్ణయించారు.

ఈ బడ్జెట్‌లో ప్రజా సేవలైన విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, నీటి సౌకర్యం, విద్యుత్ తదితర రంగాల కేటాయింపులు, సంక్షేమ రంగానికి కేటాయింపులు చూస్తే వీటిపట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా అర్థమవుతుంది. వీటి కేటాయింపుల్లో ఖర్చుల కంటే కోతలే ఎక్కువగా వున్నాయి. ఈ రంగాలకు బడ్జెట్‌లో ప్రతి సంవత్సరం పెడ్తున్న కోతలు చూస్తే ఇది ఆర్థిక ఒత్తిడి వల్ల తాత్కాలికంగా చేసింది కాదని, ముందుగా చేసుకున్న ఒడంబడిక ప్రకారమే జరిగిందనేది అర్థమవుతుంది. ప్రభుత్వ ప్రకటనలు చూస్తుంటే రానున్న సంవత్సరాల్లో కూడా ఈ గ్రాంటులకు కోతలే వుంటాయి గాని, పెంచడం జరగదనేది స్పష్టమవుతూనే వున్నది.

## దళిత, ఆదివాసీల సంక్షేమం సున్నా

రాష్ట్రంలో దళితులకు 17 శాతం, ఆదివాసులకు 7 శాతం ప్రకారం 24 శాతం నిధులు కేటాయించవలసి ఉంది. కాని దళిత సంక్షేమానికి 2352 కోట్లు (18.2 శాతం), గిరిజన సంక్షేమానికి 692 కోట్లు (0.54 శాతం) కేటాయింపు చూస్తే వీరిపట్ల ఎంత నిర్లక్ష్యం వుందనేది స్పష్టమవుతుంది. అంతేకాక 19 సంవత్సరాలనుండి దళితులకు కేటాయించిన నిధుల్లో 26,604 కోట్లు ఇతర శాఖలకు మళ్ళించారు.ఈ సంవత్సరం 17 వేల కోట్లు కూడా కలిపి రూ॥ 43,604 కోట్లు దళితులకు రావాల్సిన వాటా దక్కకుండా పోయింది. రాష్ట్రంలోని 55 వేల దళితవాడల్లో కనీస వసతులు లేక, ఆదివాసులు మలేరియా తదితర వ్యాధులతో పెద్ద సంఖ్యలో మరణాల పాలవుతుంటే, ప్రభుత్వం వారికి కేటాయించిన నిధులను మళ్లించటం కంటే విచారకరం మరొకటి వుండదు.

మొత్తం బడ్జెట్‌లో సంక్షేమానికి 10 శాతం మించని కేటాయింపువల వల్ల ప్రజాసంక్షేమం జరగదు సరికదా, ప్రజలు మరింత ఇబ్బందుల పాలవ్వక తప్పదు. బడ్జెట్ కేటాయింపులు ప్రభుత్వ భాగస్వామ్యంతో నిర్వహించే విధంగా కాక ప్రైవేటు భాగస్వామ్యంతో నడిచే విధంగా వున్నాయి. ప్రజాసంక్షేమ రంగాలకు ప్రభుత్వం తగినన్ని నిధులు ఇవ్వదని కేటాయింపుల్లో కొరతల ద్వారానే చెబుతున్నది.

## చదువును కొండెక్కిస్తున్న ఫీజుల బకాయిలు

బోధనా ఫీజులు, ఉపకార వేతనాల బకాయిలు ప్రస్తుతం రాష్ట్రాన్ని అట్టుడికిస్తున్న, ఆందోళన కలిగిస్తున్న సమస్య. పాత బకాయిలే రూ॥ 2600 కోట్లు. ఈ బడ్జెట్‌లో కేటాయించిన 2,475 కోట్లతో ఈ విద్యా సంవత్సరంలో మరొక 2600 కోట్ల రూపాయల బకాయిలు పేరుకోవటమే కాక ఎటువంటి అభివృద్ధి జరిగే అవకాశం లేదు. గత ఏడాది 1.14 లక్షలు, ఈ విద్యా సంవత్సరంలో 1.40 లక్షలు విద్యార్థుల దరఖాస్తులను ప్రభుత్వం తిరస్కరించింది. అంటే పేద విద్యార్థులను చదువు కోవద్దని హెచ్చరిస్తుందన్నమాట. గత ఎన్నికల ముందు ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనార్టీ, ఇ.బి.సి లకు కె.జి నుండి పి.జి వరకు ఉచిత విద్యనందిస్తామని వాగ్దానం చేసిన ఈ ప్రభుత్వమే, ఇప్పుడు వారికి చదువును నిరాకరిస్తున్నది.

వ్యవసాయరంగానికి బడ్జెట్‌లో కేటాయించింది రూ॥ 2,148 కోట్లు, పంటల భీమ పథకానికి, ప్రకృతి వైపరీత్యాల పరిహారానికి కేటాయింపులు లేవు. రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రం మూడవ స్థానంలో వుండగా, వాటిని అపడానికి, గిట్టుబాటు ధరలు పెంచడానికి బడ్జెట్‌లో ప్రయత్నాలేమి లేవు. రాజశేఖర్‌రెడ్డి మానస పథకం, జలయజ్ఞాన్ని కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ కొనసాగిస్తామంటు న్నా, దానికి కేటాయించిన నిధులు ఎప్పటిలాగే ధనయజ్ఞానికి మాత్రమే సరిపోయేటట్లున్నాయి. వ్యవసాయ రంగం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వీటిని బట్టే అర్థమవుతుంది.

ఆకాశాన్నంటుతున్న ధరలతో సామాన్యుల బ్రతుకులు అతలాకుతలమవుతున్నా ధరల స్థిరీకరణ ఊసేలేదు. అంటే దీనర్థం భవిష్యత్తులో పన్నుల మోత, ధరల మోత వుంటుందన్న మాట. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన మరుసటి రోజున యు.పి.ఏ ప్రభుత్వం అదే చేసింది. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఒక్క పెట్టున పెంచేసి సామాన్య ప్రజల నెత్తిన దుడ్డుకర్రతో మోదింది. రాష్ట్రంలో చేనేత, మత్స్య, గీత కార్మికులు తీవ్రమైన సంక్షోభంలో చిక్కుకుని విలవిలలాడుతున్నారు. వీరి సంక్షేమం గురించి బడ్జెట్‌లో ఏ విధమైన రక్షణ చర్యలు లేవు.

ప్రజాసంక్షేమం ఏమైపోయినా పట్టని ప్రభుత్వాలు, పాలకవర్గాల క్షేమం కోసం పోలీసు, రక్షణ రంగాలకు మాత్రం సమృద్ధిగా నిధులు కేటాయించి, పూర్తిగా ఖర్చు చేస్తున్నాయి. ఉదాహరణకు 2010 – 11 ఆర్థిక సంవత్సరంలో పోలీసుశాఖకు రూ॥ 3,343 కోట్లు కేటాయించి, రూ॥ 3,317 కోట్లు ఖర్చు చేశారు. ఈ విధంగా మరే శాఖకు నిధులు కేటాయించి, ఖర్చు చేస్తున్న దాఖలాలు లేనేలేవు.

## ఆదాయంలో 41 శాతం అప్పులు తీర్చడానికే

మన రాష్ట్ర బడ్జెట్ లక్షా 28 వేల కోట్లు కాగా, అప్పులు లక్షా 41 వేల కోట్లు. ఇంతటి అప్పుల గురించి బడ్జెట్‌లో ఎటువంటి ప్రస్తావన లేదు గాని, భారీ బడ్జెట్ గురించి డబ్బా మోగించుకుంటున్నారు. బడ్జెట్‌లో 9 శాతం (రూ॥ 11,437 కోట్లు) ప్రతిసంవత్సరం రుణాలపై వడ్డీ చెల్లింపులకే సరిపోతున్నది. 8.5 కోట్ల రాష్ట్ర జనాభాకు తలసరి అప్పు సుమారు 21,311 రూపాయలు. ఈ అప్పులు తీర్చడానికి ప్రజలందరూ సిద్ధంగా వుండండి, మేము పన్నులు వేసి వసూలు చేస్తామని ప్రభుత్వం అంటున్నది.

కార్పోరేట్ సంస్థలు, ఫైనాన్స్ సంస్థలు, వివిధ రకాల కార్పోరేటు ఆసుపత్రులు, కాలేజీలు, పెద్ద పెద్ద పరిశ్రమలనుంచి పన్నుల ద్వారా ఆదాయం రాబట్టే చర్యలేవి బడ్జెట్‌లో లేవు. కానీ పరోక్ష పన్నుల ద్వారా సామాన్య ప్రజల నుండి రాబట్టడానికి బడ్జెట్‌లో ఏర్పాట్లు పకడ్బందీగా వున్నాయి. రాష్ట్ర బడ్జెట్ ఏ విధంగా చూసినా పేదల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసి, బడా బాబులకు భలే విందు చేసేదిగానే వుంది.

ప్రజలు చైతన్యంవంతులై పోరాడనంతవరకు జనాన్ని మోసగించి తమ దోపిడీని సానుకూలం చేసుకునే ఇటువంటి మోసపూరిత బడ్జెట్లు ప్రతి సంవత్సరం పాలవకర్గాల చేతిలో తయారవుతూనే వుంటాయి.

అరబ్బు ప్రపంచంలో రాజకీయ సంక్షోభం - 3

# లిబియాపై సామ్రాజ్యవాద దాడుల్ని ఖండిద్దాం! గడాఫీ ప్రజావ్యతిరేక పాలనను నిరసిద్దాం!!

ఉత్తరాఫ్రికా, పశ్చిమాసియా ప్రాంతాలలోని అనేక దేశాలు నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా పోరాటాలకు కేంద్రాలయ్యాయి. టునీషియా, ఈజిప్ట్ తర్వాత లిబియా ఆ వరుసలో వుంది. లిబియాకు టునీషియా, ఈజిప్ట్ దేశాలు సరిహద్దు దేశాలు కూడా. ఈ మూడు దక్షిణాఫ్రికా దేశాలు. మధ్యధరా సముద్ర తీర ప్రాంతంలోని దేశాలు. చమురు నిక్షేపాలున్న దేశాలు. నియంతృత్వ పాలన ఉన్న దేశాలు కూడా.

లిబియా రాజధాని ట్రిపోలి. 17లక్షల 60వేల చ.కి.మీ విస్తీర్ణం ఉన్న చిన్న దేశం ఇది. ఇక్కడ 100కు పైగా తెగల ప్రజలు ఉన్నారు. లిబియాకు చమురు ప్రధాన వనరు. చమురుతో పాటు గ్యాస్ కూడా అధికంగానే లభిస్తుంది. పొటాషియం కూడా దొరుకుతుంది. ఇక్కడి చమురు మేలురకమైనది. కొద్దిగా శుద్ధి చేస్తే చాలు. 44.3 బిలియన్ బ్యారళ్ళ చమురు ఉన్న లిబియా మొత్తం ఉత్పత్తిలో 79శాతం ఇటలీ, ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీ తదితర యూరోపియన్ దేశాలకు ఎగుమతి అవుతుంది.

ప్రపంచ ఆర్థిక సంక్షోభం తెచ్చిన నేటి లిబియా రాజకీయ సంక్షోభం కన్నా ముందు అక్కడి ఆర్థిక పరిస్థితి చాలా మెరుగుపడింది. మన రూపాయిల్లో అక్కడి తలసరి ఆదాయం ఏడున్నర లక్షల రూపాయలు. మనకన్నా 14 రెట్లు ఎక్కువ. మన తలసరి ఆదాయం కేవలం 53 వేల రూపాయలు మాత్రమే. లిబియా జీవన ప్రమాణాలు ఇటలీ, సింగపూర్, దక్షిణ కొరియా, స్పెయిన్, న్యూజిలాండ్ లాంటి అనేక దేశాలకన్నా మెరుగ్గా ఉన్నాయి. 3సం॥ల దిగుమతులకు సమానమైన 110 బిలియన్ల డాలర్ల బ్యాంకు నిల్వలు ఉన్నాయి. 70 బిలియన్ డాలర్ల విదేశీమారక ద్రవ్య నిల్వలున్నాయి. విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రత్యేక శ్రద్ధతో 15 శాతం కేటాయింపులుండడంతో 85 శాతం అక్షరాస్యత సాధించిన లిబియా ఆఫ్రికా ఖండంలోనే మొదటి స్థానం సంపాదించింది. వైద్యం, సాంస్కృతిక విషయాల్లో కూడా ప్రత్యేక శ్రద్ధ, అభివృద్ధి కనబడతాయి. లిబియా అనేక సందర్భాలలో ఇతర ఆఫ్రికన్ దేశాలకు, పశ్చిమాసియా దేశాలకు ఇతోధికంగా ఆర్థిక సహకారం అందించింది. దేశంలో వ్యవసాయాన్ని అభివృద్ధి చేశారు. సాగునీటి సమస్యను పరిష్కారం చేశారు.

లిబియాకు సుదీర్ఘమైన రాజకీయ పోరాట చరిత్ర ఉంది. 2వ ప్రపంచ యుద్ధానికి ముందు 50 సంవత్సరాల పాటు ఇటలీ ఫాసిస్టుల వలస రాజ్యంగా ఉంది లిబియా. ఒమర్ ముక్తార్ నాయకత్వంలో ప్రజలు వీరోచితంగా ప్రతిఘటించి పోరాటాలు నడిపారు. ఒక లక్ష మందికి పైగా లిబియా ప్రజలు ప్రాణత్యాగాలు చేశారు. ఇటలీ ఫాసిస్టులను గడగడలాడించిన ఆనాటి ఒమర్ ముక్తార్ నడిపిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయి.

2వ ప్రపంచ యుద్ధకాలంలో మిత్ర రాజ్యాల సేనలు, లిబియా ప్రజలతో కలిసి ఇటలీ ఫాసిస్టు సేనలను తరిమికొట్టాయి. ఇటలీ ఓడిపోయింది. ఇటలీ వలస పాలన నుండి బయటపడిన లిబియా ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో 1947 నాటికి ఫ్రాన్స్, బ్రిటన్‌ల ఆధీనంలోకి వెళ్లింది. ఐక్యరాజ్యసమితి 1949 నవంబర్ 21న చేసిన తీర్మానం ప్రకారం లిబియా 1951 డిసెంబర్ 24న స్వాతంత్ర్యం ప్రకటించుకున్నది. అప్పటి నుండి సెనుస్సిస్ తెగకు చెందిన ఇద్రిస్ రాజు పాలన మొదలయ్యింది. 'యునైటెడ్ కింగ్ డమ్ ఆఫ్ లిబియా' గా పేరు మార్చుకుంది. 1953లో ఇది అరబ్‌లీగ్‌లో సభ్య దేశంగా చేరింది. ఒక దశాబ్ద కాలం పాటు జరిగిన ఈ పరిణామాలన్ని పశ్చిమ దేశాలకు అనుగుణంగానే జరిగాయి. దేశంలో అత్యధికంగా చమురు నిల్వలుండడంతో 1955 నాటికే ఆర్థికంగా బలపడింది. ఇద్రిస్ రాజు రాచరికపాలనలో 19 సంవత్సరాలు కొనసాగింది.

ఇద్రిస్ రాజు వైద్యం కోసం టర్కీ దేశానికి వెళ్ళిన సమయంలో 1969 సెప్టెంబర్ 15న సైన్యంలో కల్నల్‌గా పనిచేస్తున్న 27సం॥ల గడాఫీ మరికొంతమంది అధికారులను (వీరినే ఫ్రీ ఆఫీసర్స్ అంటున్నారు) కలుపుకొని సైనిక తిరుగుబాటు చేసి రాజ్యాధికారాన్ని చేజిక్కించుకున్నాడు. రాచరికాన్ని రద్దు చేశాడు.

నియంతలకే నియంతగా పేరుపడ్డ గడాఫీ 42 సం॥ల పాలన, ప్రపంచ రాజకీయాలపై వేసిన ముద్ర ప్రత్యేకమైనది. పెద్ద టెంట్ హౌస్‌తో, అనేక మంది మహిళా అంగరక్షకులతో ఉండే గడాఫీ ఒక క్రమం, ఖచ్చితమైన విధానం లేకుండానే, నియమరహితంగా

అనేక విధాలుగా శత్రువుల గుండెల్లో గుబులు పుట్టించిన ఒక నియంతగా పేరు తెచ్చుకున్నాడు. లిబియా పశ్చిమ ప్రాంత నిమ్న జాతి ప్రజల్లో ఆరాధ్యుడిగా, తూర్పు ప్రాంత ప్రజలను నిర్లక్ష్యం చేసిన పాలకుడుగా, నియంతగా పేరు తెచ్చుకున్నాడు. ప్రపంచ రాజకీయాలలో అమెరికా, పశ్చిమ సంపన్న దేశాల దృష్టిలో పెద్ద ఆటంకంగా మారాడు. ఈనాటి లిబియా రాజకీయ సంక్షోభాన్ని అర్థం చేసుకోవడానికి గల్ఫ్ ప్రాంతంలోని అనేక విషయాలను, గడాఫీ అనుసరించిన దేశీయ, విదేశాంగ విధానాలను, రాజకీయ కార్యకలాపాలను అర్థం చేసుకోవలసి ఉంటుంది.

గడాఫీ చిన్న తనంలోనే సూయజ్ కాలువ సంక్షోభం (1956) గల్ఫ్ రాజకీయాలను వేడెక్కించింది. ఈజిప్ట్‌లో నాసర్ నడిపిన సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల్లో, ఇజ్రాయిల్ వ్యతిరేక ప్రదర్శనల్లో గడాఫీ పాల్గొని మద్దతు తెలిపాడు. "నాసర్ సోషలిస్టు జాతీయ వాదాన్ని" ఆదర్శంగా తీసుకున్నాడు.

గడాఫీ అధికారంలోకి వచ్చాక చమురు క్షేత్రాలను జాతీయం చేశాడు. విదేశీ ఆస్తులను జాతీయం చేశాడు. అమెరికా, బ్రిటన్ సైనిక స్థావరాలను ఎత్తివేశాడు. ఈ కారణంగా బ్రిటన్ గడాఫీని అప్పుడే చంపడానికి ప్రయత్నించింది.

సామ్రాజ్యవాద వ్యతిరేక భావాలున్న గడాఫీకి జాతీయవాదం బలంగా ఉంది. అరబ్ దేశాల స్వాతంత్ర్యం కోసం కృషి చేశాడు. 'లిబియన్ అరబిక్ రిపబ్లిక్' ను ఏర్పాటు చేసి తనను తాను చేగువేరాగా ప్రకటించుకున్నాడు. తను అధ్యక్షుడుగా రివల్యూషనరీ కమాండ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేశాడు. లిబియా సమాజం ప్రజలచే పాలించబడే సమాజం అని, తాను వారి ప్రతినిధినని చెప్పాడు. అరబ్ నేషనలిజం, సంక్షేమ రాజ్యం, ప్రత్యక్ష జనరంజక ప్రజాస్వామ్యం లాంటి నినాదాలతో పాలన సాగుతున్నట్లు చెప్పుకున్నాడు. ఒక దశలో ఇస్లాం సామ్రాజ్యవాదం గురించి కూడా చెప్పాడు.

అటు పెట్టుబడిదారీ విధానానికి ఇటు కమ్యూనిజానికి దూరంగా తనది మూడో మార్గం అని చెప్పుకున్న గడాఫీ, లిబియాలో మాత్రం పెట్టుబడిదారీ విధానాన్నే అనుసరించాడు. అంతర్జాతీయ పరిణామాల్లో భాగంగా క్రమంగా సోవియట్ యూనియన్ వైపు మొగ్గి, సోవియట్ సహాయంతో ఈజిప్ట్‌పై దాడి చేశాడు. పాలస్తీనాకు మద్దతు నిచ్చాడు.

1979లో రష్యా ఆఫ్ఘనిస్తాన్‌పై దాడి చేసినంతవరకు లిబియా రష్యా మీద ఆధారపడి 10 సం॥ల కాలంలో వివిధ పథకాలను అమలు చేసింది. చమురు రంగంతో పాటు సైనిక రంగం విస్తరించి అభివృద్ధి చెందాయి. ఆర్థిక సామాజిక రంగాలలో వచ్చిన అభివృద్ధి రాజకీయ సుస్థిరతకు తోడ్పడింది. 1973లో చమురుపై మారటోరియం ప్రకటించి అమెరికా, యూరోపియన్ దేశాలపై దాన్ని ఒక ఆయుధంగా వినియోగించాడు. 'చిన్న పరిశ్రమలను' ప్రైవేటువారికి ఇచ్చినా భారీ పరిశ్రమలను ప్రభుత్వ అజమాయిషీ క్రిందికి తెచ్చాడు. 1977లో "గ్రేట్ సోషలిస్టు పీపుల్స్ లిబియన్ అరబ్ జమాహారియా" గా దేశం పేరు మార్చాడు. సహజీవన వ్యవస్థ ద్వారా ప్రత్యక్ష ప్రజాస్వామ్యం అమలు జరిగిందని చెప్పాడు. అరబ్ దేశాల ఐక్యతకు "ఐక్య అరబ్ జాతి" కోసం పోరాడుతున్నానన్నాడు. దక్షిణాఫ్రికా ముస్లిం దేశాల్లో తిరుగుబాటు ఉద్యమాలను, విముక్తి ఉద్యమాలను ప్రోత్సహించే అంతర్జాతీయ రాజకీయ విధానాన్ని అనుసరించాడు. ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్‌కు, ఐరిష్ రిపబ్లిక్ ఆర్మీకి ఆర్థిక, సైనిక సహకారాన్ని అందించాడు. ఈ దశాబ్ద కాలంలో గడాఫీ విప్లవకర పాత్రను నిర్వహించాడు. సామ్రాజ్యవాద వ్యతిరేక వ్యక్తిగా, శక్తిగా కూడా అమెరికా, యూరోపియన్ దేశాల చేత గుర్తించబడ్డాడు. అంతర్జాతీయ ఉగ్రవాదానికి నిధులిచ్చే వ్యక్తిగా ఆ దేశాలు అనుమానించాయి.

పాలస్తీనా విషయంలో ఇజ్రాయిల్‌ను, అమెరికాను వ్యతిరేకించడం, ఈజిప్ట్‌తో ఘర్షణ, లిబియా నుండి సామ్రాజ్యవాదులను తరిమివేయడం ఇలా అన్ని రకాల గడాఫీ చర్యలు అమెరికాకు, యూరప్ దేశాలకు కోపాన్ని తెప్పించాయి. గడాఫీని లొంగదీయడానికి, రాడికల్ జాతీయవాదాన్ని దెబ్బతీయడానికి 'లాకర్ బీ కేసు' లో ఇరికించి హేగ్‌లోని అంతర్జాతీయ కోర్టులో విచారణ జరిపించారు. అమెరికా అనేకసార్లు బాంబింగ్ చేసి గడాఫీని హతమార్చడానికి ప్రయత్నించింది.

నిజానికి లాకర్‌బీ వద్ద ఇరాన్‌కు చెందిన ఒక ప్రయాణీకుల విమానాన్ని అమెరికన్ డెస్ట్రాయర్ నౌకతో కాల్పులు జరిపి కూల్చివేశారు. దానిని కుట్రపూరితంగా లిబియాపైకి నెట్టి గడాఫీతో పాటు మరికొద్ది మందిని దోషులుగా ముద్రవేశారు. లిబియాకు పెరటిదొడ్డి లాంటి మధ్యధరా సముద్రంలో లిబియా నౌకలు తిరగకుండా అమెరికా ఆంక్షలు విధించి ఏకపక్షంగా అమలుచేసింది. గడ్డు పరిస్థితులున్నా, కఠిన ఆంక్షలు ఉన్నా లిబియా ప్రజలు ఒక్కటిగానే వున్నారు. 1991లో ఇరాక్ కువైయిట్‌ను ఆక్రమించిన సందర్భంగా అమెరికా ఇరాక్‌పై దాడి చేసింది. అమెరికా దాడిని గడాఫీ ఖండించాడు. ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌కు అండగా నిలిచాడు. ఇది అమెరికాకు మరింత ఆగ్రహాన్ని కలిగించింది.

సోవియట్ యూనియన్ పతనం కావడంతో ప్రపంచ పరిస్థితిలో మార్పులు వచ్చాయి. 1991 మొదటి గల్ఫ్ యుద్ధం తర్వాత అమెరికా ఒక్కటే అగ్రరాజ్యంగా నిలిచి బలపడడంతో ప్రపంచ ఆర్థిక, రాజకీయ,

మిలిటరీ విషయాలను అది అదుపు చేయడం పెరిగింది. లిబియాను కాపాడి మద్దతునివ్వగల స్థితిలో రష్యాలేదు, తీవ్ర ఒత్తిడి, ఆంక్షలు లిబియాపై ప్రభావాన్ని చూపాయి. ఆర్థిక పురోగతి దెబ్బతిన్నది. క్రమంగా లిబియా వైఖరిలో మార్పు వచ్చింది. విదేశాంగ విధానంలో సడలింపు చోటు చేసుకుంది. ఎంత చల్లబడినా, ఎంతగా మెత్తబడినా, దౌత్యపరమైన ఒత్తిడి ఎంత ఉన్నా 'దుష్టులకు దూరంగా ఉండాలన్న వైఖరి' ని అనుసరించారే గాని అమెరికా, యూరోపియన్ దేశాలతో సర్దుబాట్లు చేసుకోలేదు. ఆంక్షలు తొలగితే రాజకీయ, ఆర్థిక, స్థిరత్వం వస్తుంది. కానీ ఆంక్షలు తొలగలేదు. సామ్రాజ్యవాద దేశాలు కుట్ర పూరితంగానే లిబియాను ఒంటరి చేసి, ఆంక్షలు విధించి వేధించాయి.

## గడాఫీ రాజీ ధోరణి:

1999 నాటికి గడాఫీ సామ్రాజ్యవాద శక్తులకు క్రమంగా (3 దశాబ్దాల తర్వాత) లొంగిపోవడం మొదలయ్యింది. లాకర్ బీ కేసు విషయంలో గడాఫీ వారితో రాజీపడ్డాడు. 2001 సెప్టెంబర్11 సంఘటనను ఖండించాడు. పాలస్తీనా విషయంలో కేవలం ఖండనలకే పరిమితమయిన స్థితి కూడా మారిపోయి అక్కడి ఘటనలకు కేవలం ప్రేక్షకపాత్ర వహించడం మొదలయ్యింది. అమెరికా, యూరప్ దేశాల చమురు కంపెనీలతో అనేక ఒప్పందాలు చేసుకున్నారు. 2004లో లాకర్ బీ కేసులో విధించిన ఆంక్షలు రద్దయ్యాయి. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలికి లిబియా ఎన్నిక కూడా జరిగింది. ఈ ఆంక్షలు రద్దు కావడానికి ముందు జరిగిన దౌత్య ప్రక్రియలో గడాఫీ కొన్ని షరతులకు ఒప్పుకున్నాడు. దానితో సామ్రాజ్యవాద కంపెనీలు లిబియాలోకి ప్రవేశించాయి.

అయితే ఇక్కడ ఒక మినహాయింపు, ఒక తేడా కూడా ఉంది. చమురు క్షేత్రాలన్నీ జాతీయం చేయబడి ఉండడంతో ఆ నిబంధనలకు లోబడి ఒప్పందాలు జరిగాయి. సామ్రాజ్యవాద అనుకూల దేశాలైన సౌదీ అరేబియా, కువైట్, బహ్రెయిన్, కతార్, యెమెన్‌లలో వలె విదేశీ కంపెనీలకు లిబియా చమురు క్షేత్రాలమీద గుత్తాధిపత్యం సాధ్యం కాదు. పూర్తి స్వేచ్ఛను ఇవ్వకుండా పరిమితులతో కూడిన అనుమతిని మాత్రమే ఇచ్చారు. కేవలం పర్సెంటేజి కమీషన్ మాత్రమే వారికి వెళుతుంది. ఈ మాత్రం దానికే వారు సంతోషించారు. గుడ్డిలో మెల్ల అనుకున్నారు. కాళ్లు పెట్టనిస్తే, తరువాత చూసుకోగలం అనుకున్నారు.

ఈ దశాబ్దంలోనే ఇరాక్ యుద్ధంలో గొంతులోతుకు కూరుకుపోయిన అమెరికా సంక్షోభ పరిస్థితి పరోక్షంగా లిబియాకు తోడ్పడింది. సంకీర్ణ కూటమిలోని అంతర్గత కలహాలు అమెరికా పెద్దన్న పాత్రను ప్రశ్నించాయి. ఇరాక్‌లో లభ్యమయ్యే చమురులో అధిక వాటా కోసం ఫ్రాన్స్ డిమాండ్ చేసింది. అమెరికన్ కంపెనీలకు ఇది ఇష్టం లేదు. ఇక ఆ పరిస్థితిలో లిబియాలో ఆయిల్ తీసుకోవడానికి ఫ్రాన్స్‌కు అమెరికా అంగీకారం తెలియజేసింది. దొంగలు దొంగలు కలిసి ఊర్లు పంచుకున్న విధంగా జరిగింది. ఆ విధంగా ఆ సమస్య నుండి అమెరికా తప్పుకుంది. ఫ్రాన్స్‌కు లిబియా విషయంలో ఆత్రుత పెరిగింది. అందుకే ఈ పరిణామాల్లో ఫ్రాన్స్ మరింత దూకుడుగా ఉంది.

ఈ మధ్య కాలంలో సామ్రాజ్యవాద దేశాలకు లిబియా మీద మరింతగా కోపం రావడానికి కారణమైన మూడు పరిణామాలు జరిగాయి. 2008 అక్టోబర్ చివరలో గడాఫీ మూడు రోజులు రష్యాలో పర్యటించి రష్యాతో కొన్ని ఒప్పందాలు చేసుకున్నాడు. చమురు, నౌకా వాణిజ్యంతోపాటు, సైనిక సాంకేతిక రంగాలలో ద్వైపాక్షికంగా ఆ ఒప్పందాలు జరిగాయి. లిబియా చెల్లించాల్సిన పాత బాకీ 4. 6 బిలియన్ డాలర్ల మొత్తాన్ని రష్యా రద్దు చేసింది. రెండోది 'లాకర్ బీ' కేసులో ముద్దాయిలను దయతో విడుదల చేస్తే ఆ విడుదలయిన సందర్భాన్ని లిబియా పండుగ దినంగా ప్రకటించింది. ఆ సందర్భంగా గడాఫీ మాట్లాడుతూ సామ్రాజ్యవాదుల మీద నిప్పులు కక్కాడు. ఇది వారికి కష్టంగా ఉంది. ఇక మూడోది 2009 సెప్టెంబర్ 29న అమెరికాకు మొదటి సారిగా వచ్చిన గడాఫీ న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి 64వ మహాసభలో మాట్లాడాడు. ఐక్యరాజ్యసమితి కౌన్సిల్‌ను ఉగ్రవాద కౌన్సిల్ అన్నాడు. హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆటవిక న్యాయస్థానం అన్నాడు. ఇంకా అగ్రరాజ్యానిదే ఉగ్రవాదమని, తాలిబాన్లను సృష్టించింది వీరేనని తేల్చి చెప్పి, సామ్రాజ్యవాదుల ద్వంద్వ వైఖరిని నిశితంగా విమర్శించాడు. ఇవి వారి కడుపుమంటను విపరీతంగా పెంచాయి. లిబియాను చీల్చేందుకు కుట్రలు ప్రారంభమయ్యాయి.

ఈ సందర్భంగా అమెరికా సామ్రాజ్యవాదం గల్ఫ్ ప్రాంతంలో అనుసరిస్తున్న విదేశాంగ విధానాన్ని కూడా అర్థం చేసుకోవాలి. ఫ్రాన్స్, బ్రిటన్ దేశాల విధానాలు కూడా దీనికి అనుగుణంగానే ఉన్నాయి. అభివృద్ధి చెందిన ఈ దేశాల కార్ల (వాహనాల) సంస్కృతికి అనుగుణంగా అరబ్ దేశాల చమురు యధేచ్ఛగా సరఫరా కావాలి. 'టెర్రరిస్టు వ్యతిరేక పోరాటం' లో అరబ్ మిత్రులు (నియంతలు/ రాజులు) స్థిరంగా తోడ్పడాలి. అరబ్ దేశాలన్ని ఇజ్రాయిల్‌తో సన్నిహితంగా ఉండి లెబనాన్, పాలస్తీనాలపై అది చేసే దాడుల్ని సమర్థించాలి. ఇదే విధానంతో అమెరికా అన్ని గల్ఫ్ దేశాలను కంట్రోల్ చేస్తున్నది.

సామ్రాజ్యవాద వ్యతిరేక, అనుకూల, మరలా వ్యతిరేక విధానాలు అనుసరించిన గడాఫీ లిబియా దేశంలో అనుసరించిన

పరిపాలన విధానంలోని మంచి చెడులను కూడా పరిశీలిస్తే ఈనాడు తూర్పు లిబియాలో బద్దలయిన ప్రజాందోళనకు కారణాలు మరియు బాహ్యశక్తుల ప్రేరణ అర్థమవుతాయి.

గడాఫీ 42 సం॥ల పరిపాలనలో అవినీతి, నియంతృత్వం ఉన్నాయి. బలంగా బంధుప్రీతి ఉంది. కొన్ని తెగల ఎడల, తూర్పు ప్రాంతం పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం ఉంది. 1972లో దేశంలో ప్రతిపక్ష పార్టీలను నిషేధించాడు. అక్కడ సమ్మె హక్కులేదు. కార్మిక సంఘాలు లేవు. సోషలిజం, అరబిజం అని ఎన్ని రకాలుగా మాట్లాడినా గడాఫీ పెట్టుబడిదారీ విధాన మార్గాన్నే అనుసరించాడు. అవినీతిమయమైన పాలన కారణంగా ధనికులు – బీదల మధ్య తారతమ్యాలు పెరిగాయి. గడాఫీ ఏడుగురు కొడుకులు, కూతురు, తమ్ముడు వీరంతా ప్రభుత్వాన్ని యథేచ్ఛగా నడిపే పరిస్థితి నెలకొన్నది. ఇవన్నీ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతకు, నిరసనకు కారణాలు. అందుకే తూర్పున మొదలైన ఉద్యమం గడాఫీ నియంతృత్వం నశించాలని, గడాఫీ, గడాఫీ కుటుంబ పాలన నశించాలని కోరుతున్నారు.

ఇదే సమయంలో ప్రపంచ ఆర్థిక సంక్షోభ ప్రభావం బలంగానే లిబియా మీద పడింది. ఎగుమతులు తగ్గడం, ఆహారధాన్యాల ధరలు పెరగడం లాంటివి ప్రత్యక్ష ప్రభావాలు కాగా లిబియాను ఒంటరిగా చేసి దెబ్బకొట్టే సామ్రాజ్యవాద ఆంక్షలు పరోక్ష ప్రభావాన్ని వేసి దేశంలో ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించాయి. ఉద్యోగాలు, పనులు కోల్పోయి, జీవన ప్రమాణాలు క్రమంగా దిగజారిన ప్రజలు మహిళలతో సహా వీధుల్లోకి వచ్చి పోరాటాలకు సిద్ధమయ్యారు. టునీషియా, ఈజిప్ట్ విప్లవాల ప్రభావంతో ముందు కొచ్చిన ఈ ఉద్యమాన్ని గడాఫీ పాశవికంగా అణచివేయడానికి ప్రయత్నించాడు. ప్రపంచ వ్యాపితంగా ప్రజలు, ప్రజాస్వామిక వాదులు గడాఫీ నియంతృత్వ పాలనను నిరసించారు. ప్రజాందోళనకు మద్దతు తెలిపారు. పశ్చిమ ప్రాంతంలో నిమ్న తెగలనుండి సంపూర్ణమైన మద్దతుతో, ఇరవై వేల మంది అనుకూలమైన పారామిలటరీ బలగాల అండతో గడాఫీ దాడులు చేయడం వలన గడాఫీకి వ్యతిరేకంగా ఉన్న శక్తులన్నీ ఐక్యం కావడానికి తోడ్పడ్డాయి. దీనిని అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ లాంటి దేశాలు సరైన సమయంగా భావించి పథకాలు రచించి కుట్ర పద్దతుల్లో ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో తీర్మానం చేయించాయి. నోఫ్లైజోన్ ఏర్పాటుకు, తమకు అనుకూలమైన అరబ్ లీగ్‌లోని తొమ్మిది దేశాలు మాత్రమే ఓటింగ్‌లో పాల్గొన్నాయి. అందులో ఆరు దేశాలు (తొత్తులయిన) గల్ఫ్ సహకార సంస్థ దేశాలే ఉన్నాయి. మిగిలిన 13 దేశాలు నోఫ్లై జోన్‌కు వ్యతిరేకం. ఆఫ్రికన్ యూనియన్ (53 దేశాలు) ఏకగ్రీవంగా నోఫ్లై జోన్‌ను వ్యతిరేకించింది. ఆ తీర్మానం చేసీ చేయకముందే (సిరాతడి ఆరక ముందే) అమెరికా, యూరప్ దేశాలు లిబియాపై విమాన దాడులు ప్రారంభించాయి.

ప్రస్తుత సామ్రాజ్యవాద దాడులకు లిబియా టార్గెట్ కావడానికి అనేక వైరుధ్యాలు పనిచేశాయి.

అందులో ఒకటి, లిబియా నుండి తూర్పు, పశ్చిమ ప్రాంతాల మధ్య ముఖ్యంగా తూర్పున బెంఘాజీ కేంద్రంగా సెనుస్సిస్ తెగ నాయకత్వాన సమీకరించబడిన ప్రజాందోళనకు పశ్చిమంలోని గడాఫీ అనుకూల తెగలకు మధ్య వైరుధ్యం ఉంది. ఇది గడాఫీ పాలనలోని అవినీతి, బంధుప్రీతి, నియంతృత్వ ధోరణుల వలన కలిగినది. తూర్పు ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేయడంతో పాటు అణచివేత విధానాలను అనుసరించింది. ఇటలీ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడడంలో బెంఘాజీ ముఖ్య కేంద్రంగా పని చేసింది. ఇక్కడ రాజకీయ ఇస్లాం ఉద్యమ ప్రభావం ఉంది. ఇక్కడి ప్రజలకు పోరాట వారసత్వం కూడా ఉంది. యువత ఆఫ్ఘన్, ఇరాక్ దేశాలకు వెళ్ళి పోరాటంలో పాల్గొన్నారు. ఇక్కడే చమురు కేంద్రాలు, శుద్ధి కర్మాగారాలున్నాయి. ఇక్కడి ప్రజల ప్రాధాన్యతను గుర్తించని కారణంగానే ఈ పరిణామం దాపురించింది. దీనికి పూర్తి బాధ్యత గడాఫీ ప్రభుత్వానిదే. పెట్టుబడిదారీ మార్గాన్ని అనుసరించడంతో ధరలు పెరిగాయి. నిరుద్యోగం పెరిగింది. అసమానతలు, అణచివేత పెరిగి అశాంతి, అలజడికి కారణమయ్యాయి.

రెండవది, అరబ్ ప్రపంచంలో ముస్లిం మతంలోనున్న సున్నీ – షియా వైరుధ్యం. ప్రజాస్వామిక ఉద్యమాలను, బహుళజాతి ప్రజాస్వామ్యాన్ని అనుమతించాలంటే సౌదీలాంటి రాచరికాల, నియంతృత్వాల భయం ఒక్కటే. బహుళపార్టీ ప్రజాస్వామికంగా ఎన్నికలు జరిగితే చాలా దేశాల్లో రాచరికాలు, నియంతృత్వాలు ఓడిపోతాయి. తుడిచిపెట్టుకుపోతాయి. ఇది వారికి ఇష్టంలేదు. అమెరికన్, యూరప్ సామ్రాజ్యవాద దేశాలకు కూడా ఇష్టం లేదు. అందుకే వాళ్లంతా కలిసి ఒక పక్కన బెహ్రయిన్, ఎమెన్‌లాంటి దేశాల్లోకి బలగాలను కూడా పంపి ప్రజాస్వామిక ఉద్యమాలను అణచివేస్తూనే, మరో పక్కన అరబ్ మితవాద శక్తులకు తలనొప్పిగా తయారయిన గడాఫీని లిబియా నుండి పారదోలడానికి సామ్రాజ్యవాదుల దురాక్రమణ దాడికి వంతపాడుతున్నారు. అన్ని విషయాలను ప్రభావితం చేస్తున్న కీలకమైన విషయం ఏమిటంటే గడాఫీకి సామ్రాజ్యవాద శక్తులకు మధ్య వైరుధ్యం. ఇది గడాఫీని వ్యక్తిగా చూపిస్తున్నా, లిబియా సామాజిక రాజకీయ నేపథ్యం నుండి గానీ అక్కడున్న ఆర్థిక వనరుల అవకాశం నుండి గాని విడదీసి చూడలేని ఒక ముఖ్య అంశం.

గడాఫీని చంపడానికి బ్రిటన్, అమెరికా చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. గడాఫీ ప్రభుత్వాన్ని కూల్చడానికి సిఐఎ చేసిన అనేక రకాల ప్రయత్నాలు కూడా విఫలమయ్యాయి. 1980లలో "లిబియా సాల్వేషన్ ఫ్రంట్" 1990లలో "ఇస్లామిక్ లిబియన్ ఫైటింగ్ గ్రూప్" లాంటి పేరుతో దశలవారీగా సాయుధ తిరుగుబాట్లు చేయించినా ఫలితం దక్కలేదు. అవన్నీ ఓడిపోయాయి.

అమెరికా అధ్యక్షుడు రీగన్ కాలంలో సిఐఎ కాంట్రాస్ గ్రూప్ తయారుచేసి నికరాగువాలో శాండినిస్టా ప్రభుత్వాన్ని కూల్చిన విధంగానే లిబియాలో కూడా ఒక ప్రయత్నం చేసింది. లిబియా మాజీ సైనికాధికారి ఖలిఫా హెఫ్తిర్ నాయకత్వంలో 'లిబియన్ జాతీయ సైన్యం' ఏర్పరచి చేసిన ప్రయత్నం ఫలించలేదు. దీనికి సిఐఎ, ఫ్రాన్స్, సౌదీ అరేబియాలనుండి ఆర్థికంగా సహకారం, ఆయుధాలు అందాయి. సిఐఎ ప్రత్యేకించి శిక్షణ ఇచ్చి పథక రచన చేసింది. ఈ సిఐఎ ఏజెంట్ ఖలిఫా హెఫ్తిర్, 2011 మార్చిలో లిబియాకు వచ్చి ఇప్పుడు బెంఘాజీ కేంద్రంగా నడుస్తున్న సాయుధ ప్రతిఘటనలో చేరి నాయకత్వాన్ని అందిస్తున్నాడు. అరెస్టయ్యి సిఐఎ చెప్పుచేతుల్లోకి వెళ్ళిన ఆల్‌ఖాయిదా నాయకుడిని ఒకరిని కూడా లిబియా ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలో కోవర్ట్ ఆపరేషన్‌కు ఉపయోగించింది.

ఫిబ్రవరి చివరలో హింసాపూరితంగా మారిన తిరుగుబాటు వెనక అమెరికా, పశ్చిమ దేశాల ఇంటెలిజెన్స్ ఏజన్సీలు ఉన్నాయన్న వాస్తవాలు నిర్ధారణయ్యాయి. సిఐఎ, ఒబామా ప్రభుత్వాధికారులు తిరుగుబాటుదారులకు వారాల తరబడి తర్ఫీదునిచ్చారు. అమెరికా ప్రోద్బలంతో ఇజ్రాయిల్, సౌదీ అరేబియా లాంటి దేశాలు ఆయుధాలు అందించాయి. తిరుగుబాటు మొదలు కావడమే ఆరుగురు పోలీసులను ఉరితీయడంతో మొదలైన ఘర్షణలు హింసాత్మకంగా మారాయి. దీనిని సాకుగా చూపి అమెరికా మిత్ర రాజ్యాల సంకీర్ణ కూటమి (నాటో) బలగాలు యుఎన్ఓ ఆమోదముద్రతో దాడులు మొదలుపెట్టాయి.

లిబియాపై "ఆపరేషన్ ఒడిస్సే డాన్" యుద్ధాన్ని అమెరికా, మిత్ర దేశాలు ప్రారంభించాయి. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ దేశాలపై చేసిన యుద్ధంలాగ అంతర్జాతీయ సైనిక కూటమి దాడులు చేస్తున్నది. యుద్ధ విమానాలు, యుద్ధ నౌకలు, జలాంతర్గాముల దాడులతో లిబియా రాజధాని ట్రిపోలీతోపాటు అనేక నగరాలు దద్దరిల్లుతున్నాయి. అధ్యక్షుడు గడాఫీ కార్యాలయం బాగా దెబ్బతిన్నది. ఫ్రాన్స్ దళాలు బెంఘాజీపైనా, అమెరికా, బ్రిటన్ దళాలు ట్రిపోలీతోపాటు ఇతర పట్టణాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నాయి. పౌరులమీద, జనావాసాలమీద, ప్రభుత్వరంగ సంస్థల మీద బాంబింగ్ చేయడంతో పౌరులు అనేక మంది చనిపోయారు. ఆందోళనలు మొదలయ్యాక ఏడు వేల మందికి పైగా ప్రజలు చనిపోగా, అనేక వేలమంది గాయపడ్డారు. రెండు లక్షలకు పైగా ప్రజలు ఈజిప్ట్, టునీషియా సరిహద్దులు దాటి దేశం విడిచి వెళ్ళిపోతున్నారు.

అమెరికా యుద్ధ నౌకలతో అనేక మిలియన్ డాలర్ల విలువ చేసే 110 టామ్‌హక్ క్షిపణులను, టన్నుల బరువుండే 45 బాంబులను, అమెరికన్ బి–2 రకం బాంబర్లను మొదటి 24 గంటలలోనే ప్రయోగించింది. బ్రిటన్, ఫ్రెంచి బలగాలు వేసే క్షిపణులలో యురేనియం వినియోగిస్తున్నారు. ఇప్పటికే యుగోస్లోవియా, ఇరాక్‌లపై చేసిన దాడులలో వేసిన బాంబులు దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతున్నాయి. యూరోపియన్ పార్లమెంటు స్వయంగా యురేనియం వినియోగించిన బాంబులు వేయవద్దని ఆంక్షలు పెట్టినా నాటో బలగాలు లక్ష్యపెట్టలేదు.

తిరుగుబాటు మొదలుకాగానే ముఖ్యమైన సైనికాధికారులు, విదేశీ రాయబారులు రాజీనామా చేశారు. ఉద్యమంలో చేరిపోయారు. తూర్పున ఉన్న సంపదనంతా తమ చెప్పుచేతుల్లో ఉంచుకునే లక్ష్యంతో "తాత్కాలిక జాతీయ ప్రభుత్వాన్ని" ఏర్పరిచారు. దీనిని వెంటనే ఫ్రాన్స్ గుర్తించింది. మూడు రంగుల ఫ్రాన్స్ జండాతో పాటు ఇద్రిస్ రాజు కాలంనాటి పాత జెండాను కలిపి తిరుగుబాటు దారులు ఎగురవేశారు. ఫ్రాన్స్‌కు, తూర్పున జరుగుతున్న అలజడులకు ఎంత సన్నిహితమైన, లోతైన సంబంధం ఉందో తెలుస్తుంది. ఒకవైపున చర్చలు, రోడ్‌మ్యాప్ ప్రతిపాదనలతో ముందుకు వస్తూనే మరోవైపున తిరుగుబాట్లను, నాటో దాడులను పెంచుతున్నాయి. సామ్రాజ్యవాద దేశాలు గడాఫీని, సన్నిహిత సహచరులను అంతర్జాతీయ కోర్టు (హేగ్)లో విచారించాలని డిమాండ్ చేస్తున్నాయి.

మార్చి 31న అమెరికా డిఫెన్స్ సెక్రటరీ రాబర్ట్ గేట్స్ తాను అధికారంలో ఉన్నంతవరకు అమెరికా సైన్యాలను లిబియాకు పంపదని, తిరుగుబాటు దారులకు శిక్షణ, అన్ని రకాల సరఫరాలు ఇతర దేశాలు చూసుకుంటాయని చెప్పాడు. ప్రత్యక్షంగా కాకుండా కోవర్టు పద్ధతులు అనుసరిస్తున్నట్లు దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. లిబియాలోని టర్కిస్ ఫ్యాక్టరీ మేనేజర్ బిబిసితో మాట్లాడుతూ తిరుగుబాటు దారులు 70 మంది ఉద్యోగులను హతమార్చారన్నాడు. నాటో దాడులు అమాయక ప్రజలను కాపాడడం కాకుండా వారిపై బాంబింగ్ చేస్తూ సాయుధ తిరుగుబాటు దారులను కాపాడుతున్నాయనీ, ఇది యుఎన్ఓ తీర్మానానికి భిన్నం అని ప్రజలూ, మీడియా గగ్గోలు పెడుతున్నాయి. ప్రజలను రక్షించే పేరుతో మూడో ప్రపంచ దేశాల ప్రజల ప్రాణాలను హరించే విధంగా,

హక్కుగా నాటో బలగాల దాడులున్నాయి. వీటిని యుఎన్ సెక్రటరీ జనరల్ బాన్‌కీ మూన్ ఖండించకుండా "లిబియాలో తిరుగుబాటు సమస్య ఉన్నంతవరకు మిలటరీ క్యాంపెయిన్ వుంటుందని" ప్రకటించాడు. ఇది పూర్తిగా సామ్రాజ్యవాద అనుకూల వైఖరి తప్ప మరొకటి కాదు. నాటో దాడులను సమర్థించే జోర్డాన్ దేశపు విదేశాంగ మంత్రిని లిబియా సమస్యను మాట్లాడే యుఎన్ఓ ప్రతినిధిగా నియమించడంలో కూడా ఇదే వైఖరి ఉంది. ఒక్క ఖతార్ మాత్రం బహిరంగంగా లిబియాతో తలపడుతుంది. ఇది బెంఘాజిలోని తాత్కాలిక ప్రభుత్వాన్ని గుర్తించడంతో పాటు, ఫ్రాన్స్‌తో కలిసి వైమానిక దాడుల్లో పాల్గొంటున్నది.

బ్రిక్స్ దేశాలు (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా)దేశాలు నాటో దాడులను, పౌరుల హత్యలను ఖండిస్తున్నాయి. ఇరాక్, ఆఫ్ఘన్ అనుభవాలు నేర్పిన గుణపాఠాలుండగా మళ్ళీ లిబియాపై దాడులు చేయడం వెనుక అమెరికాకు "అరబ్ ప్రాంతంలో ప్రజాస్వామిక ఉద్యమాలను కాదనడం, వారి దీర్ఘకాలిక పథకాలకు (వ్యూహాత్మక) ఆటంకంగా వున్న ప్రభుత్వాలను కూల్చడం" అనే రెండు లక్ష్యాలున్నాయని ఇరాన్ అధ్యక్షుడు అన్నాడు.

కాస్ట్రో మాట్లాడుతూ "అమెరికా నాటోల మౌలిక లక్ష్యం లిబియా మాత్రమే కాదు. అరబ్ విప్లవోద్యమాలను నిరోధించడం, లిబియా చమురు, గ్యాస్, పొటాషియంలను తరలించుకు పోవడం. చమురుకు బదులుగా అన్ని రకాల ఆయుధాలను ఇచ్చిన దేశాలే ఇప్పుడు దాడులు చేస్తున్నాయి" అన్నాడు. అలాగే గడాఫీ ప్రజలతో కలిసి చివరివరకు పోరాడుతాడన్న విశ్వాసాన్ని ప్రకటించాడు.

ఆఫ్రికన్ యూనియన్ ఏకగ్రీవంగా నాటో దాడులను ఖండించింది. గతంలో కూడా నాటో దేశాలు ముందే వేసుకున్న పథకాలకనుగుణంగా ఈజిప్ట్, కాంగో, సోమాలియా, చాజ్, ఐవరీ కోస్ట్ లాంటి ఆఫ్రికన్ దేశాల మీద బాంబింగ్ చేసాయన్నారు. వారి లక్ష్యం ఒక్కటే, అది ఈ ఖండంలో సంపదను కంట్రోల్ చేయడం అన్నారు.

ప్రపంచం నేడు చమురు మీద ఆధారపడి ఉంది. అది క్రమంగా గ్యాస్ ఆధారిత వ్యవస్థగా మారబోతున్నది. పారిశ్రామిక దేశాల దృష్టి గ్యాస్ నిల్వలున్న ఆఫ్రికా దేశాలమీద ఉంది. ఇందుకనుగుణంగా ప్రపంచ రాజకీయ సమీకరణలు కూడా ఒక క్రమంలో మారుతాయి. ఇదే కాలంలో అరబ్ ప్రపంచంలో రాజకీయ సంక్షోభం రావడంతో సామ్రాజ్యవాద దేశాలు తమ వ్యూహాల కనుగుణంగా అక్కడి పరిస్థితులను మలుపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి.

ఫిబ్రవరి 26 యుఎన్ చేసిన తీర్మానం ప్రకారం గడాఫీకి/ లిబియాకు ఆయుధాల సరఫరాలపై సర్వత్రా నిషేధం అమలు చేస్తున్నారు. విదేశాలలోనున్న లిబియా డబ్బును స్తంభింప జేశారు. ఒక్క అమెరికాలోనే 30 బిలియన్ డాలర్లను స్తంభింపజేశారు. ఇప్పుడు ఆందోళన పథంలో ఉన్న ప్రజలకు ముందు నుయ్యి వెనుక గొయ్యి చందంగా మారింది. ఆ ఉద్యమాన్ని సామ్రాజ్యవాద దేశాలు హైజాక్ చేసి "చమురు వనరులు కొల్లగొట్టడం, ఆయుధ వ్యాపారం పెంచుకోవడం, మిలిటరీ ఆధిపత్యంలో అరబ్ దేశాలపై కంట్రోల్ కలిగి వుండడం" అనే తమ ప్రయోజనాల కోసం లిబియా ప్రజలతో, ప్రాణాలతో ఆటలాడుతున్నారు. రెండు వైపులా జరుగుతున్న దాడుల్లో పారుతున్న రక్తం లిబియా ప్రజలదే. నాటో దాడుల్లో ధ్వంసం అవుతున్నది లిబియా ఆస్తులే. ఒక వేళ లిబియా అధికారంలో మార్పు వస్తే మాత్రం మొత్తం లిబియాలోని ధనం, చమురు, గ్యాస్ పశ్చిమ దేశాల బ్యాంకులకు, రక్షణ కాంట్రాక్టర్లకే నేరుగా చేరుతుందనేది అందరికీ తెలిసిన నిజం.

'నోఫ్లై జోన్' విషయంలో ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో వీటో చేయగలిగి కూడా ఓటింగ్‌లో పాల్గొనకుండా తర్వాత నాటో దాడుల్ని ఖండిస్తున్న రష్యాకు దాని ప్రయోజనాలు దానికున్నాయి. రష్యాలో మెద్వదేవ్ అధికారంలోకి వచ్చిన నాటి నుండి మూడు సం॥లుగా యూరప్ సాంకేతిక సహకారంతో రష్యా అభివృద్ధి మీద దృష్టిపెట్టాడు. అరబ్ ప్రపంచంలో వచ్చిన సంక్షోభాన్ని ఉపయోగించుకుని అరబ్ దేశాలతో దౌత్య సంబంధాలను పెంచుకోవడంతో పాటు రష్యాలో లభ్యమవుతున్న చమురును పెరిగిన ధరల కనుగుణంగా యూరప్ దేశాలకు 40 శాతం ఎగుమతి చేస్తున్నారు. వారికి ఇది దీర్ఘకాలం కూడా కొనసాగవచ్చన్న ఆశ ఉంది. ఈ ప్రయోజనాలు నెరవేరి రష్యా, పరిస్థితి మెరుగైతే తర్వాత ఎన్నికల్లో సునాయాసంగా గెలవవచ్చు. ఉంటాడో, ఊడుతాడో తెలియని పరిస్థితుల్లో గడాఫీ కోసం రిస్క్ తీసుకోవడం ఎందుకు అని రష్యన్ పాలకులు ఆలోచిస్తున్నారు. ఈ రకంగా పరోక్షంగా సహకరించినందుకు వైట్‌హౌస్ మాస్కోను మెచ్చుకుంది కూడా.

నాటో భాగస్వామ్య దేశాల్లో కూడా పాలకులు లిబియాలో విజయం సాధిస్తే వచ్చే ఫలితాల మీద ఆశలు పెంచుకున్నారు. 1. 1956 సూయజ్ కాలువ సంక్షోభం నుండి అరబ్ దేశాలలో తరిగిపోయిన పట్టును సంపాదించుకోవడానికి ఈ సైనిక దాడి దారి సుగమం చేస్తుంది. 2. లిబియాలో త్వరిత విజయం ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లలో దెబ్బతిన్న ప్రతిష్టను తిరిగి పొందడానికి అవకాశం కల్పిస్తుంది. 3. ఈ విజయం తగ్గిపోయిన వ్యక్తిగత ప్రతిష్టను పెంచి తిరిగి ఒబామాను, సర్కోజీని దేశాధినేతలుగా నిలవడానికి తోడ్పడుతుంది. 4. అరబ్ ప్రపంచంలో ప్రజాస్వామిక ఉద్యమాలను

*(మిగతాది 22వ పేజీలో...)*

# దేశ ప్రజల ముందు అద్భుత నమూనాగా నిలిచిన

దండకారణ్య విప్లవోద్యమానికి 30 యేళ్లు నిండిన చారిత్రక సందర్భం ఇది. భారత విప్లవోద్యమ చరిత్రలో ఇదొక విశేష సందర్భం కూడా. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 10 నుండి 28 వరకూ దండకారణ్య వ్యాప్తంగా వార్షికోత్సవాలు జరిగాయి. బీహార్–ఝార్ఖండ్ ప్రాంతం వలెనే నేడు దండకారణ్య ప్రాంతం భారత పీడిత ప్రజలకు ఆశా కిరణంగా వుంది. మావోయిస్టు పార్టీ ఆధ్వర్యంలోని ఇతర పోరాట ప్రాంతాలకూ, గెరిల్లా జోన్ ప్రాంతాలకు ఒక అద్భుత నమూనాగా, ఉత్తేజకర ప్రేరణగా వుంది.

ఈ ఉద్యమాన్ని రూపుమాపడానికి ప్రారంభం నుంచి పాలక వర్గాలు పాల్పడుతున్న కుట్రలనూ, ప్రయోగిస్తున్న నిర్బంధాన్నీ, మరీ ముఖ్యంగా ఇటీవలి కాలంలో తలపెట్టిన యుద్ధాన్ని గెలిచేస్తూ ముప్పై వసంతాలను పూర్తి చేసుకొని, నవ యువ్వనాన్ని సంతరించుకుని, అప్రతిహతంగా పురోగమిస్తున్న దండకారణ్య ఉద్యమానికి 'క్రాంతి' జేజేలు చెబుతోంది. ఈ ఉద్యమ పురోగమనంలో భాగంగా అసువులు బాసిన అమరవీరులందరికీ వినమ్రంగా నివాళు లర్పిస్తోంది. ఎన్నో కష్ట నష్టాలను ఎదుర్కుంటూ, కఠిన సమయాలను అధిగమిస్తూ, ఉద్యమ పురోగమనంలో కీలక పాత్రను పోషిస్తున్న అన్ని శ్రేణుల నాయకత్వ కమిటీలకూ, పిఎల్‌జిఎకూ, ఇతర విభాగాలకూ, జనతన సర్కార్‌లకూ, ప్రజా సంఘాలకూ, విప్లవ ప్రజానీకానికీ విప్లవాభినందనలు తెలియజేస్తోంది.

ముప్పై యేళ్ల ఈ చారిత్రక సందర్భంలో నిలబడి దండకారణ్య ఉద్యమ పయనాన్నీ, సాధించిన విజయాలనూ, అందించిన అనుభవాలనూ, భారత విప్లవోద్యమానికి అది చేసిన చేర్పులను ఒక్కసారి తడుముకుందాం.

నక్సల్బరీ, శ్రీకాకుళాల ఓటముల నుండి గుణపాఠాలను తీసుకున్నందున జగిత్యాల జైత్రయాత్ర ఓటమికి గురికాకుండా పురోగమించింది. దాన్ని కాపాడుకోవడం, నలుదిశలా విస్తరింపజేయడం అనే దీర్ఘకాలిక లక్ష్యంలో భాగంగా నాటి సి.పి.ఐ. (ఎం.ఎల్.) (పీపుల్స్‌వార్) 1980లో దండకారణ్యంలో అడుగుపెట్టింది. ఉత్తర తెలంగాణ ప్రాంతం నుంచి 35 మంది గెరిల్లాలు ఏడు దళాలుగా రాష్ట్ర సరిహద్దులను దాటుకొని వెళ్లి ఈ ప్రాంతంలోని కోయ, దొర్ల, హల్బి, బతరా, ప్రధాన్, మన్నె, పరజా, కుయి, కొండరెడ్లు, కొలాం తదితర ఆదివాసీ ప్రజానీకాన్ని విప్లవోన్ముఖులను చేయడం ప్రారంభించారు. నాడు దండకారణ్యంగా నిర్దేశించుకున్న ప్రాంతంలో నేటి ఉత్తర తెలంగాణలో భాగంగా వున్న ఆదిలాబాద్, ఎ.ఒ.బి.లో భాగంగా వున్న ఈస్ట్ డివిజన్‌లు కూడా వుండేవి. 1995లో జరిగిన నిర్మాణ మార్పుల కారణంగా ఆదిలాబాద్, ఈస్ట్ డివిజన్‌లు విడిపోయాయి. ప్రస్తుతం మహారాష్ట్రలోని గడ్చిరోలి, చంద్రపూర్, గోందియా జిల్లాలకూ, ఛత్తీస్‌గఢ్‌లోని అవిభాజ్య బస్తర్‌కు చెందిన అయిదు జిల్లాలతో పాటు రాజ్‌నందగాం, దుర్గ్, ధమ్తరీ, రాయపూర్, మహాసముంద్ వరకూ విప్లవ కార్యకలాపాలు విస్తరించాయి, విస్తరిస్తున్నాయి. ప్రస్తుత దండకారణ్య వైశాల్యం 55 వేల చదరపు కిలోమీటర్లకు పైగా వుంటుంది.

విప్లవోద్యమ కృషి ప్రారంభం అయిన అనతి కాలంలోనే ఈ ప్రాంతంలోని ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో వేగంగా మార్పులు చోటుచేసుకోవడం మొదలైంది. మొదటగా ఇక్కడి భూ సంబంధాల్లో మార్పులు తీసుకురావడానికి విప్లవోద్యమం కృషి ప్రారంభించింది. విప్లవోద్యమం ఇక్కడ అడుగుపెట్టే నాటికి ఈ అడవితల్లి బిడ్డలు అడవిపై అన్ని హక్కులు కోల్పోయి వున్న పరిస్థితి. ఉన్న సాగుభూములు ఆదివాసేతర, ఆదివాసీ భూస్వాములూ, తెగ పెద్దలూ, పెత్తందారుల పరం కాగా కొత్తగా సాగు కోసం అడవిని నరికితే, అటవీ అధికారుల చేత కేసులూ, శిక్షలూ, దౌర్జన్యాలూ ఎదుర్కోవలిసిన పరిస్థితి. అందుకే మొదట దున్నేవారికే భూమి నినాదంతో ఆదివాసీ రైతాంగాన్ని విప్లవోద్యమం సంఘటితం చేసింది. రెండు దశాబ్దాల కాలం తీవ్రంగా జరిగిన భూ పోరాటంలో దాదాపు అయిదు వేల గ్రామాలలో గల ఒక లక్షకు పైగా ఆదివాసీ కుటుంబాలు మూడు లక్షల ఎకరాలకు పైగా భూమిని నూతనంగా సాగులోకి తెచ్చుకొని యాజమాన్యపు హక్కులను అనుభవిస్తున్నాయి. ఇంకా ఆదివాసీ పెత్తందారులూ, భూస్వాముల నుండి వందలాది ఎకరాల భూములను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం దండకారణ్య పోరాట ప్రాంతంలో భూమిలేని వారు ఎవరూ లేరు. అటవీ అధికారులతో, భూస్వాములతో, పెత్తందారులతో తీవ్ర పోరాటం ఫలితంగానే ఇది సాధ్యమైంది.

భూ పోరాటాలతో పాటు తునికాకు, వెదురు కూలీ పోరాటాలు కూడా ఇక్కడి ప్రజానీకాన్ని సంఘటితం చేయడంలోనూ, ప్రజల ఆర్థిక స్థితిని మెరుగుపరచడంలోనూ ఎంతో ప్రాముఖ్యతను కల్గినవి. ఆదివాసీల శ్రమను చౌకగా పొంది కోట్లను దండుకుంటున్న పెట్టుబడిదారుల, కాంట్రాక్టర్ల దోపిడీకి విప్లవోద్యమం అడ్డుకట్ట వేసింది. పార్టీ నాయకత్వంలో, ప్రజలు కాంట్రాక్టర్ల మెడలు వంచి, కూలీ రేట్లను పెంచుకున్నారు. ప్రస్తుతం దేశంలో ఎక్కడా లేనంత

# ముప్పై వసంతాల దండకారణ్య ఉద్యమానికి జేజేలు!

అధికంగా దండకారణ్య ప్రజలు తునికాకు, వెదురు కూలీ రేట్లను సాధించుకోగల్గారంటే అది వారి సంఘటిత శక్తి ఫలితమే. ఇంకా మరెన్నో అటవీ ఉత్పత్తుల ధరలను కూడా తమ సంఘటిత పోరాటం ద్వారా పెంచుకున్నారు.

ఆర్థిక రంగంలో ఉత్పత్తి సంబంధాల్లో మార్పును తెచ్చిన ఈ పోరాటం రాజకీయ రంగంలోనూ భూస్వామ్య, తెగ ఆధిపత్యంతో తలపడింది. ప్రభుత్వ, ఫారెస్టు అధికారులతోనూ తలపడింది. భూమిపై హక్కు రాజ్యాధికారంతో ముడిపడి వుందని ప్రజలు త్వరగానే గుర్తించగల్గారు. 'దున్నేవారికే భూమి' నినాదం 'గ్రామ రాజ్య కమిటీలకే సర్వాధికారాలు' అనే నినాదంగా అభివృద్ధి చెందింది.

దండకారణ్య ఉద్యమ అభివృద్ధిని 1980-95ల మధ్య కాలాన్ని మొదటి దశగా, తర్వాతి కాలాన్ని రెండవ దశగా చెప్పుకోవాలి. మొదటి దశలో విస్తృతంగా ప్రజలు సంఘాల్లోకి, పోరాటాల్లోకి సంఘటితం అయ్యారు. ప్రజలను ఇలా సంఘటితం చేయడంలో ప్రజా సంఘాలు చురుకైన పాత్ర వహించాయి. మొదట దండకారణ్య ఆదివాసీ రైతుకూలీ సంఘంలో స్త్రీలూ, పురుషులూ సంఘటితం అయ్యారు. ఆ తర్వాత మహిళల కోసం ప్రత్యేకంగా క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘం ఏర్పడింది. మొదటి దశలో ఈ రెండు సంఘాలే ప్రధాన పాత్ర వహించినప్పటికీ, విప్లవోద్యమ రెండో దశలో దాదాపు పదేళ్ల క్రితం ఏర్పడిన చేతనా నాట్య మంచ్ కూడా ప్రస్తుతం చురుకైన పాత్ర వహిస్తోంది. పార్టీకీ, ప్రజలకూ నడుమ వారధిగా పని చేసే ప్రజాసంఘాలు ప్రజలను సంఘటితం చేస్తూ, పార్టీలోకీ, ప్రజా సేనలోకి భర్తీ చేయడంలో విశేష కృషి చేస్తున్నాయి. ప్రస్తుతం లక్షకు పైగా సభ్యత్వంతో క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘం దేశంలోని పోరాడే మహిళా సంఘాలన్నింటిలోకీ అగ్ర స్థానంలో వుండడం విప్లవోద్యమం సగర్వంగా చెప్పుకోవాల్సిన విషయం.

ఇక్కడ 1996లో గ్రామ రాజ్య కమిటీలు ఉనికిలోకి వచ్చాయి. 2001లో జరిగిన పార్టీ తొమ్మిదో కాంగ్రెస్ ఇచ్చిన అవగాహన ప్రకారం, నాటి నుండీ వీటిని విప్లవ ప్రజా కమిటీలుగా, స్థానిక భాషలో జనతన సర్కార్లుగా వ్యవహరిస్తున్నారు. గెరిల్లా జోన్‌గా ఎదిగిన దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతంగా అభివృద్ధి చేసే లక్ష్యంలో భాగంగా మొదటగా గెరిల్లా బేస్‌లను నిర్మించడం ప్రారంభమైంది. ప్రస్తుతం ఒక్కో గెరిల్లా బేస్‌లో 20-30 గ్రామ స్థాయి జనతన సర్కార్లు ఏర్పడ్డాయి. గ్రామస్థాయిలో ఏర్పడిన జనతన సర్కార్ల సంఖ్య క్రమంగా పెరుగుతూ ఏరియా స్థాయి జనతన సర్కార్లు ఏర్పడ్డాయి. ఏరియా స్థాయి జనతన సర్కార్ల సంఖ్య పెరుగుతూ కొన్ని చోట్ల డివిజన్ స్థాయి జనతన సర్కార్లు సైతం ఏర్పడ్డాయి. ప్రస్తుతం జోన్ స్థాయి జనతన సర్కార్‌ను ఏర్పచడం కొరకు సన్నాహకాలు ప్రారంభమయ్యాయి. మొత్తంగా దండకారణ్యంలోని రెండు వేల గ్రామాల్లో జనతన సర్కార్లు ఏర్పడ్డాయి.

ప్రస్తుతం బలమైన పోరాట ప్రాంతాల్లో మినహా దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యం పేరిట బూటకపు ప్రజాస్వామ్యమే అమలులో వుంది. ఈ 'ప్రజాస్వామ్య' వ్యవస్థకు అయిదేళ్లకు ఒకసారి జరిగే ఎన్నికల తంతును ఆయువు పట్టుగా పాలకవర్గాలు ప్రచారం చేస్తాయి. ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలకు ఎన్నికలు అద్దం పడతాయని ప్రచారం చేస్తారు. కానీ ఈ ఎన్నికలు ప్రజల ఆకాంక్షలను ఎంత మాత్రం ప్రతిఫలించవనీ, ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా బూటకపు ప్రజాస్వామ్యాన్ని నిలిపి వుంచడానికే దోహదం చేస్తాయని గుర్తిస్తున్న దండకారణ్య ప్రజలు ఎన్నికలను బహిష్కరిస్తున్నారు. దానికి ప్రత్యామ్నాయంగా ప్రతి మూడేళ్లకు ఒకసారి జనతన సర్కార్లను స్వేచ్ఛగా ఎన్నుకుంటూ తమ రాజకీయ స్వాతంత్ర్యాన్ని సాధించుకుంటున్నారు.

ఇన్నాళ్లూ దళారీ ప్రభుత్వాలు పట్టించుకోని ఎన్నో సమస్యలను బీజప్రాయంలో వున్న ఈ జనతన సర్కార్లు పట్టించుకుంటున్నాయి. ముఖ్యంగా విప్లవ భూసంస్కరణలను అమలు చేస్తూ ప్రతి కుటుంబానికీ భూమి వుండేలా చర్యలు తీసుకుంటున్నాయి. అదే విధంగా ఉత్పత్తిని పెంచి ప్రజల ఆర్థిక స్థితిని మెరుగుపరిచే లక్ష్యంతో వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు పూనుకున్నాయి. సాగునీటి వ్యవస్థను మెరుగుపరుస్తున్నాయి. సహకార పద్ధతి ప్రవేశ పెట్టాయి. చేపల పెంపకం, పండ్ల తోటల, కూరగాయల పెంపకం తదితరాలను ప్రోత్సహిస్తున్నాయి. ఈ సంవత్సరం పెద్ద ఎత్తున భూముల చదును కార్యక్రమాన్ని చేపట్టాయి.

ఇన్నాళ్లూ దోపిడీ ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల విద్యా వైద్యాలకు దూరంగా వున్న ఇక్కడి ప్రజానీకానికి నూతనంగా ఏర్పడుతున్న జనతన సర్కార్లు వీటిని అందించడానికి విశేష కృషి చేస్తున్నాయి. దండకారణ్య వ్యాప్తంగా వంద పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యను అందిస్తున్నాయి. ఇప్పటిదాకా ఎక్కడా ఆదివాసీలకు మాతృ భాషలో విద్యాబోధన జరగడం లేదు. కానీ జనతన సర్కార్లు మాత్రం స్థానిక గోండి (కోయ) భాషలో పాఠ్య పుస్తకాలు తయారు చేస్తూ, ఆదివాసీ

చిన్నారులకు మాతృ భాషలోనే విద్యాబోధన చేస్తూ శాస్త్రీయ విధానాన్ని అవలంబిస్తున్నాయి. వైద్యంలో శిక్షణను ఇప్పించి ప్రజావైద్యులను తయారు చేసి ప్రజలకు ఉచితంగా వైద్యాన్ని అందిసున్నాయి.

దోపిడీ ప్రభుత్వాలు న్యాయ వ్యవస్థను అన్యాయ వ్యవస్థగా మార్చి వేశాయి. అందుకే జనతన సర్కార్ల ఆధ్వర్యంలో ప్రజలు తమదైన న్యాయ వ్యవస్థను రూపొందించుకుంటూ తమ సమస్యలను తామే పరిష్కరించుకుంటున్నారు. ఈ మూడు దశాబ్దాల కాలంలో స్థానిక ప్రజలు తమ సమస్యల పరిష్కారానికై పోలీసు స్టేషన్లను కానీ కోర్టులను కానీ ఆశ్రయించినది లేదు.

అటవీ సంపదనూ, పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడంలో భాగంగా జనతన సర్కార్ల నేతృత్వంలో ఏర్పడుతున్న జంగల్ బచావో కమిటీలు అటవీ పరిరక్షణకు గట్టిగా పూనుకుంటున్నాయి.

ఈ ఆర్థిక, రాజకీయ పోరాటం అనివార్యంగా, అవసరంగా సాంస్కృతిక రంగంలో పోరాటానికీ, మార్పుకీ దారితీస్తుంది. నూతన ప్రజాస్వామికం దిశగా ఈ సమాజం ప్రయాణించాలంటే సాంస్కృతిక పోరాటం కూడా తప్పనిసరిగా చేసి తీరాల్సిందే. తెగ ఆధిపత్యాన్ని కూలగొట్టాలన్నా, ప్రజల ముఖ్యంగా మహిళల ఆర్థిక, రాజకీయ, సామాజిక భాగస్వామ్యాన్ని పెంచాలన్నా ఇక్కడి తెగ సాంప్రదాయాలతోనూ, లోతుగా వేళ్లూనుకున్న మూఢ నమ్మకాలతోనూ పోరాటం చేయాల్సి వస్తుంది.

ఆదివాసీలు వేట ప్రియులు. కనుక రోజుల తరబడి వేటలో గడిపేవారు. సాంప్రదాయకంగా వస్తున్న ఎన్నో పండగలను కూడా రోజుల తరబడి జరుపుకోవడం గతంలో వుండేది. ఇది ఉత్పత్తిని తీవ్రంగా ప్రభావితం చేసే అంశం కనుక విప్లవోద్యమం ఓపికగా కృషి చేస్తూ రోజుల తరబడి చేసే వేటనూ, పండగలనూ నిరుత్సాహపరుస్తున్నది. వాటి రోజులను కుదిస్తున్నది. ఇక్కడి స్థానిక సాంప్రదాయాలూ, పండగల స్థానాల్లో విప్లవదినాలూ, విప్లవ సాంప్రదాయాలు చోటు చేసుకుంటున్నాయి. భూంకాల్ దివస్, మార్చి 8, మేడే, జూలై 28, సెప్టెంబర్ 21, డిసెంబర్ 2 తదితర విప్లవ దినాలను ప్రజలంతా సమరోత్సాహంతో జరుపుకుంటున్నారు. సాంస్కృతిక రంగంలో చేస్తోన్న ఈ పోరాటం ఆర్థిక, రాజకీయ పోరాటాలను తిరిగి బలోపేతం చేస్తోంది. మొత్తంగా అన్ని రంగాల్లో జరుగుతున్న ఈ పోరాటం ఇక్కడి సామాజిక చిత్రాన్ని మార్చివేస్తోంది.

ఇక్కడి సామాజిక చిత్రంలో చోటు చేసుకున్న ముఖ్యమైన మార్పుల గురించి చెప్పుకునేప్పుడు సగర్వంగా చెప్పుకోవాల్సింది ఇక్కడి మహిళల స్థితిగతుల్లో చోటుచేసుకుంటున్న మార్పుల గురించి. మహిళలు పీడితుల్లో కెల్లా పీడితులుగా వున్న పరిస్థితి ప్రపంచమంతటా వున్నదే. ఆదివాసీ సమాజం ఇందుకేమీ మినహాయింపు కాదు. తెగ పితృస్వామ్యం కింద నలిగిపోతున్న మహిళలను విప్లవోద్యమం సంఘటితం చేయడం ప్రారంభించాక మహిళల స్థితిగతుల్లో గణనీయమైన మార్పు వచ్చింది. ముఖ్యంగా బలవంతపు పెళ్లిళ్ళు అంతరించిపోయాయి. నిన్నటి దాకా కుటుంబ పరిధికే పరిమితమైన ఆమెకు ఎటువంటి సామాజిక గుర్తింపు లేని పరిస్థితే. కానీ నేడు సామాజిక రంగంలో చురుకైన పాత్ర వహిస్తూ ఆమె ఇంటా బయటా తన ఉనికిని చాటుకుంటోంది. ఫలితంగా స్త్రీ పురుషుల మధ్య ప్రజాస్వామిక సంబంధాలు చోటు చేసుకుంటున్నాయి.

ముప్పయి యేళ్ల ఈ కృషి ఒక సరైన ప్రత్యామ్నాయ వ్యవస్థను దేశ ప్రజల ముందుంచింది. అంతేకాదు ఎంతో విధ్వంసాన్ని నివారించింది కూడా. విప్లవోద్యమ ప్రతిఘటన కారణంగా గత ముప్పయ్యేళ్లుగా ఈ ప్రాంతంలో ఏ భారీ ప్రాజెక్టు కూడా ప్రారంభం కాలేదు. టాటా, ఎస్సార్, జిందాల్, మిట్టల్, వేదాంత తదితర కార్పోరేట్ సంస్థల దోపిడీకి ఇక్కడ అడ్డుకట్ట పడింది. విప్లవోద్యమమే ఈ ప్రాంతంలో లేకుంటే ఈ పాటికి వివిధ భారీ ప్రాజెక్టుల పేరుతో ఇక్కడ ఎంత విధ్వంసం జరిగి వుండేదో. ప్రజా జీవితం ఎంతగా అల్లకల్లోలం అయివుండేదో.

దండకారణ్య విప్లవోద్యమం ఎన్నో ప్రశ్నలకూ, సందేహాలకూ సమాధానంగా కూడా నిలిచింది. 'పెట్టుబడిదారీ వ్యవస్థకు మరో ప్రత్యామ్నాయం లేదు', 'ప్రజలు సాయుధ పోరాటానికి సిద్ధంగా లేరు', 'మార్క్సిజానికి కాలం చెల్లింది' వంటి బూర్జువా మేధావుల, రివిజనిస్టుల నిర్ధారణల్లోని డొల్లతనాన్ని బహిర్గతం చేసింది. నూతన ఆర్థిక విధానాలను అమలు చేయడాన్నీ, సామ్రాజ్యవాదులకు సేవ చేయడాన్నీ అభివృద్ధిగా పాలక వర్గాలు చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని బట్టబయలు చేస్తూ నిజమైన అభివృద్ధి నమూనాను ప్రపంచం ముందుంచింది.

అయితే ఇదంతా పాలక వర్గాలకు మింగుడు పడనిది. ఎందుకంటే దండకారణ్య ఉద్యమం సాధిస్తోన్న ఈ అభివృద్ధిలో పాలకవర్గాలకు నెరవేరే ప్రయోజనాలు శూన్యం. మరింత స్పష్టంగా చెప్పాలంటే పాలకవర్గాల ప్రయోజనాలకు అడ్డుకట్ట వేయడం ద్వారా సాధిస్తోన్న అభివృద్ధి ఇది. అందుకే పాలకుల దృష్టిలో మావోయిస్టు పార్టీ దేశ అంతర్గత భద్రతకు పెను ప్రమాదంగా మారింది. వాస్తవానికి సామ్రాజ్యవాదులతో చేసుకున్న ఎన్నో ఎం.ఓ.యు.లు

అమలులోకి రాకుండా పేరుకుపోయి వుండడం పాలకులకు పెను ప్రమాదం అనడం సబబుగా వుంటుంది.

అందుకే విప్లవోద్యమ ప్రారంభ దినాల నుండీ నిరంతరాయంగా నిర్బంధాన్ని ప్రయోగిస్తూనే వుంది. ఈ నిర్బంధం సాధారణ ప్రజల నుండి విప్లవోద్యమ నాయకుల వరకు అందరి మీదా కొనసాగింది. సాధారణ ప్రజల మీద, ప్రజా సంఘాల కార్యకర్తల మీద కేసులు పెట్టడం, చిత్రహింసలకు గురిచేయడం, జైళ్లలో నిర్బంధించడం, కాల్చి చంపడం, దళాల మీద దాడులు చేయడం సర్వసాధారణమైంది. తమ అణచివేతకు సాధికారతను కల్పించుకోవడం కొరకు పాలకులు క్రూర చట్టాలను తయారు చేసుకున్నారు. ఎన్నో సైనిక అభియాన్లను చేపట్టారు. జనజాగరణ్, సల్వాజుడుం, గ్రీన్‌హంట్ వంటి కుఖ్యాతి గాంచిన అభియాన్లు జగమెరిగినవే. పలు రకాల సాయుధ బలగాలను తయారు చేసుకున్నారు. 2003లో మొదటిసారిగా అర్ధసైనిక బలగాలు దిగాయి. ప్రస్తుతం సైన్యమే దిగింది. ప్రజలపై యుద్ధం నడుస్తోంది.

అయినప్పటికీ ప్రజలు తాము పోరాడి సాధించుకున్న విజయాలను కోల్పోవాలనుకోవడం లేదు. అది తమ ఉనికినే కోల్పోవడం అవుతుందని వారికి స్పష్టంగానే తెల్సు. అందుకే తెగించి పోరాడుతున్నారు. ఆ పోరాటాన్ని మరింత బలోపేతం చేయడం కోసం పార్టీ, పి.ఎల్.జి.ఎ.లలోకి విస్తృతంగా భర్తీ అవుతున్నారు. ఫలితంగా వీరోచిత ప్రతిఘటనకు దండకారణ్యం ఒక వేదికగా మారింది. ముకురాం వంటి విజయాలు భారత విప్లవోద్యమ చరిత్రను సుసంపన్నం చేస్తున్నాయి. సాయుధ బలగాలే కాదు సాధారణ ప్రజలు – స్త్రీలూ, పురుషులూ, పిల్లలూ, వృద్ధులూ కూడా నిరాయుధంగా సైతం ప్రతిఘటిస్తూ ఈ ప్రజా యుద్ధానికి నూతన అధ్యాయాలను జోడిస్తున్నారు.

ఈ క్రమంలో ఎందరో ప్రజా వీరులు తమ నులివెచ్చని నెత్తుటిని ధారపోస్తూ ప్రజా యుద్ధ చరిత్రను త్యాగభరితం చేస్తున్నారు. పార్టీ నాయకులూ, కార్యకర్తలూ, ప్రజాసంఘాలకూ, జనతన సర్కార్లకు సంబంధించిన నాయకులూ, కార్యకర్తలూ, విప్లవ ప్రజలూ మొత్తంగా దాదాపు రెండు వేల మంది ఈ మూడు దశాబ్దాల కాలంలో ప్రాణ త్యాగం చేశారు. వేల సంఖ్యలో చిత్రహింసలనూ, జైలు శిక్షలనూ అనుభవించారు, అనుభవిస్తున్నారు.

అప్రతిహతంగా ముందుకు సాగుతున్న దండకారణ్య ఉద్యమాన్ని అణచివెయ్యడం పాలకులకు తక్షణావసరంగా ముందుకు వచ్చింది. ప్రస్తుతం ప్రపంచాన్ని కుదిపివేస్తున్న సంక్షోభం నుండి బయట పడ్డానికి ఇక్కడి వనరులను కొల్లగొట్టడం సామ్రాజ్యవాదులకు అవసరంగా మారింది. ఇక్కడ రూపొందుతున్న ప్రత్యామ్నాయ రాజ్యాధికార వ్యవస్థ కూడా దోపిడీ వ్యవస్థ ఉనికిని సవాల్ చేస్తోంది. అందుకే మావోయిస్టు పార్టీని నిర్మూలించడానికి సైన్యాన్ని కూడా దించుతోంది. ఈ ఫాసిస్టు దాడిని ఎదిరించి, ఓడించడం దండకారణ్య ప్రజల ముందున్న మొట్టమొదటి కర్తవ్యం. గత ముప్పయి ఏళ్లుగా సాధించిన విజయాల్ని నిలుపుకోవాలన్నా, వున్నత స్థాయి విజయాలు సాధించాలన్నా దండకారణ్య ప్రజలు మరింత సమైక్యంగా, సంఘటితంగా, దృఢంగా తమ ఆత్మరక్షణా యుద్ధాన్ని కొనసాగించాలి. ఈ చావుబతుకుల యుద్ధంలో సాధించే గెలుపు–ఓటములపై దండకారణ్య విప్లవోద్యమ భవిష్యత్తు, మొత్తంగా దండకారణ్య ప్రజల అస్తిత్వం ఆధారపడి వున్నాయి. దేశవ్యాప్తంగా పెంపొందే మావోయిస్టు ప్రజాయుద్ధం, ప్రజా వుద్యమాల పురోగమనంపై కూడా ఈ గెలుపు–ఓటముల ప్రభావం వుంటుంది. ఇందుకోసం విస్తృతమైన ప్రజల, ప్రజాస్వామికవాదుల, మేధావుల మద్దతును కూడగట్టి, వారిని క్రియాశీలకంగా ప్రజా యుద్ధంలో భాగస్వాములను చేయాలి.

ప్రజాస్వామిక వాదులూ, విద్యార్థులూ – యువజనులూ, మేధావులూ, రచయితలూ, కళాకారులూ తదితరులంతా ప్రజలపై తలపెట్టిన ఈ యుద్ధాన్ని అడ్డుకోవడం, ఇక్కడ నిర్మితమవుతున్న ప్రజా రాజ్యాధికారాన్ని కాపాడుకోవడం తమ బాధ్యతగా గుర్తించాలి. ఇది కేవలం మావోయిస్టు పార్టీ మీదనో, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల ప్రజల మీదనో చేస్తున్న యుద్ధం కాదు. దేశ స్వాతంత్ర్యానికీ, సార్వభౌమత్వానికీ, స్వావలంబనకూ, మొత్తంగా దేశ భవిష్యత్‌కు సంబంధించిన విషయం.

అందుకే ముప్పయి వసంతాలు నిండిన ఈ ఉద్యమాన్ని కాపాడుకుందాం, విముక్తి ప్రాంతంగా మలుచుకుందాం అనేది నేడు దేశవ్యాప్తంగా పీడిత ప్రజల నినాదం కావాలి!

**"పార్టీ కార్మిక వర్గపు పురోగామి దళం అంటే కార్మిక వర్గపు రాజకీయ నాయకురాలు, కార్మికవర్గపు సైన్యాధికారుల వర్గం (జనరల్ స్టాఫ్), అది కార్మికవర్గంలోని అవిభాజ్యమైన భాగం కూడా" -కామ్రేడ్ స్టాలిన్**

*(.....17వ పేజీ తరువాయి)*

అణచివేసి రాజులు, నియంతలతోనే తమ ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి తోడ్పడుతుంది. 5. నాలుగు దశాబ్దాలపాటు కంట్లో నలుసులుగా వేధిస్తున్న పెద్ద సమస్య 'అరబ్ జాతీయ వాదం – గడాఫీ సమస్య ' పరిష్కారం అవుతుంది.

నాటో దాడులకు బ్రిటన్ దేశంలో క్రమంగా వ్యతిరేకత పెరుగుతుంది. నాటో దాడులు అరబ్ ప్రపంచంలో ముఖ్యంగా లిబియా ప్రజలను ఐక్యం చేస్తున్నాయి. గడాఫీ "చివరి వరకు పోరాడుతాను, దీర్ఘకాల యుద్ధం చేస్తాను" అని ప్రకటించాడు. "మన లిబియాను రక్షించుకుందాం. మన చమురును మనం రక్షించుకుందాం" అని ప్రజలకు పిలుపునిచ్చాడు. ప్రజలతో ఐక్యం కాకుండా, నియంతృత్వ విధానాలను వదులుకోకుండా, దీర్ఘకాల ప్రతిఘటన చేయకుండా లిబియాను రక్షించుకోవడం, తనను తాను రక్షించుకోవడం సాధ్యం కాదన్న సత్యం గడాఫీకి తెలియాలి. లేకుంటే గడాఫీ పతనం, లిబియా ఓటమి రెండూ ప్రపంచ రాజకీయాలను తారుమారు చేస్తాయి. సామ్రాజ్యవాదులు మరింత రెచ్చిపోతారు. గత దశాబ్దంలో పశ్చిమాసియా లాగా ఈ దశాబ్దం సామ్రాజ్యవాద రాజకీయాలకు అరబ్ ప్రపంచం కేంద్రం అయింది.

లిబియా, గడాఫీలను లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న నాటో దాడులను, మితవాద కుట్రలను బలంగా ఎదుర్కొని ఓడించకపోతే సామ్రాజ్యవాదుల దూకుడును నిలువరించడం కష్టం. ఇప్పుడిది లిబియా సమస్య మాత్రమే కాదు. సామ్రాజ్యవాద వ్యతిరేక పీడిత దేశాలన్నిటి సమస్య. సామ్రాజ్యవాదాన్ని ముక్త కంఠంతో ఖండించడంతో పాటు నాటో దాడుల్ని తక్షణం నిలుపు చేసే లాగా ప్రయత్నించాలి. లిబియా సార్వభౌమాధికారాన్ని కాపాడాలి. పైకి భారత పాలక వర్గాలు నాటో దాడుల్లో పౌరులు చనిపోవడాన్ని ఖండించినప్పటికీ, నాటో దాడులకు పరోక్ష మద్దతు నివ్వడం కనబడుతుంది.

అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్‌లు ప్రధానంగా అరబ్ ప్రపంచాన్ని తమ చెప్పు చేతుల్లో ఉంచుకోవడానికి ఐక్యరాజ్యసమితిని కీలుబొమ్మగా వాడుకుంటూ, గల్ఫ్ సహకార సమితిని, అరబ్ లీగ్‌ను ముందుపెట్టి తమ దీర్ఘకాలిక వ్యూహాలను నెరవేర్చుకుంటున్నారు. లిబియాపై దాడులకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాపిత పోరాటాన్ని చేపట్టాలి.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం, నియంతృత్వ వ్యతిరేక పోరాటం రెండూ భిన్నమైనవి కాదు. నాటో దాడులను, గడాఫీ నియంతృత్వ పాలనను రెండింటిని ఓడించాలి. సామ్రాజ్యవాదుల చేతుల్లోకి వెళ్ళిపోకుండా లిబియా ప్రజలంతా ఐక్యంగా పోరాడాలి. దేశాన్ని రెండుగా చీల్చే సామ్రాజ్యవాద కుట్రలను ఓడించాలి. సామ్రాజ్యవాదాన్ని ఓడించాలంటే తూర్పు ప్రాంత ప్రజలు, పశ్చిమ ప్రాంత ప్రజలు ఐక్యమై అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్ సామ్రాజ్యవాద దేశాల కుట్ర పూరిత పథకాలను, నాటో దాడులను ఓడించాలి. వియత్నాం, ఇరాక్, ఆఫ్ఘన్ దేశాలలో సామ్రాజ్యవాదులను ఓడించిన విధంగా లిబియాలో ప్రజలు, అంతర్జాతీయ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అన్ని దేశాల ప్రజల మద్దతుతో సామ్రాజ్యవాదులను ఓడించాలి. దేశం లోపలి సమస్యను అంతర్గతంగా పరిష్కరించుకోవాలి. సామ్రాజ్యవాదులకు ఎటువంటి అవకాశం ఇవ్వకుండా సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవాలి.

దేశంలో అంతర్యుద్ధాన్ని ప్రోత్సహించిన సామ్రాజ్యవాదులు తమ దురాక్రమణ దాడులతో లిబియాను కబళించే పెద్ద ప్రమాదాన్ని లిబియా ప్రజలు గుర్తించాలి. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని ప్రధాన పోరాటంగా చేపట్టాలి.

పాలస్తీనాలోని గాజాస్ట్రిప్, వెస్ట్ బ్యాంకులతో సహా పశ్చిమాసియా దేశాల్లో, ఆఫ్రికన్ దేశాల్లో నాటో దాడులకు వ్యతిరేకంగా పోరాటాలు, నిరసనలు జరుగుతున్నాయి. ప్రపంచవ్యాపితంగా నో ఫ్లైజోన్‌కు, నాటో దాడులకు వ్యతిరేకత వచ్చినా గాని సామ్రాజ్యవాదులు దురాక్రమణ పూరిత దాడులను, లిబియాను చీల్చే కోవర్ట్ కుట్రలను మానుకోలేదు. లిబియా ప్రజలు వీరోచితంగా పోరాడి దేశంలో ఐక్యతను సాధించడానికి, సామ్రాజ్యవాదాన్ని ఓడించడానికి మన సంపూర్ణ మద్దతును ప్రకటిద్దాం.

**"జాతీయ విముక్తి పోరాటం విజయవంతంగా పరిపూర్తి కావడానికిగాను ఆవశ్యకమైన అంతర్గత పరిస్థితులు అనుమతించినపుడు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన ప్రజావిముక్తి సైన్యాలను ఏర్పాటు చేయడమనేది ఒక నిర్ణయాత్మకమైన షరతు." -కామ్రేడ్ మావో**

# దంతెవాడ జిల్లాలో మారణహోమం
# ప్రజలపై యుద్ధం రెండవదశకు ఆరంభం

2011 మార్చి 11 నుండి మోర్‌పల్లి, తిమ్మాపురం, తాడిమెట్ల, పుల్లాన్‌పల్లి గ్రామాలపై 350 మంది కోబ్రా, కోయకమాండో, ఎస్.పి.ఓ, ఎస్.టి.ఎఫ్, అర్ధసైనిక బలగాలు దాడులు చేశాయి. ఈ దాడుల్లో 300 ఇండ్లు దగ్ధం చేశారు. ముగ్గురు అమాయక ఆదివాసీ యువకులను దారుణంగా కత్తులతో పొడిచి తుపాకులతో కాల్చి చంపారు. మరో యిద్దరు గాయాలపాలయ్యారు. 25 మంది మహిళలను చిత్రహింసలు పెట్టి ముగ్గురు మహిళలపై అత్యాచారం జరిపారు. ఇద్దరు రైతులను అరెస్టు చేసి ఎక్కడ బంధించారో తెలపడం లేదు. ఈ దాడుల్లో కోట్లాది రూపాయల ఆస్తులు ధ్వంసం అయ్యాయి. దోపిడి పాలకవర్గాలు కుట్రతో పథకం ప్రకారం జరిపిన ఈ మారణహోమానికి సంబంధించిన వివరాల్లోకి వెళితే...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2004 నుండి మావోయిస్టు పార్టీని దేశ అంతరంగిక భద్రతకు ముప్పుగా చూపిస్తూ యుద్ధాన్ని ప్రకటించింది. ఇందులో భాగంగా 2005 నుండి ఛత్తీస్‌గఢ్‌లోని బి.జె.పి రమణ్‌సింగ్ ప్రభుత్వం సల్వాజుడుం క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. 1500 మందికి పైగా అమాయక ఆదివాసుల ప్రాణాలను బలి తీసుకుంది. 7 వేలకు పైగా ఇండ్లను ధ్వంసం/దగ్ధం చేయించింది. 50వేల మంది ఆదివాసులను రహత్ శిబిరాలనబడే కాన్సెంట్రేషన్ క్యాంపుల్లో బంధించింది. వీరంతా తమ ఆస్తులను కోల్పోయి నిర్వాసితులుగా ఈ సల్వాజుడుం క్యాంపుల్లో మగ్గుతున్నారు. సుప్రీం కోర్టు ఆదేశం మేరకు 2010 అక్టోబర్ 2న ప్రభుత్వం సల్వాజుడుంను రద్దు చేస్తున్నామని కుట్రు గ్రామంలో ప్రకటించింది. కాని, అదే బహిరంగ వేదికపై మహేంద్రకర్మ, చిన్న గోటా, మధుకర్‌రావు, సేఖా మాంజి, సోయం మూకా, పి. విజయ్‌ల నాయకత్వంలో దండకారణ్య శాంతి సంఘర్ష్ మోర్చా పేరుతో దండకారణ్య వ్యాప్తంగా మావోయిస్టులకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించారు. నాటి నుండి బయటికి శాంతి ప్రవచనాలు చేస్తూ కార్యాచరణలో విధ్వంసం, హత్యలు, మారణహోమాన్ని మరింత పెంచారు.

ఈ మారణహోమంలో భాగంగా 2010 అక్టోబరు 12న బీజాపూర్ సమీపంలోని గోర్నం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులను పట్టుకొని చంపారు. అక్టోబర్ 19న కొత్తపల్లి, 24న బుర్గిల్ గ్రామాలకు చెందిన యువకులను చంపారు. డిసెంబర్ మొదటి వారంలో దంతెవాడ జిల్లా జేగురుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మెట్టగూడెం గ్రామానికి చెందిన తొమ్మిదిమంది యువకులను చుట్టుముట్టి, కాల్చి చంపారు. 2011 జనవరి 17న బీజాపూర్ జిల్లా గురుగుట్ట(గుర్జుకుంట) గ్రామంలో పోలీసులను చూసి పారిపోతున్న ఇద్దరు యువకులను చంపి, మరో ఇద్దర్ని గాయపరిచారు. జనవరిలోనే దంతెవాడ జిల్లా కిరందూల్ పరిసర గ్రామం గుమియాపాల్‌లో ఇద్దరు యువకులను, సుక్మా, గాదెరాస్ పోలీసు స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఇద్దరు యువకులను పట్టుకొని కాల్చి చంపారు. సుక్మా కోళ్ళసంతలో కోయకమాండో కంపెనీ కమాండర్‌ను పి.ఎల్.జి.ఎ బలగాలు మట్టుబెట్టగా రెచ్చిపోయిన పోలీసులు సంతలోని ప్రజలపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఒక యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు వదలగా మరో యువతి తీవ్రగాయాల పాలై చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది.

సల్వాజుడుంను ఆపమని అంటున్న ప్రభుత్వం శాంతి యాత్ర పేరుతో దమనకాండను నరమేధాన్ని నిరాటంకంగా కొనసాగిస్తున్నదనటానికి పై ఉదాహరణలు ప్రబల నిదర్శనం.

ఇక గ్రీన్‌హంట్ ఆపరేషన్ రెండవ దశలో భాగంగా మార్చి 11 నుండి 16 వరకు జరిగిన ఘటనలు దండకారణ్య ప్రజలపై ఫాసిస్టు రమణ్‌సింగ్ ప్రభుత్వం సాగిస్తున్న దమనకాండకు పరాకాష్టగా చెప్పుకోవచ్చు. ఈ దాడుల కోసం మార్చి 10వ తేదీన దంతెవాడ, జగదల్‌పూర్‌ల నుండి డి.ఐ.జి లాంగ్‌కుమేర్, ఎస్.ఎస్.పి ఎస్.ఆర్. కల్లూరిల నాయకత్వంలో కోబ్రా బలగాలను, ఆయుధాలను హెలికాప్టర్ ద్వారా చింతల్‌నార్‌కు చేర్చారు. దోర్నపాల్ నుండి 500 మంది కోయకమాండోలు ఎస్.పి.ఓలు, సి.ఆర్.పి.ఎఫ్ బలగాలను కూడా తరలించారు. మరునాడు(11వ తేదీన) వేకువజామున ఈ బలగాలన్నీ చింతల్‌నార్ సమీపంలోని మోర్‌పల్లి గ్రామంపై దాడి చేసి విధ్వంసానికి పూనుకున్నారు. ఈ దాడిలో

33 ఇండ్లు, నోటిదగ్గరకొచ్చిన లక్షలాది రూపాయల ధాన్యం, బట్టలు, వంటపాత్రలు, నువ్వులు తదితర సామాగ్రిని తగులబెట్టారు. వీరి రాకను ముందుగానే గమనించిన ప్రజలు తప్పుకొని అడవిలో తల దాచుకున్నారు. దొరికిన ముగ్గురు మహిళలను పట్టుకొని చిత్రహింసలు పెట్టి, ఇద్దరిపై అత్యాచారం చేశారు. మాడివి దేవె అనే యువతిని, ఆమె తండ్రిని పట్టుకొని చింతల్‌నార్ స్టేషన్‌కు తరలించి ఆ తర్వాత ఆమెపైన కూడా అత్యాచారం చేశారు. గ్రామంపై దాడిచేసి వెళుతూ చెట్టు మీద తునికిపండ్లు కోసుకుంటున్న మాడివి సూలా అనే యువకుడిపై కాల్పులు జరుపగా ఆ యువకుడు చెట్టుపైనే ప్రాణాలు విడిచాడు.

ఇవే బలగాలు మార్చి 13న పుల్లాన్‌పల్లి గ్రామంపై దాడి చేశాయి. పోలీసుల రాకను ముందుగా గమనించిన ప్రజలు గ్రామం వదిలి పారిపోతుండగా పోలీసులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఒక యువతి, మరో యువకుడు తీవ్రగాయాల పాలై అడవిలోకి తప్పుకున్నారు. బాడిసె భీమా, మాను యాదవ్ ఇద్దరు రైతులను వెంటబడి తరిమి పట్టుకున్నారు. గ్రామంలో చొరబడి పెద్దమొత్తంలో డబ్బు, బట్టలు, నగలు, ఇతర సామాగ్రి దోచుకున్నారు.

ఈ కిరాయి మూకలు పుల్లాన్‌పల్లిపై దాడిచేసి అదే రోజు సాయంత్రం 3 గంటలకు తిమ్మాపురం గ్రామంపై దండెత్తాయి. పుల్లాన్‌పల్లిపై దాడిచేస్తుండగా కాల్పుల శబ్దాలు విన్న ఈ గ్రామ ప్రజలు గ్రామం ఖాళీ చేసి అడవిలోకి తప్పుకున్నారు. కిరాయి మూకలు ఇదే అదనుగా గ్రామంలో చొరబడి యథేచ్ఛగా దోపిడి సాగించాయి. ఆ రాత్రి అక్కడే మకాం వేసి మరుసటి రోజు ఉదయం 10 గంటల వరకు విధ్వంసకాండ సాగించారు. 56 ఇండ్లను తగులబెట్టి పదులకొద్దీ మేకలు, పందులు, కోళ్ళు, బాతులు చంపి 5 క్వింటాళ్ళ మాంసం మూటగట్టుకున్నారు. ఆ తర్వాత మరో గ్రామంపై దాడికి వెళ్తుండగా మార్గమధ్యంలో పి.ఎల్.జి.ఎ బలగాలు అడ్డు పడటంతో భీకర పోరాటం జరిగింది. పి.ఎల్.జి.ఎ కాల్పుల్లో క్రూరులైన ముగ్గురు కోయ కమాండోలు చావగా మరో 9 మంది తీవ్ర గాయాల పాలయ్యారు. శతృవుకు చెందిన 3 ఎస్.ఎల్.ఆర్ తుపాకులను పి.ఎల్.జి.ఎ స్వాధీనం చేసుకుంది. దోచుకున్న ప్రజల ఆస్తులను వదిలి శతృవు పారిపోగా వాటన్నింటిని పి.ఎల్.జి.ఎ స్వాధీనపర్చుకొని తిమ్మాపురం గ్రామస్తులకు అందించింది. పి.ఎల్.జి.ఎ బలగాలను ఎదుర్కోలేని కిరాయి మూకలు పారిపోయి గ్రామస్తులు ఖాళీ చేసిన తిమ్మాపురం ఇండ్లలో తలదాచుకున్నారు. 13వ తేదీన పుల్లాన్‌పల్లిలో పట్టుకొని అదుపులో వుంచుకున్న ఇద్దరు రైతులను అత్యంత కౄరంగా కత్తులు, గొడ్డళ్ళతో నరికి చంపారు. ఇందులో బాడిసె భీమా మృత దేహాన్ని తిమ్మాపురం గ్రామంలోనే వదిలేసి మానుయాదవ్‌ను చింతల్‌నార్ తరలించి, 15వ తేదీన హెలికాప్టర్‌లో దంతెవాడకు తరలించి ఎన్‌కౌంటర్ కట్టుకథ అల్లారు. ఎన్‌కౌంటర్‌లో 25 నుండి 30 మంది దాకా నక్సలైట్లు చనిపోయారని, ఒక నక్సలైట్ శవాన్ని స్వాధీనం చేసుకున్నామని, మిగతా శవాలను మిలీషియా సహాయంతో నక్సలైట్లు మోసుకుపోయారని అబద్ధపు ప్రచారం సాగించారు.

ఈ కిరాయి మూకలు మరలా 16వ తేదీ ఉదయం 6 గంటలకు తాడిమెట్ల గ్రామంపై దాడిచేశాయి. 207 ఇండ్లలోని సామాగ్రి, వందలాది క్వింటాళ్ళ ధాన్యం, బట్టలతో సహా లక్షలాది రూపాయల ప్రజల ఆస్తులను తగులబెట్టారు. గ్రామాన్ని సర్వనాశనం చేసి బూడిద కుప్పగా మార్చారు. గ్రామంపై హఠాత్తుగా దాడిచేసి 22 మంది మహిళలను, ఐదుగురు పురుషులను పట్టుకొన్నారు. వీరిని తుపాకీ మడమలతో, కత్తులతో గాయపరిచి తీవ్రమైన చిత్రహింసలు పెట్టారు. ఇద్దరు మహిళలపై అత్యాచారం చేశారు. ఇద్దరు రైతులను జైలుకు పంపారు.

మార్చి 11వ తేదీ నుండి 16 వరకు పథకం ప్రకారం జరిపిన ఈ కౄర విధ్వంసకాండలో మొత్తం 300 ఇండ్లు, వందలాది క్వింటాళ్ళ ధాన్యం, బట్టలు, కోట్లాది రూపాయల ప్రజల ఆస్తులను ప్రభుత్వ కిరాయి బలగాలు ధ్వంసం చేశాయి. లక్షలాది రూపాయల డబ్బు, విలువైన ప్రజల ఆస్తులను దోచుకున్నారు. ఈ బందిపోట్ల దాడికి, మారణహోమానికి చింతల్‌నార్ పరిసర గ్రామాల ప్రజలు భీతిల్లిపోయారు. 15 రోజుల వరకు అడవుల్లోనే తలదాచుకున్నారు. ప్రభుత్వం ఇదే లక్ష్యంతో దుర్మార్గపు దాడిని జరిపించింది. సర్వం కోల్పోయి దిక్కులేని పక్షుల్లా నిర్వాసితులైన గ్రామస్తులకు 25వ తేదీ వరకు ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయం అందలేదు. జనతన సర్కార్లు, ప్రజా వైద్యులు తక్షణమే ప్రజలను ఆదుకొని వైద్య సేవలు అందించి నైతికంగా, ఆర్థికంగా మద్దతునిచ్చారు. ఇండ్లు, ఆహార ధాన్యాలు, బట్టలు తదితర అత్యవసరాలను జనతన సర్కార్లు సమకూర్చాయి.

ఒక పథకం ప్రకారం జరిపిన మారణహోమం, విధ్వంసకాండల వెనుక ప్రభుత్వానికి నిర్దిష్టమైన లక్ష్యం వుంది. 1. గ్రీన్‌హంట్ ఆపరేషన్ రెండవదశను పెద్ద దాడితో ప్రారంభించడం 2. ఇదే ప్రాంతంలో 2010 మార్చిలో పి.ఎల్.జి.ఎ చేతిలో 76 మంది సి.ఆర్.పి.ఎఫ్, కోబ్రా బలగాలు హతమవ్వడంతో తన కిరాయి బలగాలు కోల్పోయిన ఆత్మస్థైర్యాన్ని ప్రతీకారం ద్వారా తిరిగి నిలబెట్టటం. 3. ఈ ప్రాంతాన్ని మావోయిస్టుల పట్టు నుండి చేజిక్కించుకోవడం, పి.ఎల్.జి.ఎ బలగాలపై దాడి చేయటం. ఈ లక్ష్యాలతోనే ఫాసిస్టు బి.జె.పి రమణ్‌సింగ్ ప్రభుత్వం ఈ హీనమైన దాడులకు పూనుకుంది. అందుకే

ఆదివాసులు అనే కనీస విచక్షణను కూడా వదిలేసి ఇక్కడి సామాన్య ప్రజలను కూడా సాయుధ మావోయిస్టులుగా ప్రచారం చేయటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించుకున్నాయి.

ఈ పథకంలో భాగంగానే జరిగిన మారణహోమం గురించి బయటి ప్రపంచానికి తెలియకుండా ప్రభుత్వం అనేక జాగ్రత్తలు తీసుకుంది. ప్రసారమాధ్యమాలను ఆ ప్రాంతంలోకి రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేసింది. జరిగిన దారుణాల గురించి తెలుసుకోవడానికి వచ్చిన స్వామి అగ్నివేశ్‌పై ముష్కర కోయకమాండోలతో హేయమైన దాడి చేయించింది. కాని పౌరహక్కుల సంఘాల, ప్రజాస్వామికవాదుల, ప్రసార మాధ్యమాల తీవ్ర ప్రయత్నాలతో నిజాలు సభ్యసమాజానికి బహిర్గతమయ్యాయి. దీనితో దండకారణ్యంలో ప్రభుత్వం ఆదివాసులపై జరుపుతున్న దుర్మార్గాల పట్ల దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. బాధితులకు వెంటనే సహాయం అందించాలనే సుప్రీంకోర్టు ఆదేశం మేరకు కలెక్టర్, సుప్రీంకోర్టు నియమించిన కమీషనర్లు నిత్యావసర సరుకులు తీసుకొని వెళుతుండగా సల్వాజుడుం గూండాలు అడ్డుకొని వెనక్కు తిప్పి పంపారు. ఈ దాడులపై ప్రతిపక్ష కాంగ్రెస్ ఎం.ఎల్యేలు శాసనసభలో నిరసన తెలిపారు. బాధితులకు సహాయం అందించాలని నిత్యావసర సరుకులతో మాజీ హోంమంత్రి నందకుమార్ పాటిల్ నాయకత్వంలో మార్చి 29న పదిమంది కాంగ్రెస్ ఎం.ఎల్యేలు బయలుదేరారు. వీరిని సల్వాజుడుం గూండాలు అడ్డుకొని తిప్పి పంపారు. ఈ టీంకు రక్షణగా ఏకంగా బస్తర్ ఐ.జి లాంగ్‌కుమేర్ వుండి కూడా ఏమీ చేయలేనని చేతులెత్తేయడం విచిత్రం. కాంగ్రెస్ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ఫాసిస్టు రమణ్‌సింగ్ ప్రభుత్వం కలిసి ఈ దమనకాండ సాగిస్తున్నప్పటికీ రాజకీయ ప్రయోజనాల కొరకు కాంగ్రెస్ ఎం.ఎల్యేలు బాధితులను కలిసే ప్రయత్నం చేశారు. దీన్ని కూడా సల్వాజుడుం మూకలు అడ్డుకున్నాయి. గతంలో కూడా దండకారణ్యంలో ఆదివాసులపై జరుగుతున్న దమనకాండను ఆదివాసుల ఇక్కట్లను గురించి తెలుసుకోవడానికి ప్రయత్నించిన మేధాపాట్కర్, నందినీ సుందర్, ఉజ్జల్‌కుమార్, సందీప్‌పాండే, ప్రొ॥ యశ్‌పాల్‌లను సల్వాజుడుం గూండాలు అడ్డుకొని నానా ఇబ్బందుల పాల్జేశారు.

ఫాసిస్టు రమణ్‌సింగ్ బి.జె.పి ప్రభుత్వం నిజాలను బయటికి రాకుండా అడ్డుకోవాలని ఎంత ప్రయత్నించినా వాస్తవాలు ప్రపంచానికి వెల్లడయ్యాయి. మార్చి 11, 16 తేదీల మధ్య జరిగిన మారణహోమానికి ముందు కూడా ఇటువంటి ఘోరకృత్యాలు అనేకం జరిగాయి. 2005లో సల్వాజుడుం ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటి వరకు ఫాసిస్టు ప్రభుత్వం ఆదివాసీ రైతాంగం పై హత్యలు, మహిళలపై అత్యాచారాలు గావించింది. వందలాది గ్రామాల్లో 7వేలకు పైగా ఇండ్లను తగులబెట్టారు. వందలకోట్ల ఆస్తులను ధ్వంసం/దగ్ధం చేశారు. ఈ పరంపరలో జరిగినవే 11–16 తేదీల మధ్య చేసిన దాడులు. రమణ్‌సింగ్ ప్రభుత్వం ఒకవైపు సల్వాజుడుం ఆపామని అంటూనే మరింత క్రూరమైన దాడులు సాగిస్తున్నది. సల్వాజుడుం చట్టవిరుద్ధమని వెంటనే ఆపివేయాలని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ మళ్ళీ 5వేల మందిని ఎస్.పి.ఓలుగా భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఎవరెన్ని చెప్పినా ఎన్ని నిరసనలు ఎదురైనా దండకారణ్యంలోని ఆదివాసులపై దాడులు ఆగవని ఈ ఘటనల ద్వారా ప్రభుత్వం చెప్పదలుచుకుంది.

ఇదంతా ఎందుకు అనుకున్నప్పుడు దండకారణ్యంలోని విలువైన ఖనిజసంపదను ప్రకృతి వనరులను సామ్రాజ్యవాద దేశీయ కార్పోరేట్ కంపెనీలకు దోచిపెట్టి అందులో తన వంతు వాటా దక్కించుకోవటం పాలకుల లక్ష్యం. అందుకు అడ్డంకిగా వున్న ప్రజలను, వారిని సంఘటితం చేసి జల్, జంగల్, జమీన్‌పై హక్కు తమదేనని చేస్తున్న పోరాటానికి నేతృత్వం వహిస్తున్న మావోయిస్టు పార్టీని నిర్మూలించదలిచారు. ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తారమైన ఖనిజసంపదతో నిండిన ఆదివాసీ ప్రాంతాలన్నింటా జరుగుతున్నదిదే.

ఈ క్రమంలో పోరాటాన్ని అణచివేయడానికి దేశవ్యాప్తంగా ఆపరేషన్ గ్రీన్‌హంట్ రెండవదశ ముందుకు వచ్చింది. లేదు లేదంటూనే ఆదివాసులపై యుద్ధానికి భారతసైన్యాన్ని కూడా దించింది.

పిడికెడు మంది కార్పోరేట్ యజమానుల ప్రయోజనాల కోసం తన స్వంత ప్రజలపైనే యుద్ధాన్ని ఎక్కుపెట్టిన భారత దళారీ నిరంకుశ పాలకవర్గాల దుర్మార్గపు విధానాలను అన్ని వర్గాల ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, సంఘాలు, మేధావులు, వ్యక్తులు, ప్రజాస్వామిక శక్తులు అంతా ముక్త కంఠంతో ఖండించారు. దేశవ్యాప్త గ్రీన్‌హంట్–2 దాడులను ఉధృతంగా ఎదుర్కోవడమే నేడు మన ముందున్న ఏకైక మార్గం. అప్పుడే దండకారణ్యంలో వున్న ఖనిజ, ప్రకృతి సంపదలను, ఆదివాసీ ప్రాంతాలను కొల్లగొట్టకుండా, ఆదివాసుల సంస్కృతి కనుమరుగై పోకుండా కాపాడుకోగల్గుతాం.

**పత్రికకు మీ ప్రాంతంలోని పోరాట, ప్రతిఘటన, నిర్బంధ, సభలూ - సమావేశాల నివేదికలు, అమరుల జీవిత చరిత్రలను ఎప్పటికప్పుడు పంపుతూ వుండండి.**

# అమరవీరులకు జోహార్లు

## చెరువూరు అమరులకు అరుణారుణ జోహార్లు!

ఈస్ట్ డివిజన్‌లోని కోరుకొండ ఏరియాలో 2010, డిసెంబర్ 17న ఉదయం 11 గంటలకు ఆంబుష్‌కై మాటువేసి వుండగా ద్రోహి ఇచ్చిన సమాచారంతో గెరిల్లాల పై కౌంటర్ ఆంబుష్ జరిగింది. ఈ సంఘటనలో స్థానిక కోరుకొండ ఎసిఎం కామ్రేడ్ లత, కంపెనీ–1లో సెక్షన్ డిప్యూటీ కమాండర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కామ్రేడ్ జ్యోతి, సభ్యురాలు కామ్రేడ్ శాంతి, ఇదే ప్రాంతానికి చెందిన బత్తర్ గ్రామ సంఘ నాయకుడు కామ్రేడ్ లక్ష్మణరావులు అమరులైనారు. కామ్రేడ్స్ లత, జ్యోతిలు శత్రువుతో హోరాహోరీగా పోరాడుతూ అమరులు కాగా, కామ్రేడ్ శాంతి, లక్ష్మణరావులను ఆంబుష్ తర్వాత పట్టుకొని చిత్రహింసలు పెట్టి, కాల్చి చంపారు. గత సంచికలో కామ్రేడ్స్ శాంతి, లక్ష్మణరావుల చరిత్రలను ప్రచురించాము. కామ్రేడ్స్ లత, జ్యోతిల చరిత్రలను ఈ సంచికలో ప్రచురిస్తున్నాం.

## తూర్పుకనుమలపై మెరిసే పల్నాడు విప్లవ తార కామ్రేడ్ స్వర్ణలత (నాగమణి)

గుంటూరు జిల్లా పిడుగురాళ్ల మండలంలోని జూలకల్లు దళితపల్లెకు అంటరానితనం, అగ్రకుల అణచివేతకు వ్యతిరేకంగా పార్టీ నాయకత్వంలో కుల దురహంకార భూస్వాములపై రాజీ లేని పోరు చేసి మనుషులుగా మనుగడ సాధించుకున్న చరిత్ర వుంది. ఆ పల్లెలో కామ్రేడ్ నాగమణి 22 సంవత్సరాల క్రితం పుట్టింది. తన అసలు పేరు రాయపాటి స్వర్ణలత.

కామ్రేడ్ నాగమణి అమ్మమ్మ ఇల్లు పార్టీ కార్యకర్తల రాకపోకలకు నిలయం. చిన్నప్పటి నుండి జెఎన్ఎం ఆటపాటలంటే చాలా ఇష్టం. అలా 2002 చివరిలో పార్టీలోకి పూర్తికాలం కార్యకర్తగా వచ్చింది. అప్పటి నుండి దళం ఏరియాలో మహిళా సంఘాల బాధ్యతలు చూస్తూ ఆ ప్రాంతంలోని మహిళల్ని చైతన్యం చేయ కృషి చేసింది. 2004 లో వచ్చిన వెసులుబాటు కాలంలో ప్రజల్ని బహిరంగ సభలకు పెద్ద ఎత్తున తరలించడానికి పాటుపడింది.ఆ కాలంలో మర్రివేముల, గుత్తికొండ, నరమాలపాడు, అడిగొప్పుల గ్రామాలలో జరిగిన భూ పోరాటాల్లో పాల్గొన్నది. అద్దంకి, దుర్గి, చిలకలూరి పేట పోలీస్ స్టేషన్లపై దాడుల్లోనూ, రేమిడిచర్ల బస్సులో వస్తున్న గ్రేహౌండ్స్‌పై పిఎల్‌జిఎ జరిపిన ఆంబుష్‌లో సభ్యురాలిగా భాగమైంది.

ఉద్యమాన్ని దెబ్బతీయ పోలీస్ యంత్రాంగం తయారు చేసిన మర్రివేముల హెూంగార్డు, వేమగిరి శివారెడ్డి, వెంకటేశ్వర్లను, ఇన్‌ఫార్మర్ అయిన సోలాయపాలెం శ్రీనివాసరావు, నరమాలపాడు భూస్వామి మల్లయ్య, అడిగొప్పుల భూస్వామి వెంకటేశ్వర్లు మొదలైన వారిని ఖతం చేసిన కార్యక్రమంలో సభ్యురాలిగా ముందున్నది.

2004 పమిడిపాడు వద్ద, 2005 డిసెంబర్‌లో మర్రి వేముల వద్ద జరిగిన ఎదురుకాల్పుల్లో శత్రువుపైకి ఫైర్ చేస్తూ రిట్రీట్ అయ్యింది.

2007 చివరిలో జిల్లా ఉద్యమం పూర్తిగా దెబ్బతిని నష్టాలకు గురైనపుడు చలించకుండా అమరుడు కామ్రేడ్ వెంకటేష్‌తో పాటు పార్టీ ఏపీటీ దొరికే వరకూ ప్రజలనంటి పెట్టుకొని నిర్భయంగా నిలిచింది. ఎపి ఉద్యమం రిట్రీట్‌లో భాగంగా 2008 ఏప్రిల్లో కామ్రేడ్ లతగా ఎఒబి ఉద్యమంలో భాగమైంది. 2008 ఆగస్టులో జరిగిన సెంట్రల్ రీజనల్ మహిళా వర్క్‌షాపులో ప్రతినిధిగా హాజరై ఎన్నో విషయాలు నేర్చుకునే ప్రయత్నం చేసింది.

విశాఖ జిల్లా కోరుకొండ ఏరియా కమిటీ సభ్యురాలిగా ప్రజల్ని కూడగడుతూ కాఫీ ప్లాంటేషన్ల ఆక్రమణ, పంపిణీ పోరాటాల్లో ప్రజల పక్షాన నిలిచి పోరాడింది. కామ్రేడ్ లత అమరత్వం చెందేనాటికి ఎసిలో ఇంటెలిజెన్స్ బాధ్యతలు చూస్తున్నది. నిర్బంధ ప్రతిఘటనలో భాగంగా ప్రధాన బలగాలతో కలిసి ఆంబుష్‌కు వెళ్లగా శత్రువు చేసిన కౌంటర్ ఆంబుష్‌లో 2010, డిసెంబర్ 17న కామ్రేడ్స్ జ్యోతి, శాంతి, లక్ష్మణరావులతో పాటు కామ్రేడ్ లత తూర్పు కనుమల్లో నేలకొరిగింది.

కామ్రేడ్ లత ఎక్కడున్నా ప్రజలతో ఆటపాటల్లో ఉత్సాహంగా పాల్గొనేది. తనకు తెలిసిన అమరులపైన పాటలు, కవితలు రాయాలనే తపన ప్రదర్శించేది.

కామ్రేడ్ లతకు 2006 ప్రారంభంలో కామ్రేడ్ జహీర్‌తో వివాహం అయింది. వివాహం జరిగిన అయిదు నెలలకే ద్రోహి ఇచ్చిన సమాచారంతో జహీర్ అరెస్టు అయ్యాడు. ప్రస్తుతం కామ్రేడ్ జహీర్ జైలులో వున్నాడు.

ఆశయం పట్ల అంకితభావం, జీవిత సహచరుడు అరెస్టు అయి జైలులో వున్నా ఎపి రాష్ట్ర కమిటీ, ఎఒబికి బదిలీ చేసినపుడు ఎటువంటి ఊగిసలాటకు గురికాకుండా ప్రజాసేవలో నిమగ్నమై ప్రాణాలర్పించిన కామ్రేడ్ లత జీవితం మనకు ఆదర్శం.

## అమరత్వానికి సరిహద్దులు లేవని చాటిన

## కామ్రేడ్ ఉయక సుక్కి (జ్యోతి)

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, దంతెవాడ జిల్లా, మల్లెపాడు గ్రామంలో ఒక పేద కుటుంబంలో పుట్టి పెరిగిన ఉయక సుక్కి మొదట బాలల సంఘంలో పనిచేసింది. తర్వాత కొన్నాళ్లు సిఎన్ఎంలోను, మిలీషియాలోను పని చేసి 2006లో దళంలోకి రిక్రూట్ అయింది. మొదట బాసగూడెం ఎల్ఓఎస్‌లో పని చేసింది. 2007 సిఆర్‌సి మొదటి కంపెనీ ఎఒబిలో ఏర్పడిన తర్వాత కామ్రేడ్ జ్యోతి అందులోకి సభ్యురాలిగా బదిలీ అయి డికె నుండి ఎఒబికి వచ్చింది.

నాటి నుండి తను అమరురాలు అయ్యేంత వరకూ కంపెనీ చేసిన పలు చర్యల్లో కామ్రేడ్ జ్యోతి పాల్గొని తన వంతు కర్తవ్యాన్ని నెరవేర్చింది. నయాగఢ్ దాడిలో డాక్టర్ బాధ్యతలు నిర్వర్తించిన ఆమె, గోసామా ప్రాంతంలో జరిగిన హోరాహోరీ పోరులో పాల్గొంది. 2009లో కలిమెల ఏరియాలో జరిగిన ఫైరింగులోను, ఎంకెబి డివిజన్‌లోని మాచ్‌ఖండ్ ఏరియాలో ప్రజలకు వ్యతిరేకంగా నిర్మాణం చేస్తున్న డ్యాంను బంద్ చేయాలనే ఉద్దేశ్యంతో సప్తధార డ్యామ్‌పై చేసిన దాడిలోను, నాల్కో దాడిలోను ఆమె పాల్గొంది. కోరాపుట్ జిల్లాలో జరిగిన ప్రతిఘటనలో భాగంగా సాలూరు ఆంబుష్‌లో అసాల్ట్ టీంలో వుంది. ఈస్ట్ డివిజన్‌లో జరిగిన ప్రతిఘటనలో భాగంగా కిల్లంకోట ఫైరింగ్, ఆర్‌వి నగర్ ఫైరింగ్‌లో వుంది. అలాగే ప్రజా వ్యతిరేకుల ఇళ్లపై చేసిన దాడి సంఘటనలో కూడా జ్యోతి పాల్గొంది. పలువురు ఇన్ఫార్మర్లను ఖతం చేసిన చర్యల్లో ముఖ్య పాత్ర వహించింది.

ఈస్ట్ డివిజన్‌లో ప్రజలను కదిలించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా బాక్సైట్ పోరాటాన్ని నిర్మించడంలో ఆమె పాల్గొంది. అలాగే కాఫీ తోటలకు వ్యతిరేకంగా ప్రజలను కదిలించడంలోను, కాఫీ తోటల ఆక్రమణ పోరాటాల్లోను ఆమె భాగస్వామ్యం వుంది.

అలా చైతన్యవంతంగా తను పుట్టి పెరిగిన రాష్ట్ర సరిహద్దులను దాటుకొని, భాష తెలియని కొత్త ప్రాంతంలో కొత్త ప్రజలతో కలిసిపోయి వాళ్ల పోరాటాలతో మమేకమై అదే గడ్డపై ఒరిగిపోయిన కామ్రేడ్ జ్యోతి అమరత్వాన్ని తూర్పు కనుమలు సదా కీర్తిస్తాయి.

## ప్రజల డాక్టర్ కామ్రేడ్ జాన్ భాస్కర్

కా॥ జాన్ భాస్కర్ 1963లో కరీంనగర్ జిల్లా ధర్మారం గ్రామంలోని మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడు. ఆ తర్వాత జాన్ భాస్కర్ కుటుంబం ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్‌లో స్థిరపడింది. విద్యార్థి దశలో 1983–84లో రాడికల్ విద్యార్థి ఉద్యమం పట్ల ఆకర్షితుడయ్యాడు. 1985లో జిల్లాలోని హైస్కూళ్ళకు వెళ్ళి విద్యార్థుల్లో ఉద్యమ ప్రచారం సాగించాడు. ఆ తర్వాత ఆనారోగ్యంతో చదువును కొనసాగించలేక కొంత కాలం ఇంటివద్దనే వున్నాడు. ఆ తర్వాత మధ్యలో ఆపిన వైద్య విద్యను పూర్తిచేసి, 1992లో డాక్టర్ వృత్తి చేపట్టి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలందిస్తూ మంచి డాక్టర్‌గా పేరు పొందాడు.

కామ్రేడ్ జాన్ భాస్కర్ తన శక్తి మేరకు పార్టీకి సహాయపడాలని ఎంతగానో పరితపించాడు. నిప్పులు చెరిగే నిర్బంధంలో పార్టీ కలయిక కోసం ఎన్నో ప్రయత్నాలు సాగించి, 2004 చర్చల కాలంలో ఎట్టకేలకు పార్టీతో సంబంధాలు పునరుద్ధరించుకోగలిగాడు. అనంతరం పార్టీకి ఎంతగానో తన సహాయ సహకారాలందించాడు. ప్రజలకు ఉచిత వైద్యసేవలందించాడు. పార్టీపై శత్రు దుష్ప్రచారాన్ని ఎండగట్టాడు. శత్రు దుర్మార్గపు పథకాల గురించి ఎప్పటికప్పుడు పార్టీకి తెలియజేసి అప్రమత్తం చేశాడు. 2005లో పార్టీని దెబ్బతీయడానికి శత్రువు తయారు చేసిన కోవర్టుల గురించి పార్టీకి తెలియజేసి, వారిని పట్టుకోవడంలో ఎంతగానో సహాయపడ్డాడు. పార్టీ నిర్మూలించిన కోవర్టు సబిత, సుభాష్‌ల శవాలకు ప్రభుత్వ డాక్టర్‌గా పోస్ట్‌మార్టం నిర్వహించాడు. ఈ కోవర్టుల నిర్మూలనను అత్యాచారం, హత్యగా దుష్ప్రచారం చేయాలని చూసిన శత్రు పథకాన్ని వమ్ముచేస్తూ ఇది అత్యాచారం కాదనే వాస్తవాన్ని బయటపెట్టాడు. ఇందుకు కక్షగట్టిన పోలీసులు కా॥ జాన్ భాస్కర్‌పై తప్పుడు కేసు పెట్టి, బెదిరింపులు చేసినా ధైర్యంగా ఎదుర్కొన్నాడు. హక్కుల సంఘాలు, ప్రజాస్వామిక వాదులు కా॥ జాన్ భాస్కర్‌కు మద్దతుగా నిలిచారు.

రాజ్యం యొక్క దుర్మార్గాలను ఎదిరిస్తూ ప్రజలకు నిస్వార్థ సేవలందించిన డాక్టర్ జాన్ భాస్కర్‌ను శత్రువు కక్షగట్టి, నల్లదండు ముఠాతో యాక్సిడెంట్ చేయించి హత్యగావించాడు. ప్రజల డాక్టర్లు కా॥ రామనాథం, కా॥ ఆమెడ నారాయణల బాటలో ప్రజాసేవకు అంకితమైన కామ్రేడ్ జాన్ భాస్కర్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాడు.

డాక్టర్ జాన్ భాస్కర్ అమరహే!

## ప్రజాప్రభుత్వ మూల స్థంభం కామ్రేడ్ రామాల్

కామ్రేడ్ రామాల్ చర్ల మండలం రాంపురం గ్రామంలో నిరుపేద ఆదివాసీ కుటుంబానికి చెందినవాడు. చిన్నతనం నుండి కామ్రేడ్ రామాల్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ 2008–09 మధ్య కాలంలో ఆర్.పి.సి అధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు. ప్రజా

ప్రభుత్వంలో చురుకుగా పనిచేస్తున్న రామాల్‌ను శత్రువు 2009లో అరెస్ట్ చేసి చిత్రహింసలు పెట్టాడు. సంవత్సరం పాటు వరంగల్ జైలులో నిర్బంధించారు. బెయిల్‌పై విడుదలై గ్రామంలో వుంటూ నిబద్ధతతో పార్టీ అప్పగించిన పనులను చేశాడు. ఎన్నో కష్టాలు, ఇబ్బందుల్లో కూడా ధైర్యం కోల్పోక దృఢసంకల్పంతో ప్రజలకు సేవలందించాడు. శత్రుకేంద్రానికి దగ్గరలోనే వుంటూ కూడా తమకు లొంగకుండా కొరకరాని కొయ్యగా వుంటున్నాడనే కక్షతో శత్రువు రహస్య పోలీసు హంతకముఠాను పంపి 2010 డిసెంబర్ 12 రాత్రి మోసంతో ఇంటినుండి పిలుచుకుపోయి హత్యగావించారు.

ప్రజాసేవలో ప్రాణాలర్పించిన కామ్రేడ్ రామాల్ స్ఫూర్తితో శత్రుదుర్భేద్యమైన ప్రజా ప్రభుత్వ నిర్మాణానికై ప్రజలు పిడికిళ్ళు బిగిస్తున్నారు.

### జనమిలీషియా కమాండర్ కామ్రేడ్ మడకం భీమాల్

దుమ్ముగూడెం మండలం బక్కచింతల్ గ్రామంలోని నిరుపేద ఆదివాసీ కుటుంబంలో నుంచి వచ్చినవాడు కామ్రేడ్ భీమాల్. 5వ తరగతి వరకు చదివి ఆర్థిక ఇబ్బందుల వల్ల మధ్యలోనే చదువు ఆపివేసి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబానికి ఆసరా అయ్యాడు. చిన్నప్పటినుండి పార్టీ ప్రభావంతో ఉత్తేజితుడయ్యాడు. 2008 నుండి మిలీషియాలో చురుకుగా పని చేస్తూ 2009లో ఆర్.పి.సి పరిధిలోని జనమిలీషియాకు సెక్షన్ కమాండర్‌గా ఎదిగాడు. పార్టీ చేపట్టిన అనేక శత్రు నిర్మూలనా చర్యల్లో తనవంతు కర్తవ్యాన్ని పట్టుదలతో నిర్వర్తించాడు. ఈ క్రమంలో 2011 మే 15న కామ్రేడ్ భీమాల్ పాముకాటుకు గురై అకాల మృత్యువాతబడ్డాడు.

18 సంవత్సరాల చిన్న వయసులోనే అసువులుబాసిన కా॥భీమాల్ పట్టుదలతో, క్రమశిక్షణతో పార్టీ ఇచ్చిన బాధ్యతలు నిర్వర్తిస్తూ ప్రజల్లో, మిలీషియాలో చురుకైన కమాండర్‌గా ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నాడు. కామ్రేడ్ భీమాల్ ఆశయ సాధనలో జనమిలీషియాను మరింత బలోపేతం చేద్దాం.

## తర్లకోట అమరులకు జోహార్లు

మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ బ్లాక్ తర్లకోట వద్ద 2010 నవంబర్ 4న శత్రువు చేసిన మాటు దాడిలో పి.ఎల్.జి.ఎ ప్రచార కార్యక్రమానికి వెళుతున్న నలుగురు మిలీషియా కామ్రేడ్స్ అమరులయ్యారు.

### చురుకైన మిలీషియా సభ్యుడు కామ్రేడ్ గంగాల్

కామ్రేడ్ గంగాల్ మల్కన్‌గిరి జిల్లా, కలిమెల బ్లాక్, బొడిగట్ట పంచాయితీ పెద్దటేకుగూడ గ్రామానికి చెందినవాడు. ఈ గ్రామం పార్టీకి బలమైనది కావటం వల్ల కా॥ గంగాల్ చిన్నతనం నుండి పార్టీ పనుల్లో పాల్గొంటూ ప్రభావితుడయ్యాడు. మొదట బాలల సంఘంలో పని చేశాడు. 2007 నుండి మిలీషియాలో పనిచేస్తున్నాడు. పి.ఎల్.జి.ఎ నిర్వహించిన భూస్వామ్య వ్యతిరేక పోరాటాల్లో, ప్రతిఘటనా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నాడు. కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే పార్టీ కార్యక్రమాలలో నిబద్ధతతో పాల్గొన్నాడు. కామ్రేడ్ గంగాల్ ఆశయ సాధనలో మిలీషియాను మరింత బలోపేతం చేద్దాం.

### నిబద్ధతగల మిలీషియా సభ్యుడు కామ్రేడ్ మడ్కామి గంగాల్

మల్కన్‌గిరి జిల్లా, కలిమెల బ్లాక్, బొడిగట్ట పంచాయితీ పెద్దటేకుగూడ గ్రామంలో మధ్యతరగతి కుటుంబంలో పుట్టాడు. చిన్నతనం నుండి బాలల సంఘంలో పనిచేస్తూ, అనంతరం మిలీషియాలో చేరాడు. పార్టీ ఇచ్చిన కార్యక్రమాలు, ప్రచారం, ప్రతిఘటన చర్యల్లో బాధ్యతయుతంగా పనిచేశాడు.

### మిలీషియా యువకిశోరం కామ్రేడ్ పొడియామి ఇర్మాలు

స్వగ్రామం మల్కన్‌గిరి జిల్లా, కలిమెల బ్లాక్, బొడిగట్ట పంచాయితి చిన్నటేకుగూడ. చిన్నతనం నుంచి పార్టీ రాజకీయాలతో ప్రభావితుడై బాలల సంఘంలో పని చేశాడు. తర్వాత జన మిలీషియాలో చేరాడు. చిన్న వయస్సు కావటంతో చదువుకోవాలనే పార్టీ నిర్ణయం మేరకు ఆర్.పి.సి స్కూల్లో చేరి చదువు కొనసాగించాడు. ఉపాధ్యాయులు సరిగా రాకపోవటంతో చదువు సాగక మళ్ళీ మిలీషియాలో చేరి చురుకుగా పనిచేశాడు. తనకు అప్పగించిన బాధ్యతలను పట్టుదలతో నిర్వర్తించాడు.

### అలుపెరగని శ్రమజీవి కామ్రేడ్ మడ్కామి ఇర్మాలు

మల్కన్‌గిరి జిల్లా, కలిమెల బ్లాక్, బెజ్జంకివాడ పంచాయితీ బొద్దెల్ గ్రామంలోని నిరుపేద ఆదివాసీ కుటుంబంలో పుట్టాడు. బతుకుదెరువు కోసం సంవత్సరంలో సగభాగం ఆంధ్రకు వెళ్ళి కూలి చేసి పొట్టగడుపుకుంటూ కూడా మిగతా ఆరు నెలలు స్వగ్రామంలో సంఘ కార్యక్రమాల్లో పాల్గొనేవాడు. గ్రామంలోని భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నాడు. పార్టీలో పూర్తికాలం పనిచేయడానికి సిద్ధమై మిలీషియా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న క్రమంలో కామ్రేడ్ ఇర్మాలు శత్రుదాడిలో ఆసువులు బాసాడు.

తర్లకోట అమరుల ఆశయాలను సాధిస్తామని శపథం చేద్దాం. తర్లకోట అమరులకు జోహార్లు!

# పోరాటాలు - ప్రతిఘటన - సభలు

## ఎ.ఓ.బి

### మల్కన్‌గిరి ఉమ్మడి డివిజన్

#### జైలుఖైదీల సమస్యలపై పోరాటం

మల్కన్‌గిరి ఉమ్మడి డివిజన్‌లో జైలుఖైదీల సమస్యలపై 2010 సెప్టెంబర్ 13న జరుప తలపెట్టిన ర్యాలీని పోలీసులు అడ్డగించడంతో అవే సమస్యలపై నవంబర్ 23న మోటు ఏరియా బస్తూర్‌లో 500మందితో, కలిమెల ఏరియాలో 600మందితో కలిమెల బ్లాక్ కేంద్రంలో ర్యాలీ నిర్వహించి బి.డి.ఓకు డిమాండ్ల పత్రం యిచ్చారు.

జైలుఖైదీల సమస్యలపై బాధిత కుటుంబాలకు చెందిన వేలాది మంది ప్రజలు చేసిన ఈ పోరాటం సాధారణ ఖైదీలను సమస్యలపై పోరాటంలో ఐక్యంగా కలిసిరావడానికి ఎంతగానో ప్రభావితం చేసింది.

### పోలవరం డ్యాం నిర్మాణానికి వ్యతిరేకంగా

పోలవరం డ్యాం నిర్మాణం వల్ల మల్కనగిరి డివిజన్, మోటు ఏరియాలోని 25 గ్రామాలు ముంపుకు గురై వేలాది మంది ప్రజలు నిర్వాసితులు కానున్నారు. దీనికి వ్యతిరేకంగా పోలవరం డ్యాం నిర్మాణాన్ని వెంటనే ఆపివేయాలని నాలుగువేల మంది ప్రజలు 2010 నవంబర్ 13న మోటు పట్టణంలో ర్యాలీ నిర్వహించి బి.డి.ఓకు డిమాండ్లపత్రం ఇచ్చారు.

### చిత్రకొండ రిజర్వాయర్ ముంపు వ్యతిరేక ర్యాలీ

బహుళజాతి సంస్థల పరిశ్రమలకు విద్యుదుత్పత్తి కోసం చిత్రకొండ రిజర్వాయర్‌లో అధికంగా నీరు నిల్వ వుంచుతుండటం వల్ల పంటపొలాలు పెద్దమొత్తంలో ముంపుకు గురై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనికి వ్యతిరేకంగా రిజర్వాయర్‌లోని అధిక నీటిని వెంటనే వదిలివేయాలని డిమాండ్‌చేస్తూ గుమ్మా ఏ.సి పరిధిలోని కటాఫ్, గుమ్మా ఏరియాల ప్రజలు వెయ్యిమంది వరకు కదిలి నవంబర్ 16న గుమ్మా బ్లాక్ కేంద్రంలో ర్యాలీ నిర్వహించి బి.డి.ఓకు డిమాండ్ల పత్రం ఇచ్చారు.

### ప్రభుత్వ వైద్యశాఖ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ర్యాలీ

పాడియా బ్లాక్‌లో ప్రభుత్వ వైద్యశాఖ నిర్లక్ష్యం వల్ల సరైన వైద్య సౌకర్యం అందక అనేకమంది ప్రజలు అకాల మృత్యువాత పడ్డారు. వైద్యశాఖ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా తక్షణం ప్రజలకు సరైన వైద్య సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ 8వేల మంది ప్రజలు పాడియా బ్లాక్ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు.

### తాగునీరు, సాగునీటి సమస్యపై ఆందోళన

కలిమెల ఏరియా బోదగట్ట పంచాయితీలోని అడవి పక్క గ్రామాల ప్రజలు తీవ్రమైన తాగునీరు, సాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. వారి భూముల్లో నుండే సాగునీటి కాలువ పారుతున్నా వారికి ఆ నీళ్ళు అందటం లేదు. ప్రభుత్వం బంగ్లాదేశ్ నుండి తీసుకొచ్చి స్థిర నివాసాలు ఏర్పాటు చేసిన బెంగాలీలకు తాగు, సాగునీటి సౌకర్యం కల్పిస్తూ, స్థానిక ఆదివాసీ ప్రజలకు నీటి సౌకర్యం కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తూ విభజించి, పాలించే విధానాన్ని అవలంభిస్తున్నది.

ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా, బొడిగట్ట పంచాయితీ నుండి మన్యంకొండ వరకు అడవి పక్క గ్రామాలకు మరొక కాలువ త్రవ్వించాలని, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, పప్పులూరు ఏరియా ప్రజలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా తాగు, సాగునీటి సౌకర్యం కల్పించాలని, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను నిలిపివేయాలని, ఆదివాసీ గ్రామాల్లో ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేస్తున్న పోలీసు కూంబింగ్‌లను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. బాధిత గ్రామాలకు చెందిన ఐదువేల మంది ప్రజలు మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీ నిర్వహించి, డిమాండ్ల పత్రం యిచ్చారు. ఈ ఆందోళనలో ఆ ప్రాంతంలోని వివిధ తెగలకు చెందిన ఆదివాసీ సంఘాలు కూడా పాల్గొన్నాయి.

### ప్రభుత్వ పాఠశాలల్లో సక్రమంగా విద్యాబోధన జరగాలని ఆందోళన

మల్కన్‌గిరి డివిజన్, కలిమెల బ్లాక్‌లోని కలిమెల, పప్పులూరు ఏరియాలో బొడిగట్ట, బెజ్జంకివాడ, పప్పులూరు పంచాయితీలలోని గ్రామాల ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధ్యాయులు సరిగా రాక, విద్యార్థులకు సరైన విద్యాబోధన అందటం లేదు. దీనికి వ్యతిరేకంగా విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు కలిసి మార్చి నెలలో ఆందోళన చేపట్టారు.

ఈ ఆందోళనలో కోయ, కొండరెడ్డి, తెలుగు, ఒడియా, బెంగాలీ తదితర ప్రజలు 400మంది వరకు కదిలి కలిమెల బ్లాక్ కేంద్రంలో ర్యాలీ నిర్వహించి బి.డి.ఓ, విద్యాశాఖాధికారులను నిలదీశారు. ఆదివాసీ విద్యార్థులకు సరైన విద్యాబోధన అందించాలని, ఉపాధ్యాయులు పాఠశాలలున్న గ్రామాల్లోనే వుండాలని, పాఠశాలల

పనివేళలు తప్పక పాటించాలని, పాఠశాలలను ఇతర పనులకు ఉపయోగించరాదని, సరైన సమయంలో విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు అందించాలనే డిమాండ్లతో వినతి పత్రాన్ని సమర్పించారు. ఆందోళనలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు కూడా పాల్గొన్నారు. ప్రజల ఆందోళనకు తలొగ్గిన అధికారులు తమ పరిధిలోని డిమాండ్లను పరిష్కరిస్తామని, మిగిలినవి కలెక్టర్‌ను అడిగి పరిష్కరించుకుందామని హామీ యిచ్చారు.

### అవినీతి సంస్కరణల రంగు బహిర్గతం

మల్కనగిరి జిల్లా, పప్పులూరు ఏరియాలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రోడ్లు, కుంటలు, చెరువులు, పక్కాఇండ్లు మొదలైన వాటికి నిధులు మంజూరు చేయించుకొని సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్లు, సెక్రటరీలు కాజేస్తున్నారు. ప్రజలచేత పని చేయించుకొని బిల్లులు రాలేదని కూలి ఇవ్వకుండ ఎగవేస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా ఏరియాలోని 30 గ్రామాల ప్రజలతో పప్పులూరు పంచాయితీ మద్దుమల్ల గ్రామంలో ఏరియాకమిటీ సభ నిర్వహించి వీరి అవినీతిని బట్టబయలు చేసింది. గ్రామానికి అవసరమైన పనులకే నిధులు తీసుకురావాలని, పాతబిల్లులు చెల్లించకుండ కొత్త పనులు తీసుకురావద్దని హెచ్చరించటం జరిగింది. ఈ సందర్భంగా బూటకపు సంస్కరణల నిజస్వరూపాన్ని, వాటి లక్ష్యాన్ని ప్రజలకు వివరించటం జరిగింది.

## తూర్పు డివిజన్

### కాఫీతోటల స్వాధీన పోరాటం

తూర్పు డివిజన్‌లో ఎ.పి.ఎఫ్.డి.సి యాజమాన్యంలోని కుంకుంపూడి, తోకచెలక ఎస్టేట్లలో సుమారు 140 హెక్టార్ల కాఫీ ప్లాంటేషన్ వుంది. గత 40 ఏళ్ళుగా ఎ.పి.ఎఫ్.డి.సి ఇక్కడ 25 గ్రామాలకు చెందిన స్థానిక ఆదివాసులను కాఫీ ఎస్టేట్లలో కూలీలుగా పని చేయించుకుని తీవ్రమైన శ్రమ దోపిడికి గురిచేస్తున్నది. వీరు అనేక సంవత్సరాలుగా పార్టీ నాయకత్వంలో కూలి రేట్ల పెంపుదల పోరాటం చేస్తూ, 2008 నుండి ఎ.పి.ఎఫ్.డి.సికి వ్యతిరేకంగా సంఘటితమై తామే స్వంతంగా కాఫీ పండ్ల సేకరణ ప్రారంభించారు.

గత రెండు సంవత్సరాలుగా పోలీసు రక్షణలో ఎ.పి.ఎఫ్.డి.సి బల ప్రయోగంతో కాఫీ పండ్ల సేకరణ చేయజూసినా ఒకటి, రెండు చోట్ల మినహా అంతటా విఫలమైంది. ప్రజలు కూడా కాఫీ తోటల స్వాధీన పోరాటానికి, కాఫీ పండ్ల సేకరణకు రక్షణగా మన్యం పితూరీ సేన, కాఫీ తోటల పోరాట కమిటీలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సంవత్సరం మొత్తం కాఫీ పండ్లను ప్రజలే స్వాధీన పరుచుకున్నారు. ఈ ఎస్టేట్‌ను ఆనుకొని వున్న మర్రి పాకల ఎస్టేట్‌లో జరుగుతున్న కాఫీ తోటల స్వాధీన పోరాట ప్రభావంతో ఇక్కడ కూడా ప్రజలు కాఫీ తోటల స్వాధీనానికి నడుం బిగించారు. కుంకుంపూడి, తోకచెలక ఎస్టేట్ పరిధిలో ముందుగా చెరుకుంపాకల ప్రజలు తోటలు స్వాధీన పరుచుకొని సెంట్రింగ్, వీడింగ్ పనులు పూర్తి చేశారు.

శత్రువు ఈ పోరాటాన్ని అణచివేసేందుకు ఒక పక్క నిర్బంధాన్ని ప్రయోగిస్తూనే మరో పక్క నీరుగార్చే ప్రయత్నాలు ప్రారంభించాడు. కుంకుంపూడి, ఈతరుబ్బల, మల్లికార్జున గ్రామాలకు చెందిన కొందరిని తొత్తులుగా మార్చుకున్నాడు. పోలీసులు గ్రామాలపై దాడులు చేస్తూ తమ తొత్తుల ద్వారా ప్రజల్లో భయాలు వ్యాపింపజేశారు. ఎట్టకేలకు ఒక బస్తా కాఫీ పండ్లు తిరిగి ఎ.పి.ఎఫ్.డి.సికి ఇచ్చే విధంగా కొంతమేరకు పోరాటంలో బలహీనత సృష్టించారు.

ఈ పరిస్థితిలో ఈ రెండేళ్ళ పోరాటాన్ని సమీక్షించి పోరాట కమిటీలను బలోపేతం చేయడం, కమిటీలకు రాజకీయ చైతన్యం పెంపొందించడం, మిలీషియాను పునఃసంఘటితం చేయడం లక్ష్యాలుగా గాలికొండ ఎ.సి నేతృత్వంలో సమావేశం జరిగింది. రెండు ఎస్టేట్ల పరిధిలో 250 మంది ప్రజలు ఈ సమావేశంలో పాల్గొని పోరాటంలో ఎదుర్కొన్న సమస్యలను చర్చించారు. ఉద్యమాన్ని నీరు గార్చడానికి శత్రువుకు తొత్తులుగా మారిన వారి దిగజారుడు తనాన్ని ప్రజలు ఎండగట్టారు.

గత రెండేళ్ళ పోరాటాన్ని సమీక్షించి పోరాట కమిటీలు, మిలీషియా మరింత బలోపేతం కావల్సిన ఆవశ్యకతను, అందుకు చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించారు. స్థానిక కమిటీలను కలిపి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. పోరాటంలో వెనుకబడిన తీములబంద, కంపుమానుపాకల, కుంకుంపూడి గ్రామాలపై మరింత కేంద్రీకరించాల్సిన అవసరాన్ని గుర్తించారు. రానున్న నిర్బంధం మొదలైన అంశాలను చర్చించి మిలీషియా, ద్వితీయ బలగాల మద్దతుతో కాఫీ తోటలను స్వాధీనం చేసుకోగలమని దృఢమైన విశ్వాసం వ్యక్తం చేశారు.

## కోరాపుట్ డివిజన్

### ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని తిప్పికొట్టిన మసాన్‌మండ ప్రజలు

2011 జనవరి 23వ తేదీన నారాయణపట్నం బ్లాక్ బలిపట్ట పంచాయితి మసానమండ గ్రామంపై ప్రజలంతా పనుల కోసం అడవికి వెళ్ళిన సమయంలో పోలీసులు దాడి చేశారు. పురుషులు ఎవరు దొరక్కపోవటంతో మావోయిస్టుల ఆచూకి చెప్పమంటూ దొరికిన మహిళలను కొట్టారు. ఏ సమాచారం దొరక్కపోవటంతో

పిచ్చెత్తిన పోలీసులు ఇళ్ళలో వున్న కిరోసిన్ పోసి ఇళ్ళకు నిప్పంటించారు. ఈ గ్రామంలోని 9 ఇళ్ళలో 6 ఇళ్ళు పూర్తిగా కాలి బూడిద కాగ, మరో మూడు ఇళ్ళకు పాక్షికంగా నష్టం జరిగింది. ఈ సంఘటన తరువాత బి.ఎస్.ఎఫ్ అధికారి ఒకడు పోలీసులకు దీనితో సంబంధం లేదని, అగ్ని ప్రమాదం వలన ఇళ్ళు కాలిపోయాని పత్రికల్లో ప్రకటన ఇచ్చాడు.

నారాయణపట్నం బి.డి.ఓ అగ్ని ప్రమాదం జరిగినందుకు ఆ గ్రామ ప్రజలకు బియ్యం, దుప్పట్లు పంపించాడు. అయితే ప్రభుత్వ, పోలీసుల ద్వంద్వ నీతిని, కుటిల బుద్ధిని అర్థం చేసుకున్న ప్రజలు బి.డి.ఓ పంపిన బియ్యాన్ని దుప్పట్లను తిప్పికొట్టారు. ఛసి మూలియా సంఘం నాయకత్వంలో బలిపట్ట, తెంతులిపాదర్ పంచాయితీల ప్రజలు ధాన్యం, సామలు, చోళ్ళు, బట్టలు, డబ్బు మొదలైనవి విరాళంగా సేకరించి మసాన్‌మండ ప్రజలకు అందించారు. ఛసి ములియా సంఘం 6 ఇళ్ళకు రేకులను సహాయం చేసింది.

## ఛసి ములియా సంఘం, మహిళా సంఘాల నేతృత్వంలో రెండు రోజుల మహాధర్నా

నారాయణపట్నం– బందుగాం బ్లాక్‌లకు చెందిన వేలాదిమంది ప్రజలు తమ సమస్యలపై 2011 ఫిబ్రవరి 6,7 తేదిలలో రెండు బ్లాక్ కేంద్రాలలో మహాధర్నా చేపట్టారు.

నారాయణపట్నంలో ప్రజలు ఊరేగింపు నిర్వహించారు. నారాయణపట్నం– బందుగాం పట్టణాల మధ్య ప్రజలు రోడ్డుకు అడ్డంగా చెట్లు నరికివేసి వాహనాల రాకపోకలను బంద్ చేశారు. పట్టణంలో మార్కెట్, సంత, దుకాణాలను పూర్తిగా బంద్ చేశారు.

1. ఆదివాసీలపై నిర్బంధాన్ని ఆపివేయాలి. 2. బి.ఎస్.ఎఫ్ క్యాంపులు ఎత్తివేయాలి. 3. అక్రమంగా అరెస్టు చేసిన సంఘ కార్యకర్తలను బేషరతుగా విడిచిపెట్టాలి. 4. జైల్లో అమరులైన గంగులు, రత్నో కుటుంబాలకు ఒక్కొక్కరికి రు. 5 లక్షల నష్టపరిహారం చెల్లించాలి. 5. ఛసి మూలియా సంఘంపై దాడులు చేస్తున్న వారిపై చర్య తీసుకోవాలి. 6. విద్య, వైద్యం, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు తక్షణమే కల్పించాలనే డిమాండ్లతో 7వ తేదిన ధర్నా వద్దకు వచ్చిన బి.డి.ఓకు డిమాండ్ల పత్రం ఇచ్చారు. ఈ ధర్నా లో 9 పంచాయితీల నుండి ప్రజలు పాల్గొన్నారు.



ఛసి ములియా సంఘం, మహిళా సంఘాల నేతృత్వంలో మహాధర్నా

బందుగాం బంద్ సందర్భంగా ప్రజలు ముందుగా సారపెల్లి గ్రామం వద్ద జమకూడి అక్కడి మద్యం దుకాణాలపై దాడిచేసి మద్యాన్ని ధ్వంసం చేశారు. మద్యం వ్యాపారాలు బంద్ చేయాలనే నినాదాలతో ఊరేగింపు ప్రారంభమై బందుగాంకు చేరుకుంది. మొట్టమొదటి సారిగా బందుగాం పట్టణంలో పెద్దఎత్తున ర్యాలీ, ధర్నాలు జరిగాయి.

1. సాగునీటి సౌకర్యం కోసం చింతగూడ డ్యాం నిర్మించాలి. 2. అక్రమకేసులు ఎత్తివేయాలి. 3. రైతులు అక్రమించుకున్న భూస్వాముల భూములకు పట్టాలు ఇవ్వాలి. 4. తాగు, సాగునీరు, విద్య, వైద్యం, విద్యుత్ మొదలైన మౌలిక సదుపాయాలు తక్షణమే కల్పించాలి. 5. మద్యం అమ్మకాలు బంద్ చేయాలని బి.డి.ఓకు డిమాండ్ల పత్రం యిచ్చారు.

ఈ మహాధర్నాలో రెండు బ్లాక్‌లకు చెందిన పంచాయితీల సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, సమితి సభ్యులు, అన్ని పార్టీలకు చెందిన స్థానిక నాయకులు పాల్గొన్నారు. రెండు రోజులపాటు ప్రజలు ప్రభుత్వ ఆఫీసుల ముందు, రోడ్డుపై వంటలు చేసుకుని ధర్నాను విజయవంతం చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## కలెక్టర్ వినీల్ కృష్ణ విడుదలపై ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా.....

నారాయణపట్నం బ్లాక్‌లో దాదాపు రెండువందల మంది అమాయక ఆదివాసీ ప్రజలను నవీన్ పట్నాయక్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి జైళ్ళలో నిర్బంధించింది. వీరి విడుదల కోసం ప్రజలు అనేకసార్లు ర్యాలీలు, ధర్నాలు చేసి మెమోరాండంలు ఇచ్చినా, ఎంత మందికి మొరపెట్టుకున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు నిర్లక్ష్యం వహించింది. కానీ మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్‌ను పి.ఎల్.జి.ఎ కిడ్నాప్ చేసిన సందర్భంగా కలెక్టర్‌ను విడిచిపెట్టాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సెక్షన్లలోని తన అనుకూల శక్తులతో ప్రభుత్వం పథకం ప్రకారం ర్యాలీలు, ధర్నాలు చేయించింది. వందలాది అమాయక ఆదివాసీలను నిర్బంధించి విడిచిపెట్టకుండ, కలెక్టర్ విడుదల కోసం గగ్గోలు పెడుతున్న ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఛసి మూలియా ఆదివాసీ సంఘం 2011 ఫిబ్రవరి 21వ తేదిన నారాయణపట్నంలో 5వేల

మందితో భారీ ర్యాలీ నిర్వహించింది. జైళ్ళలో నిర్బంధించిన ఖైదీలందరినీ బేషరతుగా తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేసింది.

## డిమాండ్ల అమలుకై బహిరంగ సభ

కలెక్టర్ వినీల్‌కృష్ణను విడిచిపెట్టిన తర్వాత ఒడిశా ప్రభుత్వం ఒప్పుకున్న డిమాండ్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఛసి ములియా ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 25న కుంబారిలో 20వేల మందితో బహిరంగ సభ జరిగింది. ఈ సభలో సి.ఎం.ఎ.ఎస్ నాయకులతో పాటు పలువురు ప్రజాస్వామిక వాదులు పాల్గొన్నారు.

## ఒప్పందాల అమలును డిమాండ్ చేస్తూ...

కలెక్టర్ వినీల్ క్రిష్ణ కిడ్నాప్ సందర్భంగా ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్లను అమలుచేయలేదు. దీనికి నిరసనగా 2011 ఏప్రిల్ 22న కలిమెల ప్రాంతంలో ర్యాలీ, సభలను నిర్వహించారు. ఇందులో దాదాపు 400 మంది పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వం డిమాండ్లను నెరవేర్చకుండా నాన్చుతూ కాలక్షేపం చేస్తున్నదనీ, వెంటనే డిమాండ్లను నెరవేర్చాలనీ కోరాపుట్, మల్కన్‌గిరి జిల్లాలోని జైళ్లలో వున్న సంఘ, పార్టీ కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ఒప్పందాల అమలును డిమాండ్ చేస్తూ...

మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ కిడ్నాప్ సందర్భంగా ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్లలో నారాయణపట్నా ప్రాంతానికి సంబంధించినవి కొన్ని వున్నాయి. వీటిలో అక్రమంగా అరెస్టయి జైలులో వున్నవారిని విడుదల చేయడం, భూమి సమస్య పరిష్కరించడం ముఖ్యమైనవి. రెండు నెలల సమయం గడిచిపోయినా కానీ ఒక్క డిమాండ్ నెరవేర్చలేదు. దీనితో ఛసి ములియా సంఘం, విప్లవ మహిళా సంఘం సంయుక్తంగా ఏప్రిల్ 24న బందుగాం బ్లాక్ కత్తులపేటలో బహిరంగ సభను నిర్వహించాయి. కిడ్నాప్ సందర్భంగా మధ్యవర్తిత్వం వహించిన వారిని వక్తలుగా ఆహ్వానించాయి.

ఈ సభలో భారీ ఎత్తున పదిహేను వేల మందికి పైగా ప్రజలు పాల్గొన్నారు. వక్తలుగా ప్రొఫెసర్ హరగోపాల్, వరవరరావు, దండపాణి మహంతి, బి.డి.శర్మ, వెంపటావు భారతి, నాచిక లింగా తదితరులు హాజరై ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. వీరంతా ప్రభుత్వం షరతులను ఉల్లంఘించి తిరిగి ఉద్యమాలపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నదని విమర్శించారు. మావోయిస్టు పార్టీ హింసాత్మక కార్యకలాపాలు చేయనంత వరకు ప్రభుత్వం ఎలాంటి నిర్బంధాన్ని ప్రయోగించకుండా వుండడం, వివిధ జైళ్లలోని ఆదివాసీలను విడుదల చేయడం, నారాయణపట్నాలో ఆదివాసీలు సాగుచేసుకుంటున్న 2500 ఎకరాల భూములను ఆదివాసీలకు దఖలు చేయడం తదితర 14 డిమాండ్లను ఒప్పందాల్లో భాగంగా ప్రభుత్వం అంగీకరించిందనీ కానీ ఒక్కటి కూడా ప్రభుత్వం అమలు చేయలేదని వక్తలు మాట్లాడారు. మల్కన్‌గిరి జిల్లాలో ఎన్‌కౌంటర్ జరిపి ఒక మహిళా నక్సలైటును పోలీసులు చంపివేశారనీ, నారాయణపట్నాలోని బసనాపుట్ గ్రామంలోని తులసిని పోలీసులు పట్టుకెళ్లి హింసించి జైలులో పెట్టారనీ, పొడపాదర్, బలియాపుట్, దుంశిలి, దుంబగూడ, గొంద్రగూడ, మసాన్‌మండా గ్రామాలపై పోలీసులు దాడులు చేసి హింసిస్తున్నారని వివరిస్తూ ప్రభుత్వ దమననీతిని ఖండించారు.

ఛసి ములియా సంఘం నాయకుడు నాచిక లింగా మాట్లాడుతూ ప్రభుత్వం ఈ ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరించడం మానేసి, నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నదన్నాడు. అలాగే ప్రజలు పోరాటం చేసి సారాను బంద్ చేసుకుంటే నేడు పోలీసుల అండతో తిరిగి మద్యం అమ్మకాలు జోరందుకున్నాయన్నాడు. నారాయణపట్నా భూమి సమస్యపై పోరాడుతూనే సంఘం నేతృత్వంలో కొత్త భూమి సాగు కొరకు అనేక చోట్ల కెనాల్‌లను నిర్మించుకుంటున్నామనీ, ప్రభుత్వం ఏ సమస్యనూ పరిష్కరించదని 63 సంవత్సరాల అనుభవం నుండి గ్రహించిన మేము మా సమస్యలను మేమే పరిష్కరించుకుంటున్నామని అన్నాడు. మరో పది సంవత్సరాల్లో ఈ ప్రాంతంలో భూమి లేని ప్రజలు వుండరనీ ప్రకటించాడు.

## దోపిడి దొంగలను శిక్షించాలని ప్రజల ఆందోళన

నారాయణపట్నం-బందుగాం ప్రాంతంలో ఛసి ములియా సంఘం బలపడక ముందు దారిదోపిడీలు, దొంగతనాలు జరిగేవి. సంఘం బలపడిన తర్వాత దొంగతనాలు పూర్తిగా ఆగిపోయాయి. భూపోరాటం తీవ్రమైన తర్వాత పోలీసు నిర్బంధం పెరిగింది. నిర్బంధాన్ని ఆసరా చేసుకొని గ్రామాలు విడిచి పారిపోయి శాంతి సంఘంలో చేరిన గూండాలు, పోలీసుల అండదండలతో పాత దోపిడీలకు మళ్ళీ తెరతీశారు. పోలీసుల వేషాల్లో రాత్రిపూట పోలీసులతో కలిసి గ్రామాలలో సోదాలకు వచ్చి దోపిడీలు, దొంగతనాలు చేయటం గత 2 సంవత్సరాల కాలంలో తీవ్రమైంది. ఈ లైసెన్స్‌డ్ దొంగతనాల్లో దోచిన బంగారం, డబ్బు, కోళ్ళు, మేకలు తదితర దోపిడీ సొత్తు పోలీసులు, గూండాలు కలిసి పంచుకోవటం మామూలైంది.

నారాయణపట్నం బ్లాక్ కుంబారి పంచాయితీ రంగంగూడ గ్రామంలో పోలీసులు, దొంగలు కలిసి రాత్రిపూట సోదాల పేరుతో బంగారం, డబ్బు దోచుకుపోయారు. అడిగిన వారిని తీవ్రంగా

కొట్టారు. ఈ గ్రామంలో ఇటువంటి దాడులు, దొంగతనాలు ఇప్పటికి మూడుసార్లు జరిగాయి. దీన్ని భరించలేని గ్రామస్తులు 2011 మార్చి 7న ఊరేగింపుగా వెళ్ళి నారాయణపట్నంలో ప్రభుత్వాధికారులను నిలదీశారు. ఈ లూటీలు ఆపాలని డిమాండ్ చేశారు. ఆనంతరం పత్రికా విలేఖరుల ముందు పోలీసుల – శాంతికమిటీ గూండాల దుర్మార్గాలను బహిర్గతం చేశారు. ఈ విధమైన దోపిడీలు ఆగకపోతే సరైన గుణపాఠం చెబుతామని పత్రికాముఖంగా హెచ్చరించారు. ఈ ఆందోళనలో మహిళలు ముందు పీఠిన నిలిచారు.

## దేవ్‌మాలి పర్వత పరిరక్షణకై బహిరంగ సభ

కోరాపుట్ జిల్లా పొట్టంగి బ్లాక్‌లో మాలి, దేవ్‌మాలి పర్వతాలను 2005లో ప్రభుత్వం బాక్సైట్ తవ్వకాలకు ఇండాల్కో కంపెనీకి 15 సం॥లకు లీజుకిచ్చింది. రాష్ట్రంలోనే ఎత్తైన ఈ దేవ్‌మాలి పర్వతాలపై 22 గ్రామాలలో పదివేలకు పైగా ఆదివాసీలు నివసిస్తున్నారు. అటవీ ఉత్పత్తులు, కొండవాగులు ప్రజల జీవనాధారాలు. ఖనిజాన్ని తవ్వి తీయటం వలన ఈ ప్రాంతం వాతావరణ కాలుష్యానికి లోనవడమే కాకుండా ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగవుతాయి. కనుక దీన్ని వ్యతిరేకిస్తూ ఈ ప్రాంత ప్రజలు మాలి, దేవ్‌మాలి పర్వత ప్రాంతాలను పరిరక్షించాలన్న డిమాండ్‌తో ఎంతో కాలంగా ఆందోళనలు జరుపుతున్నారు. ఇందులో భాగంగా 2011 మార్చి 21వ తేదీన దేవ్‌మాలి పర్వతంపై మాలి, దేవ్‌మాలి పర్వత సురక్షా సమితి ఆధ్వర్యంలో పెద్ద బహిరంగసభ జరిగింది.

ఛసి మూలియా ఆదివాసీ సంఘం, ఆదివాసీ విప్లవ మహిళా సంఘం, మాలి పర్వత సురక్షా సమితి, హెచ్.ఎ.ఎల్–సునాబేడ విస్తాపిత సంఘం, దేవ్‌మాలి సురక్షా సమితి, నియమగిరి సురక్షా సమితి, కుయి సమాజ్, పొరజ సమాజ్, దురువా సమాజ్, మాలి సమాజ్, మాటియా సమాజ్, గదబ సమాజ్ తదితర సంఘాల నుండి కార్యకర్తలు, ప్రజలు 15వేల మందికి పైగా పాల్గొన్నారు.

ప్రజలను మీటింగుకు రాకుండా అడ్డుకోవాలని పోలీసులు ఎన్నో రకాలుగా ఇబ్బందులు పెట్టినప్పటికీ ప్రజలు కాలినడకన, వాహనాలలోను, ఇతర మార్గాలలో సభకు చేరుకున్నారు.

సభలో ఛసి మూలియా సంఘం అధ్యక్షుడు నాచిక లింగ మాట్లాడుతూ... "మన అడవి తల్లిని హత్య చేస్తుంటే మనం చూస్తూ ఊరుకుందామా? మన ప్రాణం పోయినా మన తల్లిని కాపాడుకుందాం. మాలి, దేవ్‌మాలి పర్వతాలను రక్షించుకుందాం" అంటూ చేసిన ఉపన్యాసం ప్రజల్లో పోరాట స్ఫూర్తిని రగిలించింది. జన అభియాన్ మంచ్ నుండి దండపాణి మహంతి, ఆంధ్రప్రదేశ్‌నుండి చలసాని ప్రసాద్, అన్నపూర్ణలు, కొందమాల్ వనవాసి అధికారి మంచ్ తరపున నరేంద్ర మహంతి, నియమగిరి సురక్షా పరిషత్ నుండి లింగరాజ్ ఆజాద్‌లతో పాటు స్థానిక ఆదివాసీ నాయకుల ప్రసంగాలు సభికులను ఉత్తేజపరిచాయి.

సభలో వివిధ సంస్థల కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆదివాసుల్లో తమ సంస్కృతి, సంప్రదాయాలు, కళలను పరిరక్షించుకోవాలనే పోరాట స్ఫూర్తిని అందించాయి.

## ఆదివాసీలపై పోలీసుల దమనకాండకు వ్యతిరేకంగా బహిరంగ సభ

నారాయణపట్నం బ్లాక్‌లో నారాయణపట్నం, పాలూరు, పాడపాదర్‌లలో క్యాంపులు పెట్టి పోలీసులు చేస్తున్న అరాచకాలకు నిరసనగా 2011 మార్చి 29వ తేదిన తెంతులిపాదర్ పంచాయితిలో ఆదివాసీ విప్లవ మహిళా సంఘం నాయకత్వంలో బహిరంగ సభ జరిగింది. ఈ సభలో రెండువేల మందికి పైగా ప్రజలు పాల్గొనగా, ఇందులో మూడు వంతులు మహిళలే. సభలో బి.ఎ.ఎమ్.ఎస్ అధ్యక్షురాలు కామ్రేడ్ సున్నోతోపాటు పలువురు మహిళా సంఘం సభ్యులు ప్రసంగించారు.

పోలీసు క్యాంపులు పెట్టిన తర్వాత ప్రజలపై దాడులు, అరాచకాలు, మహిళలపై అత్యాచారాలు, ప్రజల ఆస్తులు దొంగతనాలు చేయటం పెరిగిపోయాయని, ప్రభుత్వ, పోలీసు దమనకాండకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలని, సారా వ్యతిరేక పోరాటంలో మహిళలు పెద్దఎత్తున కదలాలని పిలుపునిచ్చారు.

## నారాయణపట్నం భూముల్లో విజయవంతమైన పంట కోతలు

నారాయణపట్నం బ్లాక్‌లో ప్రజలు ఆక్రమించుకున్న భూస్వాముల భూముల్లో 2010 అక్టోబర్‌లో ప్రజలు దుక్కులు దున్ని విత్తనాలు వేశారు. భూస్వాములు పోలీసుల అండతో కంచెలు విరగ్గొట్టటం, ఈ భూముల్లోకి గొడ్లను వదిలిపెట్టటం వంటి అనేక ఆటంకాలు సృష్టించినప్పటికి వీటన్నింటిని అధిగమిస్తూ ప్రజలు పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. ప్రజల శ్రమతో పండిన ఈ పంటలో కోతలు ప్రారంభించాలని ఛసి మూలియా సంఘం ఇచ్చిన పిలుపుతో 2011 ఏప్రిల్ 21వ తేదీన ప్రజలు పంట కోతలకు సిద్ధమయ్యారు.

21వ తేదీ తెల్లవారేటప్పటికి నారాయణపట్నం బ్లాక్‌లో 9 పంచాయితీల నుండి ప్రజలు కొడవళ్ళు, ఎర్రజండాలు చేతపట్టి భూముల్లోకి దిగి పంటకోతలు ప్రారంభించారు. 21 నుండి 28వ తేదీ వరకు వారం రోజులపాటు ప్రజలు సమిష్టిగా బలిపట్ట, పాడపాదర్, విక్రంపూర్, కుంబరి, నారాయణపట్నం తదితర భూముల్లో పంటను కోసి ఇళ్ళకు తీసుకువెళ్ళారు. ఈ పంట కోతలలో

5వేలకు పైగా ప్రజలు పాల్గొన్నారు. నారాయణపట్నం ప్రజలకు మద్దతుగా బందుగాం బ్లాక్‌లోని బందుగాం పంచాయితీ ప్రజలు కూడా కోతల్లో పాల్గొన్నారు.

## అమరవీరుల సంస్మరణ వారోత్సవ సభలు

మల్కన్‌గిరి డివిజన్, కలిమెల ఏరియా, టేకుగూడ ఆర్.పి.సి పరిధిలో కన్నగూడ గ్రామంలో 2010 జూలై 28న జరిగిన సభకు నాలుగు గ్రామాల నుండి 300 మంది ప్రజలు పాల్గొన్నారు.

మాచ్‌ఖండ్ ఏరియా పరిధిలో బరంగబడి గ్రామంలో జూలై 30న ఏరియా స్థాయి సభ జరిగింది. ఈ సభకు మూడు పంచాయితీల నుండి మూడువేలకు పైగా ప్రజలు హాజరయ్యారు. ఎల్.ఓ.ఎస్ కమాండర్ జండా ఎగురవేయగా ఏరియా కమిటీ సభ్యురాలు స్థూపావిష్కరణ చేసింది. సంఘకార్యదర్శి సభకు అధ్యక్షత వహించాడు. జిల్లా కమిటీ సభ్యునితో సహా పలువురు వక్తలు అమరుల త్యాగాలను స్మరిస్తూ ప్రసంగించారు. మిలీషియా రక్షణలో పి.ఎ.డి దళం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్తేజ భరితంగా సభ విజయవంతమైంది.

## కామ్రేడ్ ఆజాద్ సంస్మరణ సభలు

మాచ్‌ఖండ్ ఏరియాలోని బొడ్‌రాల్, మడకపొద్దార్ పంచాయితీల పరిధిలో రెండు చోట్ల సంస్మరణ సభలు జరిగాయి. బొడ్‌రాల్ సభకు 800 మంది, మడకపొద్దార్ సభకు వెయ్యిమంది ప్రజలు హాజరయ్యారు. బొడ్‌రాల్ సభకు వచ్చిన ప్రజలు రాళ్ళతో ఆజాద్ స్థూపాన్ని నిర్మించగా, ఆర్.పి.సి అధ్యక్షుడు స్థూపావిష్కరణ చేశాడు. పలువురు వక్తలు ఆజాద్ అమరత్వాన్ని ఎత్తిపడుతూ ప్రసంగించారు. కామ్రేడ్ ఆజాద్ ప్రజలకు, పార్టీకి అందించిన సేవలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఎల్.ఓ.ఎస్ కమాండర్ పిలుపునిచ్చాడు.

## విజయవంతమైన పి.ఎల్.జి.ఎ దశాబ్ది ఉత్సవాలు

2010 డిసెంబర్ 2 నుండి నెలరోజుల పాటు పి.ఎల్.జి.ఎ దశాబ్ది ఉత్సవాలు ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. ఇందులో భాగంగా మల్కన్‌గిరి డివిజన్ పప్పులూరు ఏరియాలోని దూలగండి పాకెట్‌లో డిసెంబర్ 14న సభ జరిగింది. చుట్టుపక్కల నాలుగు గ్రామాల నుండి ప్రజలు సభకు హాజరయ్యారు. మహిళా సంఘం అధ్యక్షురాలు జండా ఆవిష్కరించి పి.ఎల్.జి.ఎ ఆవిర్భావం గురించి మాట్లాడింది. ఎల్.ఓ.ఎస్ కమాండర్ మాట్లాడుతూ దోపిడి పాలకవర్గాలు ఆదివాసుల అటవీ సంపదలను దోచుకుంటూ గ్రీన్‌హంట్ పేరుతో ప్రజలపై యుద్ధాన్ని సాగిస్తున్నారని, ఈ యుద్ధాన్ని ఓడించడానికి యువతీ యువకులు వేలాదిగా పి.ఎల్.జి.ఎ.లోకి రిక్రూట్ కావాలని పిలుపునిచ్చాడు.

మల్కన్‌గిరి ఉమ్మడి డివిజన్‌లోని గుమ్మ ఏరియాలో మూడు చోట్ల పి.ఎల్.జి.ఎ దశాబ్ది ఉత్సవాల సభలు జరిగాయి. డిసెంబర్ 4న ఓండ్రాయల్ గ్రామంలో జరిగిన సభలో 250 మంది, డిసెంబర్ 28న రబ్బ గ్రామంలో జరిగిన సభలో 150 మంది, డిసెంబర్ 31న బోక్లే గ్రామంలో జరిగిన సభలో 500 మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ సభలకు ఏ.సి.ఎం, ఏ.సి కార్యదర్శి నేతృత్వం వహించారు. బోక్లే గ్రామంలో జరిగిన సభకు బలిమెల–చిత్రకొండ నది ఇరువైపుల వున్న 7 గ్రామాల ప్రజలు హాజరయ్యారు. స్థానికంగా ఉపయోగించే డొంగ (పడవ)లపై నదిలో ఊరేగింపు జరిపి సభావేదిక వరకు కొనసాగించారు.

ఏ.సి కార్యదర్శి పి.ఎల్.జి.ఎ ఆవిర్భావం, చరిత్ర, దశాబ్దకాలంలో సాధించిన విజయాల గురించి వివరించాడు. ఆదివాసీ ప్రాంతాలలోని లక్షల కోట్ల విలువైన ఖనిజసంపద, జలవనరులను లూటీ చేయడానికి దోపిడి పాలకవర్గాలు చేస్తున్న కుట్రలు, ప్రవేశ పెడుతున్న సంస్కరణల గురించి వివరించాడు. ఈ సంస్కరణలను తిప్పికొట్టి అడవి, నీరు, భూమి (జల్, జంగల్, జమీన్)పై ఆదివాసుల హక్కుల కోసం పోరాడాలని వనరుల లూటీ కోసం దోపిడి పాలకవర్గాలు అమలు చేస్తున్న గ్రీన్‌హంట్ దాడిని ఓడించడానికి పి.ఎల్.జి.ఎ.లోకి యువతీ, యువకులు వేలాదిగా రిక్రూట్ కావాలని పిలుపునిచ్చాడు.

కొత్తగా రిక్రూట్ అయిన సభ్యులతో సభలో ప్రతిజ్ఞ చేయించారు. వెల్లివిరిసిన ఆనందోత్సాహాల మధ్య పి.ఎల్.జి.ఎ దశాబ్ది ఉత్సవాల సభలు విజయవంతమయ్యాయి.

## బూటకపు సంస్కరణలను, నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ...

నారాయణపట్నా బ్లాక్‌లో ప్రభుత్వం పాలూరు, పాడపాదర్‌లలో బి.ఎస్.ఎఫ్., సి.ఆర్.పి.ఎఫ్. పోలీసు శిబిరాలను పెట్టి ప్రజలపై దాడులు చేయిస్తున్నది. మరోవైపు ఇందిరా ఆవాస్ ఇళ్లు లాంటి పథకాలను ప్రవేశపెట్టి, 'జన సంపర్క్ శిబిర్'లను నిర్వహిస్తూ బూటకపు సంస్కరణలతో ప్రజలను పక్కదారి పట్టించాలని చూస్తున్నది. ఈ కుట్రను తిప్పికొడుతూ నారాయణపట్నా బ్లాక్ తెంతులిపాదర్ పంచాయితీలో 2011 జనవరి 5న ఛసి ములియా సంఘం, మహిళా సంఘాల సంయుక్త నాయకత్వంలో బహిరంగ సభ జరిగింది. ఛసి ములియా సంఘం పంచాయితీ కమిటీ అధ్యక్షుడు ఈ సభకు అధ్యక్షత వహించగా, సంఘ సభ్యులు వక్తలుగా మాట్లాడారు. భూ పోరాటం చేస్తున్నందుకు అరెస్టులు చేసి జైల్లో పెడుతున్నారనీ, చంపుతున్నారనీ, మహిళలపై అత్యాచారాలు చేస్తున్నారనీ, పోలీస్ క్యాంపులు పెట్టాక ఇళ్లల్లో దొంగతనాలు చేస్తున్నారనీ, ఈ ప్రభుత్వ,

పోలీసుల కుట్రను అర్థం చేసుకొని, ప్రజలు సంస్కరణలను తిప్పికొట్టాలని ప్రజలకు సభ పిలుపునిచ్చింది. అలాగే పోలీసు క్యాంపులు ఎత్తివేయాలని ఇప్పటికే పోలీసు దాడుల్లో చనిపోయిన కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలనీ సభ డిమాండ్ చేసింది. ఈ సభకు సుమారు వెయ్యి మందికి పైగా ప్రజలు హాజరయ్యారు.

## మార్చి 8 సందర్భంగా సభలు

ఈ సంవత్సరం మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా దినాన్ని పురస్కరించుకొని నారాయణపట్నా బ్లాక్ బలిపట్ట పంచాయితీ కేంద్రంలోనూ, బందుగాం బ్లాక్ కత్తులపేట పంచాయితీలోనూ విప్లవ ఆదివాసీ మహిళా సంఘం, ఛసి ములియా ఆదివాసీ సంఘంతో కల్సి బహిరంగ సభలను నిర్వహించింది. ఈ సభలు ఉదయం బలిపట్టలోనూ, మధ్యాహ్నం కత్తులపేటలోనూ జరిగాయి. సభల్లో మహిళా సంఘం అధ్యక్షురాలు సున్నో, ఛసి ములియా సంఘం నాయకుడు నాచిక లింగలతో పాటు ఉత్కళ మహిళా సమితి రాష్ట్ర అధ్యక్షురాలు విష్ణుప్రియ రౌథొ, నిశాన్ పత్రికా సంపాదకులు రుమితలు వక్తలుగా పాల్గొన్నారు. వీరంతా మార్చి 8 ప్రాధాన్యతను వివరిస్తూ, ఆదివాసీ సమాజంలో వున్న తెగ పితృస్వామ్యానికి వ్యతిరేకంగా పోరాడాలనీ, మహిళలంతా మహిళా సంఘంలోకి సంఘటితం కావాలనీ, భూ పోరాటంలో, సారా వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సాంస్కృతిక బృందం కళాకారులు మహిళా సమస్యలపై పాటలు పాడి వినిపించారు. ఈ సభలకు వేలాది మంది మహిళలు ఎర్రజెండాలు పట్టుకొని హాజరయ్యారు.

ఈ సభలకు పిలవక పోయినా బిజెడి పార్టీ జిల్లా అధ్యక్షుడూ, ఎం.పి. జయ్‌రాం పాంగి కొడుకూ, శాంతి సంఘం నేత అయిన అశోక్ పాంగి వచ్చి, వేదిక ఎక్కి ప్రసంగించాడు. ప్రజా వ్యతిరేకి అయిన ఇతనిని వేదికను ఎక్కనివ్వకుండా నిరోధించకపోవడం తీవ్రమైన లోపమని సభ అనంతరం మహిళా సంఘం, ఛసి మూలియా సంఘాలు సమీక్షించి, ప్రజల ముందు తమ తప్పును ఒప్పుకున్నాయి.

## మార్చి 8 శ్రామిక మహిళా దినోత్సవ సభలు

ఉత్తర తెలంగాణలోని ఖమ్మం జిల్లా, వెంకటాపురం ఏరియా పూజారి కాంకేర్ ఆర్.పి.సి పరిధిలో భీమారం గ్రామంలో మార్చి 8 మహిళా దినోత్సవ సభ జరిగింది. ఈ సభకు 15 గ్రామాల నుండి 400 మంది ప్రజలు హాజరైనారు. చెన్నాపురం ఆర్.పి.సి పరిధిలో ఎర్రపాడు గ్రామంలో జరిగిన సభకు పది గ్రామాలనుండి 110 మంది ప్రజలు హాజరైనారు. ఈ సభలకు జనమిలీషియా రక్షణ కల్పించగా రైతుకూలి సంఘం నాయకత్వం వహించింది. నిత్య నిర్బంధంలో కూడా మహిళాదినోత్సవ సభలు జరుపుకోవడం ఏరియాలోని ప్రజలకు ఎంతో ఉత్తేజాన్నిచ్చింది.

# నిర్బంధ వ్యతిరేక ప్రతిఘటనా చర్యలు

### ఎ.ఓ.బిలో...

## శత్రు కమ్యూనికేషన్, రక్షణ నిర్మాణాల ధ్వంసం :

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన గ్రీన్‌హంట్ దాడికోసం వేలాది బి.ఎస్.ఎఫ్, సి.ఆర్.పి.ఎఫ్, కోబ్రా బలగాలను మొహరిస్తున్నారు. ఈ బలగాల కోసం ముఖ్యమైన కేంద్రాల్లో, రోడ్డు పక్కనున్న పెద్దగ్రామాల్లో ఇప్పటికే నిర్మాణమై వున్న గ్రామ పంచాయితీ భవనాలు, పాఠశాలలు, ఆసుపత్రులు మొదలైన వాటిని ఆక్రమించుకొని పోలీసు క్యాంపులుగా మార్చారు. కొన్నిచోట్ల గ్రామ పంచాయితీ కార్యాలయాలు, పాఠశాలల పేరుతో కొత్తగా నిర్మాణాలు చేస్తున్నారు. ఇవి మొమ్మాటికీ కార్పెట్ సెక్యూరిటీలో భాగంగా పోలీసు క్యాంపుల ఏర్పాటు కోసమేననేది స్పష్టమే. కార్పెట్ సెక్యూరిటీని అడ్డుకొనేందుకు పార్టీ నిర్ణయంలో భాగంగా ఇటువంటి నిర్మాణాలను అనేక చోట్ల పి.ఎల్.జి.ఎ, మిలీషియా బలగాలు ధ్వంసం చేశాయి.

ఈ ప్రతిఘటనలో భాగంగా మల్కనగిరి డివిజన్ కలిమెల ఏరియాలోని కాంగేర్‌కొండ, 21వ నంబర్ బెంగాలీ క్యాంపు, చింతలవాడ, తెంతులిగూడ, మల్లవరం, మన్నెంకొండలలో పోలీసుక్యాంపులు పెట్టడానికి ప్రయత్నిస్తున్న భవనాలను మిలీషియా ధ్వంసం చేసింది. అదేవిధంగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని ముఖ్యమైన కేంద్రమైన పాడియా బ్లాక్ కేంద్రం, నెల్లంలలో ప్రభుత్వ కార్యాలయాలను మిలీషియా ధ్వంసం చేసింది. మాచ్‌ఖండ్ ఏరియా కొయిరిపుట్ బ్లాక్, మడకపొద్దూర్ గ్రామంలో, గుప్తేశ్వర్ ఏరియా బైపరిగూడ బ్లాక్ కేంద్రంలో, కొలియంటాల్ గ్రామంలో, కోరుకొండ బ్లాక్ బలిమెల పంచాయితీ పొట్టేర్ ప్రాంతంలోని 4వ నంబర్ గ్రామంలోను పంచాయితీ భవనం, కమ్యూనికేషన్ సెల్ టవర్లను మిలీషియా ధ్వంసం చేసింది.

## ఫారెస్టు ఆఫీసు ధ్వంసం :

గుప్తేశ్వర్ ఏరియాలోని దండాబడి పంచాయితీలో ఫారెస్ట్ అధికారులు ప్రజలను అడవి నుండి కట్టెలు తెచ్చుకోనీయకుండ దండుగలు వేసి, సైకిళ్ళు గుంజుకొని నానా ఇబ్బందులు పెడుతున్నారు. దీనికి వ్యతిరేకంగా మిలీషియా నాయకత్వంలో ప్రజలు అక్కడి ఫారెస్ట్ ఆఫీసులను ధ్వంసం చేసి అధికారులు గుంజుకున్న సైకిళ్ళు, ఆఫీసులోని ఫర్నిచర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

*(...చివరిపేజీ తరువాయి)*

చేయడం మొదలు పెట్టాడు. నక్సలైటు అని ముద్రవేసి కార్మికుల నుండి అతన్ని దూరం చేయాలనుకున్న రివిజనిస్టుల, దళారీ యూనియన్ల కలలను భగ్నం చేశాడు. గతంలోకన్నా శక్తివంతంగా కార్మికుల లోనికి చొచ్చుకుపోయాడు.

2001లో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఎ.పి.ఎస్. ఆర్.టి.సి. సమ్మెకు ముందు జరిగిన జాయింట్ యాక్షన్ కమిటీ (జాక్) మీటింగ్‌కు హాజరయ్యాడు. జీత భత్యాల డిమాండ్‌ను ప్రధానంగా చర్చిస్తున్నప్పుడు ఆర్.టి.సి. పరిరక్షణ డిమాండ్ మొదట చర్చించాలని ప్రతిపాదన చేసాడు. అలా చేయకుంటే ప్రభుత్వం కార్మికులను ప్రజల నుండి దూరం చేసి ఉద్యమాన్ని దెబ్బతీస్తుందని వివరించాడు. డిమాండ్ల పట్టికలో 17వ స్థానంలో వున్న ఆర్‌టిసి పరిరక్షణ డిమాండు మొదటి స్థానానికి వచ్చేలా కృషి చేసాడు.

సమ్మె ప్రారంభానికి ముందే కార్మికులలో విస్తృతంగా ప్రచారం చేస్తూ సమ్మెకు సిద్ధం చేసాడు. ఐక్య సంఘటన నిర్మించాడు. సమ్మె జరుగుతుండగా శ్రీనివాస్‌ను అరెస్టు చేసారు. సి.ఆర్.పి.ఎఫ్.ను ఉపయోగించి బస్సులు తిప్పాలని ప్రయత్నం చేసారు. ఇలా జరుగుతుందని ముందుగానే ఊహించిన శ్రీనివాస్ తను స్టేషన్‌లో వుంటూనే కార్మికులతో మిలిటెంట్ దాడులు చేసేలా ప్లాన్ చేసాడు. సమ్మె విజయవంతం అయింది.

ప్రైవేటు రంగంలోనూ తన కృషిని కొనసాగించాడు. 2000 మార్చిలో రాజమండ్రి ప్రైవేటు బస్సులలో పనిచేస్తున్న 16 మంది కార్మికులను యాజమాన్యం విధుల నుండి తొలగించింది. రెండు నెలలు కృషి చేసి చీలిపోయిన కార్మికులను ఐక్యం చేసాడు. ఈ ఆందోళనకు మిత్ర పక్షాలూ, ప్రతి పక్షాలు మద్దతు తెలుపకుండా వుండలేని పరిస్థితి. నిరాహార దీక్ష శిబిరం నడుపుతూనే, మిలిటెంట్ దాడులు చేయించాడు. ఫలితంగా అందరినీ విధుల్లోకి తీసుకోవడంతో పాటు మొత్తం సమస్యలను పరిష్కరించారు.

ఐక్య సంఘటనలను నిర్మించి నడిపించడంలోనూ కామ్రేడ్ శ్రీనివాస్ మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించేవాడు. పోరాటాలను చేపట్టడానికి ముందు కింది స్థాయి నుంచి చర్చించి నిర్ణయాలను తీసుకునేవాడు. డిమాండ్ల విషయంలో రాజీ పడకుండా వుండేటట్లు కార్మికులను నిలబెట్టేవాడు. తటస్థంగా వుండే వాళ్లను ఉద్యమం వైపు నిలబెట్టేవాడు. ప్రభుత్వాన్నీ, యాజమాన్యాలను ఒంటరి చేసేవాడు. జిల్లాలో జరిగే ప్రతి ఐక్య సంఘటన వెనుక శ్రీనివాస్ ఏళ్ల తరబడి చేసిన కృషి వుంది. ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన షుగర్ ఫ్యాక్టరీలలోనూ, ఎరువుల ఫ్యాక్టరీలలోనూ జరిగిన ఐక్య సంఘటనా పోరాటాలలో పని చేసాడు. దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలనూ, మేడే సందర్భంగా బహిరంగ సభలను విజయవంతం చేయడానికి కృషి చేసేవాడు.

కార్మికుల సమస్యల విషయంలో ఏ మాత్రం రాజీ పడేవాడు కాదు. వారు ఎంత దుర్మార్గాలకు పాల్పడుతున్నారో నిర్మొహమాటంగా చెప్పేవాడు. అధికార్ల అవినీతి గురించి ఆధారాలతో సహా వివరించేవాడు.

రవాణా రంగానికి అనుబంధమైన ఆటో, రిక్షా కార్మికులతో, హోటల్ కార్మికులతో నిత్యం సంబంధాలు నెరిపేవాడు. నిరంతరం వారికి విప్లవ రాజకీయాలు వివరిస్తుండేవాడు. తాగుబోతులను, లుంపెన్‌లను కార్యకర్తలు గాను, సానుభూతిపరులు గాను తయారు చేసాడు. తన చుట్టు ఎల్లప్పుడూ ఒక ఉత్సాహకరమైన వాతావరణం వుండేది. కార్మికరంగంలో పది సంవత్సరాలకు పైగా పూర్తికాలం కార్యకర్తగా పనిచేసాడు. వందల సంఖ్యలో ఆందోళనలు చేపట్టాడు. శ్రీనివాస్ మంచి రచయిత, ఉపన్యాసకుడూ, గాయకుడు. అతను రాసే కరపత్రాలు సరళంగాను, సూటిగా వుండి కార్మికులను పోరాటానికి సిద్ధం చేసేవి.

ఆర్‌టిసి రంగానికి సంబంధించి శ్రీనివాస్ రెండు పుస్తకాలను రాశాడు. తను రాసిన 'ప్రమాదం అంచున ప్రగతి రథ చక్రాలు' అనే పుస్తకం శ్రమజీవి ప్రచురణగా విడుదలైంది. ఈ పుస్తకంలో ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనం కోసమే ఆర్‌టిసిని జాతీయం చేసిందని వివరించాడు. రాజీవ్ గాంధీ ప్రభుత్వం ఎమ్.వి. ఆక్ట్‌ను ఎందుకు సవరించిందో దాని పర్యవసానాలు ఆర్‌టిసిని ఎలా దెబ్బతీస్తున్నాయో వివరించాడు.

అలాగే '2001 సమ్మె అనుభవాలు – గుణపాఠాలు' అనే మరో పుస్తకంలో ప్రజల మద్దతుతో సమ్మె విజయం సాధించినప్పటికీ నాయకత్వ లొంగుబాటు కారణంగా పాక్షిక డిమాండ్లు సాధించుకున్నామని వివరించాడు. ఆర్‌టిసి నుండి ప్రభుత్వం వైదొలగాలని ప్రతిపాదించాడు. ప్రజల, యూనియన్ల భాగస్వామ్యంతో ఆర్‌టిసిని సమర్థవంతంగా నిర్వహించవచ్చని ఆధారాలతో సహా నిరూపించాడు.

ఆర్‌టిసికి సంబంధించి పది పాటల వరకు రాసాడు. 'బస్సును నడిపే డ్రైవరన్న – టికెట్లు కొట్టే కండక్టరన్న', 'రారండోయ్ – రారండోయ్ పోరులో చేరండోయ్', 'క్యాజువల్ కార్మికులన్నా – వాళ్ల కష్టాల కథ వినరన్నా' మొదలైనవి.

ఈ క్రమంలో కార్మిక రంగానికి ఆర్గనైజరుగా పని చేసిన అమరుడు కామ్రేడ్ బీరం జనార్ధన్ ఇచ్చిన పిలుపుతో 2002 సెప్టెంబర్ 31న అజ్ఞాత జీవితాన్ని ఎంచుకున్నాడు. శ్రీకాకుళంలో దళ సభ్యుడిగా జీవితాన్ని ప్రారంభించాడు. డాక్టర్‌గా పని చేసాడు. తరువాత పార్టీ అవసరాల రీత్యా ఒడిశా పట్టణాలలో పని చేసాడు. ప్రజా సంఘాల నిర్మాణానికి కృషి చేసాడు. మధ్య తరగతి కుటుంబాల నుండి విప్లవ రాజకీయ కార్యకర్తలను, బుద్ధి జీవులను ఎదిగించే కృషి చేసాడు.

2007లో జరిగిన నయాగఢ్ ఆపరేషన్‌లో తన వంతు పాత్ర

నిర్వహించాడు. నిర్వాసితుల సమస్యలలో భాగంగా నియమగిరి – కాశీపూర్ ప్రాంతంలో ఆర్గనైజర్‌గా పని చేస్తూ పార్టీ ప్రవేశానికి కృషి చేసాడు.

2010 జనవరిలో నియమగిరి – కాశీపూర్ ప్రాంతంలో దళం ప్రారంభమయ్యింది. కాశీపూర్‌లో డ్యాంను వ్యతిరేకిస్తూ గతం నుంచి ప్రజలు పోరాడుతున్నారు. నియమగిరిలో ఆదిమ జాతిగా పిలవబడే డొంగిరియా, కుయి ప్రజలు వేదాంత కంపెనీకి వ్యతిరేకంగా పోరాడుతున్నారు.

దళం ఏర్పడిన ఒక సంవత్సర కాలంలోనే ఆ ప్రాంతంలో పార్టీ ప్రభావాన్ని వేసాడు. రాత్రీ పగలు ప్రజలతో రాజకీయాలు చర్చిస్తూ అర్థం చేయిస్తూ వుండేవాడు. న్యూ డెమోక్రసీ ప్రభావం కింద వున్న నియమగిరిని పూర్తిగా, మావోయిస్టు పార్టీ రాజకీయాల వైపు తీసుకు వచ్చాడు. అన్ని గ్రామాలలో మహిళా సంఘాలను, మిలీషియాను, నియమగిరి సురక్షా సమితిని ఏర్పరిచారు.

దళారీలను ఒంటరి చేసి, వుంటే ప్రజలతో వుండాలని లేదంటే గ్రామాలను విడిచిపోవాలని ప్రజలే నిర్ణయించేలా చేసాడు. ప్రజలందరూ కలిసి దళారీలపై దాడులు చేసి కంపెనీ ఇచ్చిన టీవీలను, జనరేటర్లను తగులబెట్టారు. నియమగిరి ప్రజల ఆందోళన వల్ల, బుద్ధి జీవుల మద్దతుతో ప్రభుత్వం ఒక అడుగు వెనక్కువేసింది.

2010 సెప్టెంబర్‌లో కాశీపూర్ ప్రాంతంలో కలరా వ్యాధితో వందల మంది చనిపోయారు. ఆ గ్రామాల పరిస్థితి చూసి చలించిపోయాడు. మూడు పంచాయితీల గ్రామాల ప్రజలను ఏకం చేసి, లెల్లిగుమ్మ రైల్వే స్టేషన్ వద్ద రైలురోకో చేయించాడు. వైద్య బృందాలను పంపాలనీ, ఏరియాలో హాస్పిటల్ నిర్మాణం చేయాలనీ, హైస్కూలు, హాస్టల్ వసతులు కల్పించాలనే ప్రధానమైన డిమాండ్లతో రైల్‌రోకో జరిగింది. ప్రభుత్వం వెంటనే వైద్య బృందాలను గ్రామాలకు పంపింది. తరువాత ఆరు నెలలకు హాస్పిటల్, హాస్టల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువరించింది. ఏరియాలో వున్న సర్పంచులను పిలిపించి రేషన్ దినుసులు సక్రమంగా పంపిణీ అయ్యేలా కృషి చేసాడు. సారా వ్యతిరేక ఉద్యమం నడిపించాడు.

ప్రజలను రాజకీయంగా కూడగడుతూనే డాక్టరుగా సేవలందించాడు. చావు బతుకుల మధ్య వున్న ఎందరో పసిపిల్లలను కాపాడాడు. పిల్లల ఆరోగ్యం కోసం దళం ప్రయాణాన్ని వాయిదా వేసిన సందర్భాలు కూడా వున్నాయి. తన వద్ద వ్యక్తిగత సామాను కన్నా మందుల బరువే ఎక్కువ వుండేది. దళంలో ఎంతో మంది డాక్టర్లను తయారు చేసాడు. తన దళంలో మెజారిటీ సభ్యులు మందులు మోసుకు తిరిగేవారు.

దళం ప్రారంభం నుంచి పార్టీ నియమ – నిబంధనలు అమలుపరచాలని తాపత్రయపడేవాడు. నిబంధనల ప్రకారం ఏ వస్తువు ఎంత కాలం వాడాలో సభ్యులకు అర్థం చేయిస్తూ వుండేవాడు. పార్టీ కార్యక్రమం, వ్యూహం – ఎత్తుగడలను తరచుగా క్లాసులు చెబుతూ పార్టీ సిద్ధాంతం పట్ల విశ్వాసాన్ని పెంపొందించేవాడు. స్కూలు నడిపించే విషయంలో శ్రద్ధ తీసుకునేవాడు.

కామ్రేడ్ శ్రీనివాస్ ఆదర్శంగా వుండేవాడు. అందరూ తిన్న తరువాతే చివరగా తినేవాడు. అడవిలో నడిచేటప్పుడు తరచు పడిపోతుండే వాడు. అయినా జనవరి నెలలో దళం ఆరంభించిన తరువాత ఆగస్టులో దళ సభ్యులందరూ బూట్లు తొడుక్కున్న తరువాతే తను తొడుక్కున్నాడు. సమానత్వం అనేది మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపించాడు. ప్రజలపై ఆధారపడి బతకాలని తపించేవాడు. ప్రజలను అడగకుండా తీసుకున్న నిమ్మకాయలు, కమలాలు వంటి వాటికి ధర చెల్లించేవాడు.

పార్టీ లోపల జరుగుతున్న ఆర్థిక దుబారాను అరికట్టాలని అన్య వర్గ ధోరణులకు వ్యతిరేకంగా పోరాడాలని చెప్పేవాడు. విమర్శ– స్వయం విమర్శ సందర్భంగా తనలో వున్న పితృస్వామ్య భావజాలం గురించి వివరించేవాడు. పార్టీ తనపై తీసుకున్న క్రమశిక్షణా చర్యల గురించి వివరిస్తూ స్వయం విమర్శ చేసుకునే విషయంలో తను ముందుండి మిగిలిన వారికి ఆదర్శప్రాయుడయ్యాడు. సెంట్రీలు చేసేవాడు. కిచెన్ సామాన్లు మోసేవాడు. త్యాగంలోనూ, కష్టంలోనూ ముందుండేవాడు. ప్రతి ఒక్కరిని తనతో సమానంగా గౌరవించే వాడు. కార్మిక వర్గ ప్రతినిధి అయిన కామ్రేడ్ శ్రీనివాస్ తన వర్గ భావజాలానికి విరుద్ధంగా ఎన్నడూ ప్రవర్తించలేదు.


ఆర్.టి.సి. రంగంలోనే పనిచేసే ఒక కామ్రేడ్‌తో 2004లో కామ్రేడ్ శ్రీనివాస్ వివాహం జరిగింది. వారిది ప్రేమ వివాహం. ఒక గురువుగా, స్నేహితుడుగా, సహచరుడిగా ఆమెపై అతను అపారమైన ప్రభావాన్ని వేశాడు.

వేదాంత కంపెనీకి సిఇఓగా పని చేసిన చిదరంబం ఈ ఎన్‌కౌంటర్ ఘటనతో సంతోషపడవచ్చు. కానీ అది తాత్కాలికమైనదే. స్వంత ప్రాంతాన్ని, రాష్ట్రాన్ని దాటి వచ్చి ప్రజల కోసం ప్రాణాలిచ్చిన రవిని, అతని ఆదర్శాలను ఈ ప్రాంత ప్రజలు మరిచిపోరు. ఎన్‌కౌంటర్ జరిగిన తరువాత ప్రజలు స్పందించిన తీరే అందుకు నిదర్శనం. ఎన్‌కౌంటర్ వార్త విన్న ప్రజలు అన్నాలు వండుకు తినలేదని, కళ్లు మూసినా, తెరిచినా రవి అతని సహచరులు కనబడుతున్నారని విలపిస్తూ చెప్పారు. వారిని హత్య చేసిన పోలీసులను ప్రభుత్వాన్ని శాపనార్థాలు పెట్టారు.

కామ్రేడ్ రవి పది సంవత్సరాలు కార్మికరంగంలోనూ, తొమ్మిది సంవత్సరాలు ప్రత్యక్ష విప్లవ రాజకీయాలలోనూ సేవలందించాడు. ప్రజల ప్రయోజనాలే ప్రాణంగా బతికిన వాడు. ఎన్నో వేల మందికి స్నేహితుడు, రాజకీయ గురువు. కమ్యూనిస్టు విలువలను జీవితంలో ఆచరించి చూపిన ఆదర్శనీయుడు. కామ్రేడ్ శ్రీనివాస్ త్యాగాన్ని ఆదర్శాలను కొనసాగిస్తూ అమరుల ఆశయ సాధనకై కృషి చేద్దాం.

# కామ్రేడ్ దువ్వూరి శ్రీనివాస రావు (రవి) అమర్ రహే!

బహుళ జాతి కంపెనీల ప్రయోజనాల కోసం ప్రభుత్వం 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' పేరుతో ప్రజల మీద యుద్ధం ప్రకటించింది. ప్రజలకు నాయకత్వం వహిస్తున్న మావోయిస్టు పార్టీని, నాయకత్వాన్ని నిర్మూలించడమే దీని లక్ష్యం. ఇందులో భాగంగా 2011 జనవరి 9న బాసంగమాళి గ్రామంలో ఉదయం 6 గంటలకు ఎస్ఒజి పోలీసులు నియమగిరి దళంపై చేసిన మూకమ్మడి దాడిలో రవితో పాటు 8 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు.



కామ్రేడ్ రవి అసలు పేరు దువ్వూరి శ్రీనివాస రావు. తూర్పు గోదావరి జిల్లా, జగ్గంపేట మండలంలోని కాట్రావుల పల్లి అతని స్వగ్రామం. సూర్యలక్ష్మి, సుబ్బారావు దంపతులకు 1968, ఫిబ్రవరి 14న జన్మించాడు. ముగ్గురి సంతానంలో శ్రీనివాస్ ఒక్కడే కొడుకు. తండ్రి గవర్నమెంటు స్కూలు టీచరు.

కామ్రేడ్ శ్రీనివాస్ చిన్నతనం నుండి చదువులో చురుకుగా వుండేవాడు. క్లాస్ ఫస్టు వచ్చేవాడు. విషయాల్ని తొందరగా గ్రహించేవాడు. ఇంటర్ పూర్తయిన తరువాత కాకినాడలో ఐ.టి.ఐ. చదువుతూ ఊరికి పోవడానికి బస్టాండులో నిలుచొని వుండగా 'భారత దేశం భాగ్యసీమరా ఖనిజ సంపదకు కొదవ లేదురా' అంటూ పాడుతున్న రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్.ఎస్.యు.) వారిని చూసి ఆ పాటకు ఆకర్షితుడయ్యాడు. ఆర్.ఎస్.యు. వారిని కలవడానికి ప్రయత్నం చేస్తుండగా వారిని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకుపోయారు. తరువాత పార్టీని కలుసుకోవాలనుకున్న అతని ప్రయత్నాలు ఫలించలేదు.

స్వగ్రామం కాట్రావుల పల్లిలో యువజన సంఘాన్ని స్థాపించాడు. వారితో కలిసి గ్రామానికి చెందిన అనేక సమస్యలపై పోరాటాలు నడిపాడు. దళితులు చేసిన దేవాదాయ భూముల ఆక్రమణ పోరాటానికి ముందు భాగాన నిల్చున్నాడు. బ్రాహ్మణ కులంలో పుట్టిన అతను, కుల తత్వాన్ని నరనరాన జీర్ణించుకున్న అతని బంధువులను ధిక్కరిస్తూ, దళితుల ఇళ్లలో భోజనం చేస్తుండేవాడు. ఈ క్రమంలో కొంతకాలం పాటు శ్రీనివాస్ కుటుంబాన్ని బంధువులు వెలివేసారు. దానికి బదులుగా తాను దళితుడిగా పుట్టనందుకు విచారిస్తున్నానని చెప్పేవాడు.

1990 లో ఎ.పి.ఎస్. ఆర్.టి.సి.లో కండక్టర్‌గా ప్రవేశించాడు. ఈ ఉద్యోగమే శ్రీనివాస్ జీవితాన్ని మలుపుతిప్పింది. కార్మికులు ఎదుర్కొంటున్న బాధలను ప్రత్యక్షంగా చూసాడు. యాజమాన్యం కార్మికులపై చేస్తున్న దోపిడీని, దాడినీ పరిశీలించాడు.

1991లో గోకవరం డిపోలో యాజమాన్య అణచివేతకూ, దోపిడీకి వ్యతిరేకంగా కార్మికులు 90 రోజులు ఆమరణ నిరాహార దీక్షలు చేసారు. ఆందోళనను భగ్నం చేయడానికి పోలీసులు కార్మికులను అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ ఉద్యమంలో నాయకుడిగా ఎదిగిన శ్రీనివాస్ ఆనాటి నుండి వెనక్కు తిరిగి చూడలేదు. ఆ క్రమంలో కార్మికుల పక్షాన దృఢంగా నిలబడ్డాడు.

కార్మికులపై యాజమాన్యం బనాయించే తప్పుడు కేసులకు వ్యతిరేకంగా లీగల్ పోరాటాలనూ, నిరసన కార్యక్రమాలను కలిపి ఆందోళన చేపట్టాడు. కార్మికులకు అతనిపై ఎంత విశ్వాసం అంటే శ్రీనివాస్ సమస్య తీసుకుంటే చాలు అది పరిష్కారమవుతుందని నమ్మేవారు.

క్యాజువల్ కార్మికులను విధుల నుండి తొలగించినపుడు ఇంటి వద్దనున్న కార్మికులకు పోస్టు కార్డులు రాసి అందరినీ ఒక చోట చేర్చి ఆందోళన చేపట్టాడు. ఈ ఉద్యమం తరువాత జిల్లాలోనే కాకుండా బయట జిల్లాలలో కార్మికులు కూడా శ్రీనివాస్‌తో సంబంధాలు ఏర్పరుచుకున్నారు.

ఈ క్రమంలో ఎల్లవరం దళ కమాండర్‌గా పనిచేస్తున్న కామ్రేడ్ దేవన్నతో (వడ్కాపూర్ చంద్రమౌళి) పరిచయం ఏర్పడింది. 1998లో తన స్వగ్రామం కాట్రావుల పల్లిలో సహచరులతో కార్మికుల సమస్యలపై చర్చిస్తున్నప్పుడు, యాంటీ నక్సల్స్ స్క్వాడ్ పోలీసులు ఇంటిని చుట్టుముట్టి శ్రీనివాస్‌ను ఎత్తుకుపోయారు. కామ్రేడ్ దేవన్న అపాయింట్‌మెంట్ చెప్పమని చిత్రహింసలకు గురి చేశారు. కరెంటు షాకులు పెట్టారు. అతని విడుదల కోరుతూ కార్మికులు కుటుంబాలతో సహా కలెక్టర్ ఆఫీసును ఘెరావ్ చేసారు. నాలుగు రోజుల ఆందోళన తర్వాత తుపాకులూ, పేలుడు సామాగ్రి దొరికిందని అబద్ధాలు చెబుతూ అరెస్టు చూపించి, జైలుకు పంపించారు. జైలు జీవితం అనంతరం కార్మికులలో తిరిగి పని

*(మిగతాది 36వ పేజీలో...)*